Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com





తిరుపతి TIRUPATHI | సంపుటి : 02 | సంచిక : 23 | శుక్రవారం | ఆగస్టు 28, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 23 | Friday | 28 AUGUST 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## రాజధాని గ్రామాల్లో 1437 కోట్ల రూ.లతో

## మౌలిక సదుపాయాల కల్పన



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

రాజధాని గ్రామాల్లో రూ.1437 కోట్లతో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోదం తెలిపిందని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ చెప్పారు.గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమవేశ వివరాలను ఆయన సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో రూ.596 కోట్లతో సెంట్రలైజ్డ్ పబ్లిక్ లైబ్రరీ,ఆడిటోరియం,హ్యూమన్ రిసోర్స్ భవనాలు నిర్మాణానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందని తెలిపారు.

**లైబ్రరీ,ఆడిటోరియం,హెచ్ఆర్ భవనాల నిర్మాణానికి రూ.596 కోట్లు**

- మంగళగిరి పట్టణానికి రోజుకు 30 ఎంఎల్డీ త్రాగునీరు సరఫరా
- రాజధాని గ్రామాలకు సైతం ఇకపై రోజుకు 135 లీటర్లు త్రాగునీరు సరఫరా
- ఇన్నర్ రింగ్ రోడ్,రైల్వే లైన్ల నుండి రాజధాని వరకు గల భూమి ల్యాండ్ పూలింగ్ కు అనుమతి
- రాజధాని ప్రాంతంలోని గ్రామాలన్నిటిలో ఇక అన్నిబీటీ రోడ్లే
- పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ

ముఖ్యంగా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లో భాగంగా రహదారులు,అండర్ గ్రౌండ్ డ్రేనేజీలు,మంచినీటి పైపులు,వీధి దీపాల ఏర్పాటుకు 1437 కోట్ల రూ.లకు అనుమతి ఇచ్చిందని వివరించారు.

- మిగతా 2లో..



## నేపాల్ వరదల్లో 273కి చేరిన మృతులు..

**1300మంది గల్లంతు**

ఖాట్మాండు : నేపాల్-టిబెట్ ఆకస్మిక వరదలతో నేపాల్-టిబెట్‌లో మృతుల సంఖ్య 273కి చేరింది. సుమారు 1,300 మంది గల్లంతయ్యారని రెండు దేశాల అధికారులు గురువారం వెల్లడించారు. బాధితులలో చాలామంది ట్రెక్కింగ్, హిందూ క్షేత్ర సందర్శన కోసం వచ్చిన విదేశీయులే ఉన్నారని అన్నారు. సుమారు 270 మంది మరణించారని, 826 మంది గల్లంతయ్యారని పోలీసులు తెలిపారు. తాజా సమాచారం ప్రకారం.. గల్లంతైన వారిలో 113 మంది నేపాలీ పర్యాటకులు, సైన్యం, పోలీసులకు చెందిన 85 మంది భద్రతా సిబ్బంది, అలాగే రసువా జిల్లాకు చెందిన 161 మంది, నువాకోట్ జిల్లాకు చెందిన ఒక స్థానికుడు ఉన్నారని నేషనల్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ పేర్కొన్నట్లు స్థానిక మీడియా తెలిపింది.

2 - పేజీలో..

## చిలకలూరిపేట వద్ద ఘోర ప్రమాదం..

### ఏడుగురి మృతిపై సీఎం దిగ్భ్రాంతి

- పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు.. ఏడుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా వేలూరు గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశం



ప్రజాభూమి ప్రతినిధి, పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, చిలకలూరిపేట వద్ద ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

- మిగతా 2లో..



## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన

**5.90 ఎకరాల్లో రూ.18.55 కోట్ల వ్యయంతో మోడరన్ రైతు బజార్ నిర్మాణం**

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:

దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దేం దుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళగిరి పట్టణం నిడమర్రు రైల్వే గేట్ వద్ద ఆధునిక హంగులతో మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందుగా నిడమర్రు రోడ్డులోని శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు టీడీపీ నా యకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు నమూనా చిత్రాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఆధునిక హంగులతో మంగళగిరిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు :** మంగళగిరి ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి లోకేష్ మోడరన్ రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

- మిగతా 2లో..

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా..

- హైదరాబాద్‌లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక
- నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
- విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్
- నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

2 - పేజీలో..



## హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

- మిగిలిన 5,269 మందికి 31లోగా ఇచ్చేందుకు చర్యలు
- కొత్త వారి కోసం కూడా రాష్ట్రానికి 1.90 లక్షల డోసుల వ్యాక్సిన్ త్వరలో రాక
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

హెచ్ పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

- మిగతా 2లో..

## జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

- మంత్రి అచ్చెన్నాయుడు
- పోలవరం పనులను జగన్ నిర్లక్ష్యం చేశారన్న అచ్చెన్నాయుడు
- ఆ ప్రాజెక్టును గోదావరి జలాల్లో ముంచేశారని మండిపాటు
- గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభిస్తామని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం పనులను నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించి ఉంటే రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులు వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని వ్యాఖ్యానించారు.

వివరాలు 2లో..



## సత్యదేవుని సన్నిధిలో పెళ్లి బృందంపై యువకుల దాడి..!

**రాత్రి 2 గంటల సమయంలో మద్యం సేవించి, ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్‌తో యువకుల వాగ్వాదం**

- పెళ్లి బృందంలోని భక్తులతోనూ గొడవకు దిగి.. దుర్భాషలాడుతూ పిడిగుద్దులతో దాడి చేసినట్లు యువకులపై ఆరోపణలు
- మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి, అడ్డుకునేందుకు వెళ్లిన సెక్యూరిటీ గార్డుపైనా దాడిచేసి పరారైన యువకులు.
- 'హరిహర సదన్' వసతి గదుల వద్ద యువకులను గుర్తించిన పెళ్లి బృందం
- ఘటనపై పోలీసులకు సమాచారం అందించిన దేవస్థానం సిబ్బంది
- ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2 లో



ప్రజాభూమి ప్రతినిధి, అన్నవరం: అన్నవరం వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో మద్యం సేవించిన వ్యక్తులు కొండపైకి చేరుకుని అర్ధరాత్రి సమయంలో భక్తులతో గొడవకు దిగడం పట్ల భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం సేవించిన వ్యక్తులను కొండపైకి అనుమతించింది ఎవరు? టోల్‌గేట్ వద్ద భద్రతా సిబ్బంది ఏం చేస్తున్నారు? ప్రవేశ సమయంలో వారిని ఎందుకు గుర్తించలేకపోయారు? అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడి భద్రతకు దేవస్థానం బాధ్యత వహించాల్సి ఉండగా, మద్యం సేవించి వచ్చిన వ్యక్తులు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడం, భక్తులతో గొడవకు దిగడం, సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసే పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోందని భక్తులు అంటున్నారు.

టోల్‌గేట్ నుంచి కొండపైకి ప్రవేశించే సమయంలో మద్యం సేవించిన వారిని గుర్తించే విధానం లేదా భద్రతా తనిఖీలు లేవా? ఉంటే ఇలాంటి వ్యక్తులు కొండపైకి ఎలా వచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘటనపై దేవస్థానం ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

**అన్నవరం పుణ్యక్షేత్రంలో భద్రతా సిబ్బంది విధులపై భక్తుల ఆవేదన :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో భద్రతా సిబ్బంది విధులను

# సంపాదకీయం

## మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి.

ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది.ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా

తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

## చిలకలూరిపేట వద్ద ఘోర ప్రమాదం..

మృతులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారని అధికారులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## సత్యదేవుని సన్నిధిలో పెళ్లి బృందంపై యువకుల దాడి..!

సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. దేవస్థానంలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించి ఉంటే ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉండేది కాదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అయితే కొంతమంది సెక్యూరిటీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుణ్యక్షేత్రానికి దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రతా వ్యవస్థ మరింత పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తుల భద్రత, దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని భక్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దేవస్థానం ఉన్నతాధికారులు సెక్యూరిటీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పర్యవేక్షణ పెంచాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనీవా ప్రాజెక్టుపై 16 నెలల్లోనే రూ.3,500 కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 74 శాతం మేర పూర్తయిన పోలవరం ప్రాజెక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం రాగానే ఒక ఏడాది పాటు నిరంతరాయంగా పూర్తి చేసి ఉంటే ఇక్కట్లన్నీ తీరేవని, కానీ ఆ ప్రాజెక్టును గోదావరి వరదల్లో ముంచేసి నాశనం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం తిరిగి పోలవరాన్ని గాడిలో పెట్టిందని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, 1995లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారని... ఇప్పుడు ప్రాజెక్ట్‌ను ఆయనే పూర్తి చేసి, జాతికి అంకితం చేయబోతున్నారని చెప్పారు. గతంలో తొండలు కూడా గుడ్లు పెట్టని రాతి నేలల్లో వెలిగొండను నిర్మించామని, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు త్వరలోనే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని తాకబోతున్నాయని వెల్లడించారు.

# రాజధాని గ్రామాల్లో1437 కోట్ల రూ.లతో మౌలిక సదుపాయాల కల్పన



ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో రోజుకు ఒక్కొక్కరికి 40 లీటర్లు నీరు అందిస్తుండగా లెక్కల ప్రకారం ఒక్కో వ్యక్తికి 135 లీటర్లు అందించాల్సి ఉందన్నారు.కావున ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా పైపు లైన్లు కూడా పూర్తిగా మార్చే ప్రతిపాధనకు సిఆర్డిఏ అధారిటీ ఆమోదించిందని తెలిపారు.ఆయా గ్రామాల గుండా వెళు న్న ట్రంక్ రోడ్లకు ల్యాండ్ టూ ల్యాండ్ ఇవ్వడానికి సైతం ఈ నిధులు వినియోగిస్తామని ఇందుకై మరో రూ.533 కోట్లు మంజూరు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.గతంలో ఈ 29 గ్రామాల్లో మౌలిక సౌకర్యాల నిమిత్తం విడుదల చేసిన రూ.904 కోట్లుతో కలిపి మొత్తం రూ.1437 కోట్లతో నూటికి నూరు శాతం మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు.

రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లోని లే అవుట్లలో రహదారులను గతంలో సీసీ రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది అయితే సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ,ఐఐటీ ఖరగ్ పూర్ ఆర్గనైజేషన్ లతో పరిశీలన చేయించగా 54 అడుగుల కంటే తక్కువ వెడల్పు ఉన్న రహదారులను సైతం సీసీ కాకుండా బీటీ రోడ్లుగా మర్చాలన్న అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు.నిపుణుల సలహా మేరకు ఆయా రహదారులను సైతం బీటీ రోడ్లుగా నిర్మించడానికి సీఆర్డీఏ అథారిటీ సమ్మతి తెలిపిందన్నారు.

మంగళగిరి పట్టణానికి ప్రస్తుతం రోజుకు 30 మిలియన్ లీటర్లు(ఎంఎల్డీ)ప్రతి కిలో లీటర్(కెఎల్డీ) రూ.10 చొప్పున ఇవ్వడానికి అనుమతి లభించిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.భవిష్యత్తులో 80 ఎంఎల్డి నీరు ఆపట్టణానికి అవసరం ఉంటుందని తెలిపారు.డిస్ట్రిక్ కూలింగ్ సిస్టమ్ కు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.మిక్స్ డ్ యూజ్ క్రింద ప్రైవేట్ వారికి భూమి ఇవ్వడానికి పిచ్చికలపాలెంలో 7.9 ఎకరాలు,తుళ్లూరులో 5ఎకరాలు,మందడంలో 12.38 మరియు 6 ఎకరాలు, కూరగల్లులో 6 ఎకరాలు ఇలా మొత్తం 42 ఎకరాలు సీఆర్డీఏ గుర్తించడం జరిగిందని వాటికి ఆర్ఎఫ్పి పిలవడానికి అనుమతి లభించిందన్నారు.

రాజధాని ప్రాంతంలో ఇప్పటికే నిబంధనల మేరకు కేటాయించిన భూమి కంటే ఎక్కువ కావాలని కోరుతున్నస్కూల్స్,హోటల్స్ తదితర సంస్థలకు ఎకరా ప్రాథమిక విలువ రూ.4.1 కోట్లు కంటే 250 శాతం ఎక్కువ అంటే సుమారు రూ. 10.25 కోట్లు చెల్లిస్తే వారికి ఆ భూమి అందించడానికి అనుమతి లభించిందన్నారు.రాజధానిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ ఫర్మేషన్ టెక్నాలజీ డిమ్డ్ యూనిర్సిటీ నిర్మాణానికి 8.5ఎకరాలు కేటాయించేందుకు సిఆర్డిఏ అధారిటీ అనుమతిచ్చిందని చెప్పారు.అమరావతి రాజధాని ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ఐఓసీఎల్ తో ఎంవోయూ కుదుర్చుకోవడానికి సీఆర్డీఏకి అనుమతిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

రాజధాని ప్రాంతంలో నిర్మించే ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే లైన్లు కంతేరు,తాడికొండ ప్రాంతాల గుండా వెళు తున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.రాజధాని ప్రాంతం నుండి వాటి వరకు ఉండే భూములను ల్యాండ్ పూలింగ్ క్రింద తీసుకోవడానికి సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు.రాజధాని ప్రాంతంలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ చేసే భూముల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందన్నారు.అదీ 2026 జనవరి 6 కంటే ముందు వ్యవసాయ రుణాలు తీసుకున్నవారికి రూ.1లక్ష వరకు రుణమాఫీ అందుతుందని స్పష్టం చేశారు.

# నేపాల్ వరదల్లో 273కి చేరిన మృతులు..

**సుమారు 517మంది విదేశీయులు గల్లంతు :** 30 దేశాలకు చెందిన సుమారు 517 మంది విదేశీయులు గల్లంతయ్యారని నేషనల్ టూరిజం బోర్డు వెల్లడించింది. గల్లంతైన వారిలో 179 మంది భారతీయులేనని నేపాల్ పర్యాటక శాఖ వెల్లడించింది. వీరిలో అధిక శాతం మంది హిందువులు పవిత్ర ప్రదేశంగా భావించే టిబెట్‌లోని కైలాసపర్వత యాత్రలో ఉన్నారని పేర్కొన్నారు. టిబెట్‌లోని గిరోంగ్ కౌంటీలో కనీసం ముగ్గురు మరణించారని, 558 మంది గల్లంతయ్యారని ప్రభుత్వ మీడియా నివేదించింది. గల్లంతైన 558 మందిలో 260 మంది విదేశీయులేనని చైనా అధికారిక మీడియా తెలిపింది. నేపాల్ వైపు సుమారు 100 మంది చైనా పౌరులు గల్లంతయ్యారని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. గల్లంతైన వారిలో 65 మంది అమెరికాకు చెందినవారని, అలాగే 51 మంది మలేషియా పౌరులు కూడా ఉన్నారని ఆ శాఖ పేర్కొంది. 55 మంది ఉక్రేనియన్లు గల్లంతయ్యారని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సంఖ్యలో, 47 మంది చొప్పున రెండు పర్యాటక బృందాలు, ఏడుగురు వ్యక్తులు, అలాగే ఒక విదేశీ పర్యాటక బృందంతో ప్రయాణిస్తున్న ఒక ఉక్రేనియన్ మహిళ కూడా ఉన్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. 35 మంది ఆస్ట్రేలియన్లు



గల్లంతయ్యారని బోర్డు తెలిపింది. గల్లంతైన వారిలో 33 మంది బ్రిటన్‌కు చెందిన వారని బోర్డు పేర్కొంది. గల్లంతైన వారిలో 25 మంది కెనడాకు చెందిన వారని నేపాల్ పర్యాటక బోర్డు తెలిపింది.

నేపాల్‌లో జలవిద్యుత్ ప్లాంటు నిర్మాణ పనుల్లో ఉన్న తొమ్మిది మంది పౌరులు గల్లంతయ్యారని దక్షిణ కొరియా ప్రభుత్వ అధికారులు తెలిపారు. నేపాల్ పర్యాటక బోర్డు ప్రకారం, ఎనిమిది మంది సింగపూర్‌వాసులు గల్లంతయ్యారు. జర్మనీకి చెందిన ఎనిమిది మంది పర్యాటకులు, రష్యాకు చెందిన ఎనిమిది మంది, దక్షిణాఫ్రికాకు చెందిన ఆరుగురు, మరియు లాట్వియాకు చెందిన ఆరుగురు పర్యాటకులు గల్లంతయ్యారని నేపాల్ పర్యాటక శాఖ తెలిపింది. స్థానిక నివేదిక ప్రకారం.. ఐదుగురు జపాన్ జాతీయులు గల్లంతయ్యారని, ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు జపాన్ ప్రధాని సనాయ్ తకైచి ఆందోళన వ్యక్తం చేశారు. న్యూజిలాండ్‌కు చెందిన ఐదుగురు, ఫ్రాన్స్‌కు చెందిన నలుగురు, బెల్జియంకు చెందిన ముగ్గురు, స్పెయిన్‌కు చెందిన ముగ్గురు సందర్శకులు కూడా గల్లంతయ్యారని నేపాల్ పర్యాటక మండలి తెలిపింది.ఇటలీ, కజకిస్తాన్, పోర్చుగల్, ఐర్లాండ్ మరియు నెదర్లాండ్స్ నుండి ఇద్దరేసి చొప్పున వ్యక్తులు గల్లంతయ్యారని బోర్డు తెలిపింది. బెలారస్, ఫిన్లాండ్, హంగరీ, ఇజ్రాయెల్, లిథువేనియా, ఫిలిప్పీన్స్, బల్గేరియా, స్విట్జర్లాండ్, సెర్బియా మరియు స్వీడన్ నుండి ఒక్కొక్కరు చొప్పున మరో 10 మంది కూడా గల్లంతయ్యారని అది పేర్కొంది

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్లు దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి 3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు.తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి వ్యాక్సిన్ కోసం నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు.వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యశీ ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి. దీనికి సమర్ధంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు. వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. “ గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతమైంది. సురక్షితమైంది కూడా. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే వేచి ఉంటున్నారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. గార్డాసిల్-4 క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సింగిల్ డోస్ విధానంలో 0.5 మి.లీ. మోతాదుగా ఎడమ పైభుజంలో ఇంట్రామస్క్యులర్‌గా ఇస్తున్నారు” అని చక్రధర్‌బాబు వివరించారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా..

- హైదరాబాద్‌లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక
- నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం
- విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్
- నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :** వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా



పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద ‘సెకండ్ ఒపీనియన్’ తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే ‘డయల్ 112’ కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# మంగళగిరిలో మోడరన్ రైతు బజార్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపన

5.90 ఎకరాల విస్తీర్ణంలో, అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులు రూ.18.55 కోట్ల వ్యయంతో ఈ రిటైల్‌డహోల్ సేల్ కూరగాయల మార్కెట్ ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో పరిశుభ్రంగా, వినియోగదారులకు అనుకూలంగా, పర్యావరణహితంగా ఉండేలా ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటుచేయనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం 71,925 చదరపు అడుగులు. రిటైల్ మార్కెట్ లో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల విక్రయాల కోసం 54 ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఇతర రకాల వస్తువుల కోసం మొత్తం 60 షాపులు ఏర్పాటుచేస్తారు. హోల్ సేల్ మార్కెట్ లో అన్ లోడింగ్ ప్లాట్ ఫామ్స్ 18, కూరగాయల షాపులు 23 ఉండనున్నాయి. కోల్డ్ స్టోరేజీ, వెజిటబుల్ వాష్ ఏరియాస్, అడ్మిన్, మెయింటెనెన్స్ ఏరియాస్, క్యాంటీన్, మరుగుదొడ్లు



నిర్మించనున్నారు. సరుకులు తరలించే వాహనాలు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ జీ.భీముడు, ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీమ్ బాషా, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని అనిత పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన విధులతో దోషరహిత ఓటర్ల జాబితా

**- సర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకే అగ్రస్థానం - ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో చొరవ అభినందనీయం - అక్టోబర్ 3న తుది జాబితా ప్రచురణ వరకు సమష్టి కృషితో ముందుకెళ్లండి - పైస్థాయి నుంచి బీఎల్‌వో వరకు సరైన సమన్వయం, సహకార స్ఫూర్తి కీలకం - జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ప్రతి దశలోనూ నాణ్యతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోపాలకు తావులేకుండా దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సమష్టి కృషి అవసరమని.. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు చూపిన చొరవ అభినందనీయమని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ అన్నారు. గురువారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో రాష్ట్రంలో సర్ పురోగతిపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సమీక్షా, పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఈవో వివేక్ యాదవ్, అదనపు సీఈవో ఎస్.డిల్లీరావుతో పాటు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, గుంటూరు కలెక్టర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ, పల్నాడు కలెక్టర్ డా. కృతికా శుక్లా, తూర్పుగోదావరి కలెక్టర్ కీర్తి చేకూరి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగ రాణి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, బాపట్ల కలెక్టర్ డా. వి.వినోద్ కుమార్, ఆయా జిల్లాల ఈఆర్‌వోలు ప్రత్యక్షం గా హాజరుకాగా వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ, క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ డా. పవన్ కుమార్.. జిల్లాల వారీగా పురోగతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 43,71,397 నోటీసుల పంపిణీ కాగా 16,23,774 నోటీసులపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయింది. ఈ నేపథ్యంలో నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలో ముందంజలో ఉన్న జిల్లాలను అభినందిస్తూ.. మిగిలిన జిల్లాలోనూ నాణ్యంగా, వేగంగా, పారదర్శకంగా సర్ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు. నోటీసులపై విచారణకు సంబంధించి ప్రస్తుతానికి అత్యల్పంగా 15.18 శాతం మాత్రమే పెండింగ్ ఉన్న కర్నూలు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల మధ్య సమన్వయం, సహకారం అనేవి ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కీలక మని.. ఎవరికి ఏ సందేహమున్నా నివృత్తి చేయడం, సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయసహకారాలు సంతృప్తికరంగా అందించడంలో ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఈ సందర్భంగా పవన్ కుమార్ శర్మ సూచించారు. ప్రస్తుత దశలో జిల్లాల్లో




ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, నిబంధనల ప్రకారం సరైన కార్యాచరణపైనా సమావేశంలో చర్చించారు. వృద్ధాప్యం, అనారోగ్యం వంటి వివిధ కారణాల వల్ల విచారణకు హాజరుకాలేని పక్షంలో ఈఆర్‌వో/ఏఈఆర్‌వో - బీఎల్‌వోను సమన్వయం చేసుకుంటూ ఇంటి సందర్శన, వివిధ మార్గాల ద్వారా ఓటర్లకు సహాయసహకారాలు అందించాలన్నారు. అదేవిధంగా నోటీసులపై విచారణ అనంతరం క్వాసీ జ్యుడీషియల్ అధికారి అయిన ఏఈఆర్‌వోలు సమస్యను అర్థం చేసుకొని న్యాయమైన తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశం సందర్భంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితరాల స్వీకరణ, పరిష్కారం తదితర అంశాలనూ డా. పవన్ కుమార్ శర్మ పరిశీలించారు.

# సర్వీస్ ఈనాం భూములపై నిషేధం ఎత్తివేయాలి

**బాబు,లోకేష్, పవన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి జగ్గయ్యపేటలో 30 నుంచి రిలే దీక్షలు ప్రారంభిస్తాం విజయవాడ ధర్నా చౌక్ లో ఆందోళన లకు సిద్ధం ప్రభుత్వానికి సర్వీస్ ఈనామ్ భూ బాధితుల స్పష్టీకరణ**

జగ్గయ్యపేట, ప్రజాభూమి
రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ ఇనాం భూములపై నిషేధం ఎత్తి వేసే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని, అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధమని సర్వీస్ ఈనామ్ భూ బాధితుల సంఘం హెచ్చరించింది. గురువారం పట్టణంలోని జేఆర్సి కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు రంగాపురం నరసింహారావుమాట్లాడుతూ 1956 లో రైత్వారి పట్టాలిచ్చి సర్వీస్ ఇనాం దారులకు సర్వహ క్కులు కల్పించిన ప్రభుత్వం, వాటిని వివిధ కారణాలతోటి అమ్ముకుంటే చెల్లదన డం దుర్మార్గమని అన్నారు.2013లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య మంత్రిగా చేసిన అనాలోచిత నిర్ణయం వల్ల కోట్లాదిమంది ఈ రోజున రోడ్డున పడుతున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. 2019లో చట్ట సవరణ చేసి ఇనాం భూములపై నిషేధం ఎత్తివేసేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని మర్చిపోవడం బాధాకరమని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళారులు రంగ ప్రవేశం చేసి తక్కువ రేటుకు భూముల కొనుగోలు చేసి లబ్ధి పొందాలని చూశారని, కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకొని భూ బాధి తులంతా కూటమికి ఓటు వేశారని అలాంటి వారిని విస్మరించటం తగదన్నారు . రెండేళ్లలో కనీసం సమస్య పరిష్కారానికి కనీస ప్రయత్నం జరగలేదని ఆయన ఆయన వాపోయారు. కూటమి ప్రభుత్వం పై తమకు నమ్మకం ఉందని, సమస్య పరిష్కారానికి అధికారుల మార్గదర్శనం కరువైందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో కదలిక వచ్చి భూములపై నిషేధం ఎత్తివేసే వరకు ఆందోళన చేస్తామని, ఒక్క జగ్గయ్యపేట లోనే పదివేల మంది బాధితులు ఉన్నారని చెప్పారు.

సంఘం నేత గద్దె సుధీర్ మాట్లాడుతూ ఈనాం భూములు దేవా దాయ శాఖ పరిధిలోనికి రావని దేవాల యాల్లో సేవలు చేసిన పరిచారకులకు సంస్థానాధీశులు, జమీందారులు, రాజులు బహుమతిగా ఇచ్చినవే నేనని చెప్పాడు. అధికా రులు ఇవి దేవాలయ భూములుగా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సిహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల పాటు పట్టాలుగా చలామణి భూములు నేడు పనికిరావు అని చెప్పటం ఎంతవరకు




సమంజసం అని ప్రశ్నిం చారు. ఎన్నో వేల కుటుం బాలు ఆ భూములను నమ్ముకొని, ఆధారం చేసుకుని జీవిస్తున్నాయని, పదేళ్లుగా వాళ్ళ అవస్థలను ప్రభుత్వాలు గుర్తించకపోవడం, ఈరోజు న రోడ్డున పడటానికి కారణమని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో వేమూరులో జరిగిన బహిరంగ సభలో చంద్ర బాబు స్వయంగా ఈనాం సమస్య ను పరిష్కరిస్తామని చెప్పారని, కోరుకొండ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్ హామీ ఇచ్చిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. మాజీ ఏఎంసి చైర్మన్ గింజుపల్లి రమేష్మాట్లాడుతూ భూ బాధితుల సమస్య పరిష్కారానికి అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని, దశల వారీగా ఆందోళన రాష్ట్రవ్యాప్తం చేస్తామని చెప్పారు. రాష్ట్ర ఇనాం భూబాధితుల సంఘం ప్రతినిధులు కళ్యాణం మురళి, అచ్యుతరామయ్య* లు మాట్లాడుతూ రాజధాని అమరావతి పరిధిలో ఇనాం భూములను రాత్రికి రాత్రి నిషేధం ఎత్తివేసి, భూముల యజమానులకు ప్లాట్లు కేటాయించిన ప్రభుత్వం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఈనెల 30 నుంచి జగ్గయ్యపేటలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే విజయవాడ ధర్నా చౌక్ లో సైతం ఆందోళనలకు సిద్ధమని, ప్రభుత్వం ఈనాం భూముల సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేయటమే కాక ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడేది లేదని ప్రతినిధులు స్పష్టం చేశారు.

# ప్రపంచంలో సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా





**రిటైర్ ఎడిషనల్ ఎస్పీ.. సాయన సుశీలరావు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవా సమితి 20వ వార్షికోత్సవం మరియు మదర్ తెరిసా పుట్టినరోజు వేడుకలు గురువారం బుట్టయ్య పేటలోని కాశీనాధుని దుర్గంబ బుచ్చ య్య ట్రస్ట్ దివ్యాంగుల హోమ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఎడిషనల్ ఎస్పీ ఎస్.సుశీలరావు మాట్లాడుతూ ప్రపంచంలో సేవకు ప్రతిరూపం మదర్ తెరిసా అని అన్నారు.విదేశంలో పుట్టిన భారతదేశంలో అందరి మనసు లలో స్థానం సంపాదించుకున్న మదర్ తెరిసా సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని అన్నారు. మచిలీపట్నంలో చిలకలపూడి సెంటర్ లో మదర్ తెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేసే సువర్ణ అవకాశం మదర్ తెరిసా సేవా సమితికి రావడం అదృష్టమని అన్నారు. గత 20 సంవత్సరాలుగా కొన్ని వందల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మదర్ తెరిసా కి ప్రతిరూపంగా కార్యవర్గం పనిచేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సమితి అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ తమ సంస్థ 20వ వార్షికోత్సవం దివ్యాంగుల హోమ్ లో నిర్వహించడం ఎంతో సంతృప్తికరంగా ఉందని అన్నారు. కాశీనాధుని దుర్గంబ బుచ్చయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎలకు రులోనూ మచిలీపట్నం లోనూ వందలాదిమంది దివ్యాం గులకు సేవలందిస్తున్న కాశీనాధుని నాగేశ్వరావు వారసుల సేవలు మరువలేని అని అన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతి ఏడాది 17వ డివిజన్లో వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, రక్తదాన శిబిరాలు కుష్టి రోగులకు సేవా కార్యక్రమాలు పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం వంటి పలు సేవా కార్యక్రమాలతో సమస్త ముందుకు వెళుతుందని తెలియజేశారు.

సమితి అధ్యక్షులు పైడిపాముల గురు ప్రసాద్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి చేత జాతీయ విశిష్ట సేవా పథకం పొందిన కాశీనాధుని దుర్గాంబా బుచ్చయ్య ట్రస్ట్ లో జరుగుతున్న మానవ సేవ మాధవ సేవతో సమానమని అన్నారు. జీతం తో సంబంధం లేకుండా మానవతా హృదయంతో పనిచేస్తున్న ప్రధాన అధ్యాపకురాలు సునీత మరో నలుగురిని సమితి తరపున సన్మానించారు. రాబోయే రోజులలో తమ సమితి ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు ట్రస్ట్ లో కొనసాగిస్తామని తెలియజేశారు. సమితి ప్రధాన కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఉపయోగపడే పది వేల రూపాయల వివిధ పరికరాలను అందించడం జరిగిందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ జీవితంలో కొంత సమయాన్ని సంపాదనలో కొంత ధనాన్ని సమాజానికి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు గుంపెన రమేష్ నాంచారయ్య కాశీనాధుని దుర్గమ్మ బుచ్చయ్య నిర్వాహకులు అధ్యాపకులు , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవలు అందిస్తున్న అధ్యాపకులను మదర్ తెరిసా పేరుతో సన్మానం చేశారు. హోమ్ లోని దివ్యాంగులకు తల్లిదండ్రులకు సమితి తరపున భోజనాలు ఏర్పాటు చేశారు.

## ట్రస్ట్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏపిఎస్ అర్ టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు




ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా
తెలుగుదేశం పార్టీ ఏపిఎస్ అర్ టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు నివాసంలో స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారం భోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, మచిలీపట్నానికి చెందిన షేక్ రఫీ మరియు ఆయన స్నేహితులు కలిసి సమాజ సేవే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మచిలీపట్నం, పరిసర ప్రాంతాల్లో ఆకలితో బాధపడుతున్న పేదలకు ఆహారం అందించడంతో పాటు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు విద్యను అందించాలనే సంకల్పంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఎంతోమంది పేదలు కనీస ఆహారం, విద్య కోసం ఎదురుచూస్తున్నారని, అలాంటి వారికి అండగా నిలిచేందుకు స్వేచ్ఛ ఎడ్యుకేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం ఆదర్శప్రాయమని అర్ టిసి చైర్మన్ తెలిపారు.ట్రస్ట్ ద్వారా చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, పేదలు మరియు నిరుపేదలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఇంటింటి ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలి


**స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి**
**కృష్ణా జిల్లా టీడీపీ నేతల పిలుపు**



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ క్యాలెండర్ సమావేశం అనంతరం పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావా లని పిలుపునిచ్చారు.వీరంకి వెంకట గురుమూర్తి (కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు):పార్టీ క్యాలెండర్ ప్రకారం ప్రతి నెలా చేపట్టాల్సిన కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించాలి. గ్రామ, మండల స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలి.కొనకళ్ల నారాయణరావు (APSRTC చైర్మన్ & జాతీయ కోశాధికారి):కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో పార్టీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వాస్తవాలను వివరించాలి. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి.వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ (జాతీయ ఉపాధ్యక్షులు):ఇంటింటి ప్రచార కార్యక్ర మం ద్వారా ప్రజలతో నేరుగా మమేకం కావాలి. ప్రతి కార్యకర్త తన పరిధిలోని ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బలమైన కార్యాచరణతో ముందుకు సాగాలి.బూరగడ్డ వేదవ్యాస్ (జాతీయ ఉపాధ్యక్షులు):పార్టీకి కార్యకర్తలే బలం. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి. గోపు సత్యనారాయణ (జిల్లా ప్రధాన కార్యదర్శి):జిల్లాలో కొనసాగుతున్న ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలి. ప్రతి బూత్, క్లస్టర్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలి. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలి.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్, రాష్ట్ర కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, రాష్ట్ర కార్యదర్శి శాయన పుష్పవతి, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నెరుసు రాజ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మలపల్లి హరికృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రిజ్వానా బేగం, జిల్లా కార్యదర్శి వసంతకుమారి, పాలపర్తి పద్మజ, వేమూరి శ్రీదేవి, ముక్కు రంగమణి తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తివంతమైన ఆలోచనలే విజయానికి పునాది

**–డీఎంఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో డా.విద్యాలయ చక్రవర్తి ప్రేరణాత్మక సదస్సు**




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
స్థానిక వైజేఆర్ డీఎంఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మరియు పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, మానసిక దృఢత్వం పెంపొందించేందుకు మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. ప్రముఖ మనస్తత్వవేత్త, మోటివేషనల్ స్పీకర్ డా. విద్యాలయ చక్రవర్తి ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డా. చక్రవర్తి మాట్లాడుతూ... నిజ జీవిత అనుభవాలు, స్ఫూర్తిదాయక కథనాల ద్వారా విజయం సాధించడంలో మానసిక దృఢత్వం పాత్రను వివరించారు.

విద్యార్థులు తమలో ఉన్న ఆత్మసందేహాన్ని అధిగమించి, ఆచరణాత్మక వ్యూహాలతో సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సెషన్ విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. తమ భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు ఈ సదస్సు ఎంతో దోహదపడుతుందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. బి. నాగజ్యోతి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వీరమాచినేని కిరణ్, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డా.అబ్దుల్ నబి, వివిధ విభాగాల అధ్యాపకులు, ప్రథమ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన దరఖాస్తుల స్వీకరణకు ఆశావహుల స్పందన



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది.మూడో రోజు ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో సుమారు 20 మంది ఆశావహులు తమ దరఖాస్తులను సమర్పించినట్లు ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు రాజకీయంగా ఎదిగే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, ఆశావహులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.దరఖాస్తుల స్వీకరణ కోసం రాఘవయ్య చౌదరి,సిరిపల్లి ప్రసాద్, ఓబిలిశెట్టి శ్రవణ్ కుమార్ గుప్తా,నిమ్మల జ్యోతి కుమార్,కస్తూరి సాయి తేజస్విని సభ్యులుగా ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న 50 డివిజన్లను 62 డివిజన్లుగా విభజించారని, పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుందని రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు.

## ఏలూరులో మన్నా సల్వా పికిల్స్ షాపు ప్రారంభం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

నగర ప్రజలకు రుచికరమైన వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లను సరసమైన ధరలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మన్నా సల్వా పికిల్స్ షాపు యజమానురాలు మహమ్మద్ షబానా తెలిపారు. నగరంలోని విజయ విహార్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్స్ షాపును ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి షాపులో తొలి కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా షాపు నిర్వాహకులు మహమ్మద్ షబానా, అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ.. నాణ్యమైన పదార్థాలతో రుచికరమైన వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లను తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు.ఏలూరు నగరంలో ఇప్పటికే కలపర్రు టోల్‌గేట్ వద్ద ఒక షాపును ఏర్పాటు చేశామని, విజయ విహార్ సెంటర్‌లో ఏర్పాటు చేసినది రెండో షాపు అని వివరించారు.అలాగే రాజమండ్రి,తణుకు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పికిల్స్ షాపులను ప్రారంభించామని,ఆయా ప్రాంతాల ప్రజల నుంచి తమ పచ్చళ్లకు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. వివిధ రకాల రుచికరమైన పచ్చళ్లను సరసమైన ధరలకు అందిస్తున్నామని చెప్పారు.ఏలూరు నగర ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు షాపును సందర్శించి తమ పచ్చళ్లను రుచి చూసి ఆదరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థినుల భద్రతకు 'శక్తి' యాప్ అండ

### -సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన టూ టౌన్ పోలీసులు




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏలూరు టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో లక్ష్మీవారపుపేటలోని ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు శక్తి యాప్, మహిళా భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టూ టౌన్ మహిళా ఎస్ఐ నాగ కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.మహిళలు,బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీస్ సహాయం అందించేందుకు శక్తి యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు.అత్యవసర సమయంలో శక్తి యాప్‌తో పాటు 112 ఎమర్జెన్సీ నంబర్‌కు సమాచారం అందిస్తే సమీపంలోని శక్తి బృందం వెంటనే స్పందిస్తుందని చెప్పారు.వేధింపులు,కిడ్నాప్ ప్రయత్నాలు,గృహహింస, ఒంటరిగా ప్రయాణించే సందర్భాల్లో శక్తి యాప్‌ను వినియోగించాలని సూచించారు.అలాగే గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని, వాటి ద్వారా బ్యాంకు ఖాతాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్, శక్తి టీం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యూ ఆర్ కోడ్ విధానం రద్దు చేయాలని కోరుతూ పోడూరులో రేషన్ డీలర్ల ధర్నా

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రేషన్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేసి డీలర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోడూరు మండల రేషన్ డీలర్లు గురువారం తహసిల్దార్ ఎస్ ఎం ఫాజిల్ గారికి వినతిపత్రం అందించారు. రేషన్ డీలర్లకు 1 రూపాయి నుంచి 3 రూపాయలకు కమిషన్ పెంచాలని, లేదా డీలర్లకు కనీస వేతనం రూ 30 వేలు, ఇవ్వాలని, డీలర్లకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పోడూరు మండల రేషన్ షాప్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లంకలపల్లి రమేష్, గౌరవాధ్యక్షుడు బీరా రాజశేఖర్ ప్రధాన కార్యదర్శి వెంద్ర త్రినాథ్, ఉపాధ్యక్షుడు మెర్ల వాసు, కార్యదర్శి మేడపాటి రామకృష్ణారెడ్డి, రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.



### సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే

# మహా ర్యాలీ, బహిరంగ సభలను విజయవంతం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ.



ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక, గిరిజన వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ ఒకటో తేదీన ఢిల్లీలో సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయవలసిందిగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

వేలేరుపాడు మండలం భూదేవి పేటలో మండల సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం రామవరం మాజీ సర్పంచి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మండలం నుంచి చలో ఢిల్లీ కార్యక్రమం నకు సిపిఐ మరియు ప్రజా సంఘం నుంచి కార్యకర్తలు వెళ్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము తెలిపారు. సమావేశంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, ఆగస్టు 6 నుండి 15 వరకు సిపిఐ చేపట్టిన ప్రచార ఆందోళన-పాదయాత్ర కార్యక్రమం జిల్లాలో జయప్రదంగా జరిగిందని తెలిపారు. ఆగస్టు 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా సంఘాల ఆందోళన కార్యక్రమాలు ఏలూరు జిల్లాలో మంచిగా జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిక ధరలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, దేశ ప్రజాస్వామ్యం మరియు లౌకిక రాజ్యాంగము రక్షణ కోసం, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, రైతుల ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ను అమలు చేయాలని, విదేశాల్లో ములుగుతున్న నల్లధనాన్ని దేశానికి రప్పించి ప్రతి పేద వాని కుటుంబానికి 15 లక్షల రూపాయలు ఇస్తానన్న కేంద్ర ప్రభుత్వం వాగ్దానాన్ని అమలు చేయాలని, ఈ ప్రాంతంలో పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని,పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని,పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో సెప్టెంబర్ ఒకటో తేదీన రామ్ లీలా మైదానంలో జరుగుతున్న మహా ర్యాలీ బహిరంగ సభల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేవి రమణ రాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, పిట్టా వీరయ్య, గోలిమే బాల యేసు, కరటం వెంకటేశ్వరావు బంధం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ పేదల జిల్లా శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

సెప్టెంబర్ 1,2 తేదీలలో పాలకొల్లులో జరగనున్న గ్రామీణ పేదల జిల్లా శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ఉపాధ్యక్షులు ఏ.రవి కోరారు గురువారం నాడు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రాలను వారు ప్రజా సంఘాల కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గ్రామాల్లో నూటికి 70 శాతం గా ఉన్న వ్యవసాయ కార్మికులు వేతన శ్రామికులు రైతాంగం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని వారి సమస్యలపై అవగాహన కల్పించేందుకు రానున్న కాలంలో వివిధ రూపాల్లో ఉద్యమాలు సాగించేందుకు ఈతరగతులు జరగనున్నాయన్నారు ఈతరగతులు స్థానిక అగ్రికల్చర్ మార్కెట్ యార్డు నందు జరగనున్నాయన్నారు రైతుల గిట్టుబాటు ధరలు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణ సదుపాయం వ్యవసాయ కార్మికుల కనీస వేతనాలు గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పటిష్ట అమలు వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మంచినీళ్లు మరుగుదొడ్లు వీధిలైట్లు డ్రైనేజీలు దళితుల వాడల్లో స్మశాన సౌకర్యం సైతం కొరవడటం వంటి సమస్యలపై గ్రామీణ పేదలకు అవగాహన గ్రామీణ పేదల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు అవగాహన కల్పించి రానున్నకాలంలో సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

ఈశిక్షణా తరగతుల్లో జిల్లా నలుమూల నుండి 200 మంది హాజరవుతారని సంఘ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు ఈతరగతుల నిర్వహణకు పాలకొల్లు పరిసర ప్రాంతాల పెద్దలు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు ఈ ఆవిష్కరణలో జార్జి రవితో పాటు చల్లా సోమేశ్వరరావు సత్యం శెట్టి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఈ పంట నమోదు చేయించుకోవలెను



ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి.

చాట్రాయి మండలంలోని సాగు చేసే ప్రతి ఒక్క రైతు తమ పంటను పంటలు వారీగా ఈ పంట నందు నమోదు చేయించుకోవలెను.సెప్టెంబర్ 15 లోపు ఈ పంట నమోదు పూర్తి అవ్వాలనిసూచించడం జరిగినది. ఎల్నినో ప్రభావం ఉండడం వలన ప్రతి ఒక్క రైతు పూర్తి వివరాలతో మీ గ్రామంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను రైతు సేవా కేంద్రం వద్ద కలసి ఈ పంట నమోదు చేసుకోవలెను. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు కచ్చితంగా ఆగస్టు 31 వ తేదీలోపు ఇన్సూరెన్స్ ఎకరానికి 840/-రూపాయలు కట్టినట్లయితే పంట బీమా వర్తిస్తుందని రైతులకు తెలియజేయడమైనది. గురువారంచనుబండ గ్రామంలోని వరి పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ తన సిబ్బందితో కలిసి సందర్శించి నీటి యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి,ఆరుతడి పంటలు విధానము , ఎల్నినో ప్రభావం ఆధారంగా సూక్ష్మ సేద్యం లో తీసుకోవలసిన జాగ్రత్తలు ఉపయోగాలు గురించి రైతులకు తెలియజేయడమైనది. ఈ క్షేత్ర సందర్శనలో విఏఏ నాగమణి, రైతులు, నక్క రాము ఇతరులు పాల్గొనినారు.

## డాక్టర్ చవాకులసూర్య నరేష్ బాబుకి భారతీయ రత్న అవార్డు బహుకరణ



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

వైజాగ్ లో శ్రీ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ మరియు విశాఖరత్న కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ రత్న నేషనల్ అవార్డ్స్ -2026 కార్యక్రమం ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి డాక్టర్ చవాకులసూర్య నరేష్ బాబుకి భారతీయ రత్న అవార్డు ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు గారి చేతుల మీదగా అందజేసి ఘనంగా సత్కరిం చారు. ఈ క్రమంలో లీడర్ పత్రిక అధినేత రైటర్స్ అకాడమీ చైర్మన్ శ్రీ వివి రమణమూర్తి గారు, విశాఖపట్నం మాజీ డిప్యూటీ మేయర్ శ్రీ దాడి సత్యనారాయణ గారు, శంఖారావం కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీ బొమ్మిడి సత్యనారాయణ గారు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వి బాల మోహన్ దాస్ గారు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ శ్రీ సన్ మూర్తి గారు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్య అన్నప్రసాదానికి భక్తుల ఉదార విరాళాలు







ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తులు మరోసారి తమ భక్తి చాటుకున్నారు. ముగ్గురు దాతలు కలిసి రూ.1,51,233 విరాళాన్ని ఆలయానికి సమర్పించారు. మోరంపూడి వాస్తవ్యులు చనుమూరి లక్ష్మీ వెంకట గణపతి - వెంకటలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు. అలాగే అజ్రం వాస్తవ్యులు అల్లాడ సత్యనారాయణ - సారలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.25,001 విరాళాన్ని అందజేశారు. రావులపాలెం వాస్తవ్యులు నల్లమిల్లి సూర్యనారాయణ రెడ్డి - జయశ్రీ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళాన్ని నిత్య అన్నప్రసాద కార్యక్రమం కోసం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు స్వామివారి ప్రసాదం, ఆశీర్వచనాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు సమర్పిస్తున్న విరాళాలతో నిత్య అన్నప్రసాద కార్యక్రమం మరింత విస్తృతంగా కొనసాగుతుండటం హర్షణీయమని పేర్కొన్నారు.

### కొత్తపేట నియోజకవర్గంలో

## ఇంటింటా ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన

### కొత్తపేట నియోజకవర్గంలో 84 శాతం ప్రచారం పూర్తి



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం, ఇప్పటివరకు నియోజకవర్గంలో 84 శాతం ప్రచారం పూర్తికాగా, 69,046 కుటుంబాలను కూటమి శ్రేణులు ప్రత్యక్షంగా కలిసి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించినట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి చెప్పారు. మండలాల వారీగా పరిశీలిస్తే ఆత్రేయపురం మండలంలో 100 శాతం, ఆలమూరు మండలంలో 83 శాతం, కొత్తపేట మండలంలో 77 శాతం, రావులపాలెం మండలంలో 76 శాతం కుటుంబాలను కూటమి నాయకులు కలిశారని వివరించారు. అదేవిధంగా కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో 82 శాతం కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించామని, గ్రామంలోని 5,538 గృహాలను సందర్శించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జుల పర్యవేక్షణలో బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కూటమి శ్రేణులు విస్తృతంగా ఇంటింటా ప్రచారంలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లి ఏసు, ముద్రగడ ఫణి, చొల్లంగి రఘు, అద్దంకి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆలమూరు జూనియర్ కళాశాలలో ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

జిల్లా కథల పోటీ విజేతలకు ఘన సన్మానం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ.

ప్రజాభూమి ప్రతినిధి-ఆలమూరు

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ కన్వీనర్, ప్రముఖ రచయిత కృష్ణశ్రీ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణశ్రీ మాట్లాడుతూ, భాషాతత్వవేత్త, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని బాలమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి "కుటుంబ విలువలు" కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన కథా రచయితలను తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జరిగే ఆత్మీయ అభినందన సభలో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి అధ్యక్షత వహించనుండగా, సీనియర్ జర్నలిస్ట్ వి.వి.ఎన్. కృష్ణకుమార్, ప్రజా సైన్సు ఉద్యమ నాయకులు డా. చల్లా రవికుమార్, ప్రముఖ కథా రచయితలు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. తెలుగు భాషా వైభవాన్ని చాటిచెప్పే ఈ వేడుకకు సాహితీ అభిమానులు, కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### అమరావతి ఛాంపియన్‌షిప్ కప్‌లో ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల సత్తా

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ఈ నెల 24 నుంచి 27 వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో ఏలూరు జిల్లా అండర్-23 బాస్కెట్‌బాల్ జట్లు అద్భుత ప్రతిభ కనబరిచాయి.అండర్-23 మహిళల బాస్కెట్‌బాల్ జట్టు ప్రథమ స్థానం సాధించి అమరావతి ఛాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకుంది. పురుషుల అండర్-23 జట్టు ద్వితీయ స్థానం సాధించింది. రెండు విభాగాల్లోనూ ఏలూరు జిల్లా జట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా కీర్తిని ఇనుమడింపజేశాయి.ఈ సందర్భంగా జట్ల కోచ్‌లు కె. మురళీకృష్ణ, వి. నాగరాజు, మేనేజర్లు లక్ష్మి, బి. భవానీ దేవి, క్రీడాకారులు, క్రీడాకారిణులను డి ఎస్ డి వో ఎస్.ఏ. అజీజ్, ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి గవ్వా శ్రీనివాసరావు తదితర సభ్యులు అభినందించారు.ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు సాధించిన ఈ విజయంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



## పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సిపిఐ అధ్వర్యంలో ఐ.టి.డి.ఎ. ఎదుట ధర్నా

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

విలీన మండలాల్లోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులవుతున్న వారి అనేక సమస్యల పై సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చింతూరులోని ఐటీడిఏ ముందు గురువారం ధర్నా నిర్వహించి, అనంతరం ఐటిడిపిఓ శుభమ్ నొక్వాల్ కు నిర్వాసిత ప్రజలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ మెమోరాండంలో పోలవరం ప్రాజెక్టు పేరుతో విలీనం చేసుకున్న నాలుగు మండలాల అనేక సమస్యలు నెలకొన్నాయని, విలీన మండలం అని పేర్కొన్న యటపాక మండలంలో పరిహారం ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి కలగడం లేదని, కేంద్ర పెద్దలు మాత్రం ప్రాజెక్టు 45ం కాంటూరు వరకు కట్టడానికి నిధులిస్తాం, కాని పరిహారం 41ం కాంటూరు వరకే ఇస్తానని పార్లమెంటులో చెప్పడం నిజంగా బాధాకరమని, అలాంటప్పుడు యటపాక మండలం పరిస్థితిఏంటని ప్రశ్నించారు. రెండు సంవత్సరాల కిత్రం పంట నష్టం ముంపు భూములకు గ్రామసభలు పెట్టి నోటిఫికేషన్ ఇచ్చారు. కాని ఇంత వరకు పరిహారం ఇవ్వలేదు. నోటిఫికేషన్ ఇచ్చిన భూముల్లో మార్పులు చేయలేము అంటున్నారు. అందువలన మరణించిన రైతుల వారసులకు అన్నదాత సుఖీభవ రావడం లేదన్నారు. యూరియా ఇవ్వడం లేదని, ఎటపాక ముంపు రైతుల పరిస్థితి చావలేక బ్రతకలేక అన్నట్లుగా ఉందన్నారు. భద్రాచలం అనుకొని ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు చాలా ఇబ్బందికర పరిస్థితిలో ఉండి తెలంగాణలో కలపమన్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని, లక్ష్మీపురం, కన్నాపురం, పాలమడుగు, పట్టుచీర తదితర సరిహద్దు గ్రామలో పోడు,భూములు తెలంగాణ లో ఉండటం వలన వారి పట్టాలు రాక ఇబ్బంది పడుతున్నార న్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలుఉన్నాయని, కూనవరం, వీఆరపురం, చింతూరు మండలాలలోని పట్టా భూములకు పరిహారం ఇచ్చిన గ్రామాలలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో ఇచ్చిన విధంగా అసైన్డ్, పోడు భూములకు కూడా పరిహారం ఇవ్వాలని, ఖాళీ చేయించే రోజు కటాఫ్ గా నిర్ణయించి 18 సంవత్సరాలు నిండిన వారికి పరిహారం ఇవ్వాలనీ, యటపాక మండలంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములకు మరణించిన రైతుల పట్టాలు మార్పు వీలు లేదంటూన్నారు. ఆన్లైన్ ద్వారా గతంలో వలె వారి వారసులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసి ఆ భూములకు యూరియా, డీఏపీ ఎరువులు ఇవ్వాలనీ కోరారు. వియటపాక మండలంలోని ముంపు భూములకు, గ్రామాలకు కాంటూర్ లెవల్ సంబంధం లేకుండా పరిహారం ఇవ్వాలనీ, ప్రాజెక్టులో నీరు 2027లో నిలువ చేస్తామంటున్నారు. అది ఎన్ని అడుగుల వరకు నిల్వ చేస్తారు . దాని వలన వర్షాకాలం గోదావరిలో ఎంత నీరు ఉంటుంది, వేసవి, శీతాకాలంలో ఎన్ని అడుగుల నీరు గోదావరిలో ఉంటుందో ప్రభుత్వం స్పష్టం చేయాలనీ, ఖమ్మం జిల్లాలో ఉన్నప్పుడు ఈ నాలుగు మండలాలు గిరిజన, గిరిజనేతర నిరుపేదలందరికీ పక్కా గృహాలు ఇచ్చిన విధంగా ప్రస్తుతం కూడా ఇవ్వాలని, అర్హులైన వారికి వృద్ధాప్య వితంతు వికలాంగుల పెన్షన్లు ఇవ్వాలనీ, ఈ రెండున్నరేళ్లలో మరణించిన అర్హులైన వారిని ఎన్టీఆర్ బీమా కింద రూ.2 లక్షలు ఇవ్వాలని, ముంపు మండలాల్లోని రైతులకు రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని, పోలవరం బ్యాక్ వాటర్ వలన అనేక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులను ఖాళీ చేయించి 45ం వరకు ముంపులోని అన్ని గాగ్రామాల్లోని ప్రజలకు రూ.10 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలో 18-60 సంవత్సరాలు లోపు మహిళలకు రూ.1500 ఇస్తామన్న పథకం ఇంత వరకు అమలు కాలేదన్నారు . 26ఇ1500 =39,000 రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేసారు. నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందజేయాలన్నారు, యటపాక మండలం అచ్చుతాపురం వద్ద వాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల మరమ్మత్తులు చేపట్టాలని, పాస్ పుస్తకంలో ఉండి ఆన్లైన్లో 1బీ రాని రైతు భూములకు అన్నదాత సుఖీభవ రావడం లేదని అలాంటి వారిని అన్నదానత సుఖీభవ వర్తింపజేయాలని, గుండాల నుంచి కూనవరం వరకు వరదల వలన రోడ్డు అధ్వానంగా తయారైందని . కొత్త నిర్మాణం చేయాలని, డ్వాక్రా గ్రూప్ లలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న మహిళలను 60సంవత్సరాలు నిండగానే బ్యాంకులు డ్వాక్రా ఋణం ఇవ్వడం లేదని, రాజకీయాలలో 80 సంవత్సరాలు వచ్చినా ప్రజాప్రతినిధులు గా ఉండే అర్హత ఉన్నప్పుడు 60 సంవత్సరం వచ్చిన మహిళలను వృద్ధులు అని ఋణం ఇవ్వకపోవడం సరైన విధానం కాదని, 75 సంవత్సరాలు వచ్చే వరకు డ్వాక్రా మహిళలకు అన్ని బ్యాంకులు రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ, డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు, డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎటపాక సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, కూనవరం మండల కార్యదర్శి లంబూ శ్రీనివాసరావు, విఆర్ పురం మండల కర్నాటి ఏసు, డివిజన్ కార్యవర్గ సభ్యులు జుత్తుక సూర్యచంద్రరావు , చింతూరు సీపీఐ మండల కార్యదర్శి. తుర్రం మురళి, నాయకులు ఎస్కే రంజన్ తదితరులు పాల్గొన్నారు.





## తాళ్లపూడి కరిబండి విద్యా సంస్థలో ఘనంగా హయగ్రీవ జయంతి



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

సర్వ విద్యలకు, జ్ఞానానికి హయాగ్రీవ స్వామి ఆధారమని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ పేర్కొన్నారు.తాళ్లపూడిలోని కరిబండి విద్యా సంస్థల్లో గురువారం జ్ఞాన ప్రదాత శ్రీ హయాగ్రీవ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద మంత్రాల నడుమ హయాగ్రీవ స్వామికి పూజలు నిర్వహించి, విద్యార్థులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సన్మార్గంలో నడవడానికి హయాగ్రీవ స్వామి ఆశీస్సులు అవసరమని రాధాకృష్ణ తెలిపారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏకాగ్రత, సత్ప్రవర్తనతో పాటు సనాతన ధర్మం ప్రాముఖ్యతను వివరించారు. పూజా విధానం, ధర్మంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ కరిబండి త్రినాథ స్వామి, ప్రిన్సిపాల్ పి. మురళి, వైస్ ప్రిన్సిపాల్ మాధవరావు, హెచ్ఎం ఏ. శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఇంటర్, డిగ్రీ, రేడియంట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజల మధ్య ఘనంగా బిషప్ జయరావు జన్మదిన వేడుకలు

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



ఆర్.సి.ఎం. పీఠాధిపతులు మహోఘన డాక్టర్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు ఏలూరులోని 46, 50 డివిజన్లలో అక్షర సోషల్ సర్వీస్ సొసైటీ, ఏలూరు సిటీ న్యూ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం బిషప్ జయరావు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్.సి. ఎం. సంస్థ బాధితులకు అండగా నిలుస్తోందని తెలిపారు.46వ డివిజన్ టీడీపీ ఇన్చార్జి ఈదుపల్లి రామలక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ఆర్.సి.ఎం. సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.బిషప్ జయరావు జన్మదినం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు, వితంతువులు, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉండి నాగేశ్వరరావు,కాంద్రు యేసు, కాంద్రు మోషే,కర్ణి కోటి దిలీప్, పెదపూడి రాజు, కొమ్ముకూరి రాజు, చింతాటి వెంకన్న,పాల్గొన్నారు.

## రాఖీ బంధం.. సోదర ప్రేమకు ప్రతీక

- తగరపువలస అవంతి కళాశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సోదరీమణులు

**ప్రజా భూమి ప్రతినిధి-తగరపువలస**

సోదరభావానికి, ఆత్మీయతకు నిలువెత్తు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోదరీమణులు ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు రాఖీ కట్టి, తిలకం దిద్ది ఆశీస్సులు అందజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక దైవిక దీవెనలు అందించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో సోదరభావాన్ని, మానవతా విలువలను పెంపొందించడంలో బ్రహ్మకుమారీస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రక్షాబంధన్ పండుగ కేవలం ఒక దారం కట్టే కార్యక్రమం మాత్రమే కాదని, సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలను, ఆత్మీయ బంధాలను మరింత బలపరిచే పవిత్రమైన రోజని పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవతా భావాలు పెంపొందుతాయని ఆయన అన్నారు.

**సందడిగా మారిన కళాశాల ప్రాంగణం**

రక్షాబంధన్ వేడుకలతో అవంతి కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ ఆత్మీయ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులతో పాటు



అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ. చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక, ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## ఎ ఎస్ డి ఎస్ సహకారంతో సోలార్ వీధి దీపాలు

- రెండు మండలాలకు వరద పునరావాస కేంద్రాలలో కూడా సోలార్ వీధి దీపాలు..
- శబరి గోదావరి సంఘము బ్రిడ్జిపై సోలార్ వీధి దీపాలు..

**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**



కూనవరం విఆర్ పురం మండలాలలో ఏ ఎస్ డి ఎస్ సంస్థ చైర్మన్ అలాగే బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు గాంధీ బాబు సహకారంతో రెండు మండలాల వరద ప్రాంత పునరావాస కేంద్రాలలో అలాగే శబరి గోదావరి సంగమం లో ఉన్న శబరి బ్రిడ్జిపై సోలార్ వీధి దీపాలను నేడు ఏర్పాటు చేయడం జరిగింది రెండు రోజుల్లో మిగతా వాటిని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని రానున్న రోజుల్లో కూడా మిగతా ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేసే విధంగా చూస్తానని గాంధీ బాబు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది వారు మాట్లాడుతూ గాంధీ బాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారు అలాగే సుమారు నాలుగు లక్షల 50వేల రూపాయలతో రెండు మండలాలకు ముఖ్యమైన ప్రదేశాలలో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేయడం అలాగే నేడు అందులో భాగంగా రెండు మండలాలకి వారిదిగా ఉన్న శబరి బ్రిడ్జిపై వీధి దీపాలు వెలిగించడం మాకు ఎంతో ఆనందదాయకమని ఉదయాన్నే జాగింగ్ చేసే వారికి రాత్రులు పాదచారులకు శబరి బ్రిడ్జిపై వర్షాకాలం వస్తే పశువులు అడ్డంగా పడుకోవడం దానితో వాహనదారులు ప్రమాదాలు చాలా జరుగుతున్నవి దాన్ని గమనించిన మన గాంధీ బాబు వీధి దీపాలు అమర్చడం మనకు చాలా ఆనందకరమని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటున్నామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో విఆర్ పురం మండలం ఎంపీటీసీ కారం లక్ష్మి ఎంపీడీవో ఇమ్మానియేల్ జడ్పిటిసి రంగారావు ఎంపీటీసీ ప్రదీప్ రెండు మండలాల అఖిలపక్ష నాయకులు పాల్గొనడం జరిగింది.

## పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం ...

**ప్రజా భూమి ప్రతినిధి కూనవరం..**

జనవిజ్ఞాన వేదిక పోలవరం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం గా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష/ ప్రధాన కార్యదర్శులు తీగల. బొజ్జయ్య, పి. కన్నారావు మాట్లాడుతూ విద్యార్థులల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడ, సైన్స్ పట్ల ఆసక్తిని కల్గించడం, తార్కిక ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా నిర్వహింస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు -2026 కార్యక్రమం జిల్లా కేంద్రంలోని 12 మండలాల్లో 8,9,10వ తరగతులకు చెందిన సుమారు 4000 మంది విద్యార్థినీ, విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల వేడుకలో ఉత్సాహంగా హాజరయ్యారు. వివిధ పాఠశాలలో నిర్వహించిన ఈ సంబరాలల్లో ఎంతో ఆసక్తి గా పాల్గొని తమ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారని తెలిపారు.

**మండలాల వారిగా విద్యార్థులు హాజరు**

అడ్డతీగల -415 మంది, రాజవొమ్మంగి -612 మంది, వై. రామవరం -221 మంది, గంగవరం -172 మంది, దేవిపట్నం-143 మంది, రంపచోడవరం -500 మంది, మారేడుమిల్లి -182,చింతూరు -400, కూనవరం -500,వి. ఆర్. పురం -400,యటపాక 300 మంది విద్యార్థులు చెకుముకిలో పాల్గొన్నారు.

# 23 రోజుల ఉత్కంఠకు తెర....



**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం వాడలరేవుకి చెందిన ఏడుగురు మత్స్యకారులు గల్లంతయిన విషయం విధితమే ఈ యొక్క ఏడుగురు మత్స్యకారులు వెస్ట్ బెంగాల్ తీరంలో మత్స్యకారుల ఆచూకీ లభ్యమయ్యింది. ఈ యొక్క మత్స్యకారులను రెస్క్యూ చేసి సురక్షితంగా ఒడ్డుకు అధికారులు చేర్చారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనకు ఎట్టకేలకు సుఖాంతం లభించిందని, సుమారు 23 రోజుల పాటు కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన ఏడుగురు మత్స్యకారులు వెస్ట్ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామని, వారిని రెస్క్యూ చేసి సురక్షితంగా వెస్ట్ బెంగాల్ పోర్టుకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.గురువారం కలెక్టరేట్లో వివేకానంద సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రెస్ మీట్లో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, మత్స్యశాఖ జేడీ కరుణాకర్ లతో కలిసి మత్స్యకారుల గల్లంతు నుంచి వారి ఆచూకీ లభించే వరకు జరిగిన పరిణామాలను, జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను, రెస్క్యూ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు.ఆగస్టు 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి "ముత్యాలమ్మ" అనే ఫిషింగ్ బోటు 15 రోజుల డీప్ ఫిషింగ్ కోసం సముద్రంలోకి వెళ్లిందని కలెక్టర్ తెలిపారు. అల్లవరం మండలం కొమరిగిరిపట్నంలో ఈ బోటు రిజిస్టర్ అయి ఉందన్నారు. బోటు యజమాని కోపనాటి రామకృష్ణ వర్మ అని, బోటులో మొత్తం ఏడుగురు మత్స్యకారులు క్రూ సభ్యులుగా ఉన్నారని వివరించారు.

ఆగస్టు 3వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో మత్స్యకారులు వేటకు బయలుదేరారని, అయితే అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయానికి వారి కుటుంబ సభ్యులతో కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. అప్పటి నుంచి మత్స్యకారుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని చెప్పారు.మత్స్యకారుల నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో ఆగస్టు 14న బోటు యజమాని సోదరుడు అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. వెంటనే మిస్సింగ్ కంప్లైంట్ నమోదు చేసి, మత్స్యకారుల ఆచూకీ కోసం వివిధ స్థాయిల్లో సమన్వయంతో చర్యలు ప్రారంభించామని చెప్పారు.సముద్రంలో మత్స్యకారుల బోటు ఎక్కడ ఉందో గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో నిరంతరం సమన్వయం చేసినట్లు తెలిపారు.కోస్ట్గార్డ్, నేవీ సహకారంతో విస్తృత గాలింపు చేపట్టారు.మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్గార్డ్, నేవీ అధికారులకు సమాచారం అందించడంతో పాటు వెస్ట్ బెంగాల్, బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దు భద్రతా విభాగాల అధికారులకు కూడా సమాచారం అందించినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. మత్స్యకారులు సముద్రంలో ఎక్కడైనా చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉన్నందున వివిధ మార్గాల్లో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించినట్లు చెప్పారు.23 రోజుల ఉత్కంఠ అనంతరం ఆగస్టు 26వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో మత్స్యకారుల ఆచూకీ లభించడం కుటుంబ సభ్యులకు, జిల్లా యంత్రాంగానికి ఊరటనిచ్చిందని కలెక్టర్ తెలిపారు.వెస్ట్ బెంగాల్ తీరంలో దిగా పోర్టు నుంచి శంకర్పూర్ వైపు వెళ్తున్న "అరబింద బార్మన్" అనే బోటు సిబ్బంది గల్లంతైన మత్స్యకారులను గుర్తించారని చెప్పారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రెస్క్యూ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.మత్స్యకారులు ప్రయాణిస్తున్న "ముత్యాలమ్మ" బోటు ఇంజిన్ గేర్బాక్స్లో సాంకేతిక సమస్య తలెత్తడంతో బోటు నియంత్రణ కోల్పోయి సముద్రంలో కొట్టుకుపోయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.బోటును గుర్తించిన అనంతరం దాదాపు 10 గంటల పాటు నిరంతరంగా రెస్క్యూ చర్యలు చేపట్టారని, అధికారులు, ఇతర బోటు సిబ్బంది సమన్వయంతో బోటును సురక్షితంగా లాగి వెస్ట్ బెంగాల్ పోర్టుకు తీసుకువచ్చారని వివరించారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో బోటును సురక్షితంగా పోర్టుకు చేర్చినట్లు తెలిపారు.రెస్క్యూ అనంతరం ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చామని కలెక్టర్ తెలిపారు. బోటు డ్రైవర్ తాతారావు కాస్త అస్వస్థతకు గురయ్యారని, మిగిలిన ఆరుగురు మత్స్యకారులు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు.

వీరందరికీ స్థానిక మెరైన్ పోలీసుల సహకారంతో ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం మత్స్యకారులందరూ వెస్ట్ బెంగాల్లోని బోట్ ఓనర్స్ అసోసియేషన్ గెస్ట్హౌస్లో విశ్రాంతి తీసుకుంటున్నారని వెల్లడించారు.మత్స్యకారుల గల్లంతు, వారి కోసం కొనసాగుతున్న గాలింపు, అనంతరం రెస్క్యూ ఆపరేషన్కు సంబంధించిన పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి కార్యాలయానికి ముందుగానే తెలియజేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.మత్స్యకారుల సురక్షిత ఆచూకీ లభించడం పట్ల ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సంతృప్తి వ్యక్తం చేస్తోందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలానికి తీసుకురావడమే ప్రస్తుతం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మత్స్యకారులను వెస్ట్ బెంగాల్ నుంచి కోనసీమ జిల్లాకు సురక్షితంగా తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక వాహనాన్ని పంపినట్లు కలెక్టర్ తెలిపారు. వారితో పాటు ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ను కూడా పంపించామని చెప్పారు.వారి ప్రయాణం, ఆరోగ్య పరిస్థితి, అవసరమైన ఇతర సౌకర్యాలను అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తారని తెలిపారు. మత్స్యకారులు త్వరగా తమ కుటుంబ సభ్యులను కలుసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.15 రోజుల డీప్ ఫిషింగ్ కోసం అవసరమైన రేషన్తో సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు అనూహ్యంగా 23 రోజుల పాటు సముద్రంలో ఉండాల్సి వచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంత సుదీర్ఘ కాలం సముద్రంలో వారు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు, ఆహారం, మంచినీరు, ఇంధనం వంటి వనరులను ఎలా వినియోగించుకున్నారు, బోటులో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి వంటి అంశాలను వారి నుంచి పూర్తిగా తెలుసుకోవాల్సి ఉందన్నారు. వారి అనుభవాలను కేవలం నమోదు చేయడమే కాకుండా, భవిష్యత్తులో సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రతకు ఉపయోగపడే విధంగా పూర్తిగా డాక్యుమెంట్ చేస్తామని తెలిపారు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మత్స్యకారులతో ప్రత్యేకంగా చర్చించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారులు జిల్లాకు చేరుకున్న అనంతరం సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్లో ప్రత్యేక బ్రెయిన్స్టార్మింగ్ సెషన్ నిర్వహిస్తామని చెప్పారు. సముద్రంలోకి వెళ్లే సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, బోట్లలో అత్యవసర పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇంజిన్ మరియు గేర్బాక్స్ల ముందస్తు తనిఖీలు, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించే విధానం తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.మత్స్యకారుల అనుభవాల ఆధారంగా భవిష్యత్తులో మరింత మెరుగైన సముద్ర భద్రతా వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన చర్యలను పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు.23 రోజులుగా తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారుల కుటుంబాలకు వారి సురక్షిత ఆచూకీ లభించడం ఎంతో ఊరటనిచ్చిందని కలెక్టర్ తెలిపారు. మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు సహకరించిన కోస్ట్గార్డ్, నేవీ, వెస్ట్ బెంగాల్ అధికారులు, మెరైన్ పోలీసులు, ఇతర బోటు సిబ్బంది, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాల అధికారులకు జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు.మత్స్యకారుల సురక్షిత స్వస్థల చేరిక వరకు జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన భవనం ప్రారంభం

### బ్యాంకు జనరల్ మేనేజర్ అతిథిగా శ్రీదేవి ముఖ్య

ప్రజా భూమి శింగనమల



మండల పరిధి తరిమెల గ్రామం లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బ్యాంకు జనరల్ మేనేజర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరుకాగా, రీజినల్ మేనేజర్ రవిమోహన్ ఆధ్వర్యంలో నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అనేక రకాల బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే ( కేసీసీ ),స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జీ ) రుణాలకు సంబంధించిన సర్వీస్ ఛార్జీలను తొలగించినట్లు వెల్లడించారు. అలాగే గృహ రుణాలు, విద్యా రుణాలను అర్హత కలిగిన వారికి సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా మహిళా సంఘాలకు చెందిన 8 గ్రూపులకు సుమారు రూ.1.20 కోట్ల విలువైన కొత్త రుణాలను జనరల్ మేనేజర్ శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు.ఈ విషయాన్ని బ్యాంకు మేనేజర్ కార్తీక్ తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. అనంతరం ఆటో ప్రమాదంలో మృతి చెందిన హుస్సేన్ బి,కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఐదు లక్షల చెక్కు ను కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సమీర్, నిఖిల్ యాదవ్, క్యాషియర్ నాగలక్ష్మి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నీటి కుంటల తలపిస్తున్న రహదారి లో వర్షపు నీరు

**వర్షపు నీటికి శాశ్వత పరిష్కారం చూపండి**

**వీధుల్లో నిలిచిపోతున్న వర్షపు నీరు.. ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు**

ప్రజా భూమి శింగనమల



మండల పరిధి చిన్న జలాలపురం గ్రామంలో వర్షం కురిసిందంటే చాలు.. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని పలు వీధుల్లో వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు రోజుల తరబడి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీధుల్లో నీరు నిలిచిపోవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు నీరు కూడా కలిసే అవకాశం ఉండటంతో పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేసి, నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాన్ని పరిశీలించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్వాడీ భవనాన్ని చూసి మనసు కదిలించింది: ఎమ్మెల్యే సురేంద్రబాబు

### చిన్నారుల కోసం తన సొంత నిధులతో మార్పు



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం


చుట్టూ మట్టి గోడలకు రంగులు లేవు చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం లేదు. భవనం నిర్మించి ఉన్నా చిన్నారులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దిన పరిస్థితి కనిపించలేదు. కళ్యాణ్ దుర్గం నియోజకవర్గంలో అపిలేపల్లి గ్రామంలోని అంగన్వాడీ--3 భవనం పరిస్థితి ఇది.




ఈ దృశ్యం గురించి గ్రామస్థుల ద్వారా గురువారం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఒక్కసారి ఆలోచించారు. ఇక్కడ చదువుకునేది మన పిల్లలే కదా వారి కోసం మనం చేయాల్సింది ఇంతేనా? అనే ఆలోచనతో ముందడుగు వేశారు. ప్రభుత్వ నిధులు వస్తాయా, ఎవరు చేస్తారు ఎప్పుడు చేస్తారు అంటూ ఎదురుచూడలేదు. చిన్నారుల చదువుకునే ప్రదేశం అందంగా ఉండాలన్న ఉద్దేశంతో తన సొంత నిధులను ఖర్చు చేసి అంగన్వాడీ భవనానికి కొత్త రూపు తీసుకొచ్చారు. రంగులు మారాయి భవనం రూపురేఖలు మారాయి కానీ అంతకంటే ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది. నిన్నటి వరకు సాధారణంగా కనిపించిన ఆ భవనం నేడు చిన్నారుల కోసం కొత్త ఆశల నిలయంగా మారింది. ఒక నాయకుడు పెద్ద పెద్ద పనులు చేయడం మాత్రమే అభివృద్ధి కాదు. ఒక చిన్నారి చదువుకునే గదిని అందంగా మార్చాలనే ఆలోచన కూడా ప్రజాసేవలో భాగమే. అపిలేపల్లిలో అదే కనిపించింది. తమ పిల్లలు ఆనందంగా అడుగులు వేసే అంగన్వాడీని చూసిన తల్లిదండ్రుల కళ్లలో సంతోషం కనిపించింది అని అన్నారు. గ్రామస్థుల హృదయాల్లో కృతజ్ఞత భావం వ్యక్తమైంది. అమిలినేని సురేంద్ర బాబు చేసిన ఈ చిన్న ప్రయత్నం ఆ చిన్నారుల భవిష్యత్తులో పెద్ద మార్పుకు తొలి అడుగుగా నిలవాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. ఎందుకంటే భవనానికి రంగులు వేయడం ఒక పని కావచ్చు కానీ చిన్నారుల భవిష్యత్తుకు రంగులు అద్దాలనే ఆలోచన మాత్రం ఒక నాయకుడి మానవత్వాన్ని చూపిస్తుంది.

# వర్షాల కోసం గాడిదకి పూజలు చేసి ఊరేగింపు

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం పెద్దమట్లగొంది లో గ్రామస్తులు వర్షాకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నా.. తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా వర్షాలు కురువడం లేదు. దీంతో వర్షాలు లేక చాలా గ్రామాల్లో వేరుశనగ పత్తి ఆముదం పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఈ కరువు పరిస్థితి చూసి తట్టుకోలేక రైతులు పురాతన ఆచారాలను పాటిస్తున్నారు. ఇందులో భాగంగానే మండలం పరిధి పెద్దమట్లగొంది గ్రామంలో ని రైతులు వర్షాల కోసం గాడిదకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలతో పురవీధుల గుండా గాడిదలకు పూజలు చేస్తూ వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రజల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భజన భక్తాదులు తదితరులు పాల్గొన్నారు

# జడ్పీ సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి: జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ




ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

జెడ్పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించగా, సమావేశంలో హిందూపురం ఎంపీ బికె. పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్ఓ కొండయ్య, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు, ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ మాట్లాడుతూ ఐదేళ్ల జడ్పీ పాలనా కాలం ముగింపుపై ధన్యవాదాలు తెలుపుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా సమగ్రాభివృద్ధికి శ్రమించామన్నారు. ప్రజా ప్రతినిధులుగా స్వీకరించిన బాధ్యతను ఐదేళ్ల పాటు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల సమస్యలను నిరంతరం సభ దృష్టికి తీసుకువస్తూ, వాటి పరిష్కారం కోసం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయడం జరిగిందన్నారు. కరోనా వంటి మహమ్మారి విపత్తులు, తుఫానులు, వరదలు వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగామన్నారు. సభలో నిరంతరం సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక రంగం గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కీలక సమస్యలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత, రైతుల సమస్యలు, ఎంపీడీవోల కొరత మరియు గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను సభ్యులందరూ సభ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేశారన్నారు. జెడ్పి పాలకమండలి ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా, ఈ ప్రయాణంలో పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి మాట్లాడుతూ ఆత్మకూరు - అనంతపురం రూరల్ పరిధిలో తాగునీటి పైప్లైన్ కోసం 90 కోట్లు మంజూరయ్యాయని, ప్రభుత్వం నిధులు ఇచ్చినా పనులు ఎందుకు పూర్తి చేయలేదని, ఎల్.నినో పరిస్థితుల వలన త్రాగునీటి సమస్య జఠిలంగా ఉందని, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పనులు పూర్తి చేయడం లేదని, వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మడకశిర ప్రాంతం కరువు ప్రాంతం అని, మడకశిర, అమరాపురంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత ఎస్ఈలు డిఈలతో సమావేశం పెట్టుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. పెనుగొండ పరిధిలోని సాకర్లపల్లి వద్ద 29 కోట్ల రూపాయలతో రైల్వే బ్రిడ్జి మంజూరు చేశామని, పనులు మొదలయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గొప్ప అవకాశాన్ని తనకు కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు. బడుగు బలహీన వర్గాల కుటుంబానికి చెందిన వడ్డెర ఆడబిడ్డనైన తనకు శాసన మండలికి వెళ్లేందుకు అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహాయ సహకారాలు అందించిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి, ఎంపీ పార్థసారథికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లుగా అనంతపురం అర్బన్ కు సంబంధించి త్రాగునీటి పైప్లైన్ పనులు చాలా పెండింగ్ ఉన్నాయని, రూరల్ లో త్రాగునీటి సమస్య ఉందని, రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్ సమస్య ఉందని, పనులను పూర్తి చేయాలన్నారు. రెండేళ్లుగా పనులు చేయకున్నా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదని.. ఆ కాంట్రాక్టర్లపై మీకు ఎందుకు అంత ప్రేమ అని అన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ ఎల్.నినో పరిస్థితులతో సాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. గతేడాది హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 52 టీఎంసీలకు పైగా నీరు తీసుకువచ్చామని, ఈ ఏడాది వర్షాలు రావడంలేదని, అంత నీరు రావడంలేదని, త్రాగునీటి కోసం చెరువులను నింపుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీనీవాకు ప్రత్యేక విధులు కేటాయించారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ వచ్చిన తర్వాతే విద్యా శాఖలో అనేక మార్పులు వచ్చాయని... ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరుతున్నారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తున్నారన్నారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ఖచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, త్వరితగతిన నిధులు విడుదల చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు మరియు సాగునీటి నిర్వహణకు సంబంధించి యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల తక్షణ పరిష్కారం కోసం 9550480972 కంట్రోల్ రూమ్ నంబర్ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.గ్రామ పంచాయతీ స్థాయిలో చిన్న బోర్లు, పైప్ లైన్ మరమ్మతులను పంచాయతీ నిధులతోనే తక్షణమే పూర్తిచేస్తారని, మరింత నిధులు అవసరమైతే డెప్యూటీ ఎంపిడిఓ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈఈ పర్యవేక్షణలో మండల పరిషత్ నిధులను వినియోగిస్తారన్నారు. మరమ్మతుల కోసం డిఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) నుండి 4 కోట్లు, అత్యవసర నిధుల కింద 48 లక్షలు, మరియు జిల్లా పరిషత్ నిధుల నుండి 60 లక్షల రూపాయలను కేటాయించామన్నారు. ఫిర్యాదులు వచ్చిన 24 గంటల్లోనే సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డబ్ల్యుఎస్, సత్యసాయి తాగునీటి పథకాల సిబ్బందికి సంబంధించి గత 2-3 నెలల పెండింగ్ వేతనాలను ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆమోదంతో పూర్తిగా క్లియర్ చేయడం జరిగిందన్నారు. ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 40 నుండి 50 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. హెచ్.ఎల్.సి నుంచి నీటి కేటాయింపు గతంలో 25 టిఎంసిల వరకు ఉండగా, ఈ సంవత్సరం 'ప్రో-రాటా' పద్ధతిన కేవలం 16 టిఎంసిలు మాత్రమే కేటాయించారని, దీనివల్లూరాదీ= కి చేరుకునే నీరు 9 నుండి 10 టిఎంసిలకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు. త్రాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ కేటాయించిన నీటిలో ఎక్కువ నీటిని అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని సుమారు 800 గ్రామాలకు తాగునీటి అవసరాల (సత్యసాయి, =ఔ, +దీజ కెనాల్ ద్వారా గుంతకల్లు మున్సిపాలిటీ) కొరకు భద్రపరచాల్సి ఉందన్నారు. ఎచీూా నీటి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర స్థాయి నుండి 4 టిఎంసిల నీరు కేటాయించినప్పటికీ, ఖ=వీదీ (కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు) మీటింగ్లో తుది నిర్ణయం రావాల్సి ఉందని, నిర్ణయం వెలువడిన అనంతరం అదనపు నీటి లభ్యతను బట్టి సాగునీటిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాబోయే కాలంలో ఎల్-నినో ప్రభావం మరో 1 నుండి ఒకటిన్నర సంవత్సరాల వరకు ఉండే అవకాశం ఉందని ×వీణ (వాతావరణ శాఖ) హెచ్చరించిందని, ఎక్కువ నీటి వినియోగం అవసరమయ్యే వరి, మిర్చి వంటి పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. రైతులు ఆరుతడి (×ణ) పంటలు వర్షాధార పంటలను మాత్రమే సాగు చేయాలని, గావీణూా ద్వారా పెల్లటైజేషన్ పద్ధతులను పాటించాలని కోరారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కనేకల్లు బాలుర గురుకుల పాఠశాలకు సంబంధించి వారం రోజుల్లోపు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ సమస్యలను తెలియజేశారు. నార్పల జడ్పిటిసి నాగరత్నమ్మ మాట్లాడుతూ కొత్త పెన్షన్లు ఇప్పించాలని, తల్లికి వందనం కింద రెండవ విడత అందించాలని, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో మరుగుదొడ్లు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుక్కరాయసముద్రం జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలోని సిద్ధరాంపురంలో తాగునీటి సమస్య ఉందని, నాలుగైదు రోజులకు ఒకసారి నీరు వస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతపురం రూరల్ జెడ్పిటిసి మాట్లాడుతూ పీఏబీఆర్ ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ కు 90 కోట్లతో పైప్ లైన్ తీసుకొచ్చారని, ఇంతవరకు నీరు రావడంలేదని, పనులు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. వజ్రకరూరు జడ్పిటిసి మాట్లాడుతూ వజ్రకరూరులోని పలు వార్డులలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, కొనకొండ్ల, గుడిసెలపల్లిలో నీటి సమస్య చాలా ఉందని, అక్కడ బోర్లు వేస్తే ఉప్పునీరు పడుతుందని, నీరు ట్యాంకర్లతో ఇంతకుముందు సరఫరా చేసామని, అందుకు బిల్లులు ఇవ్వలేదన్నారు. మడకశిర జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఐదు మండలాలలో శ్రీరామరెడ్డి పథకం కింద త్రాగునీరు రావడంలేదని, అక్కడ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎవరు అందుబాటులో లేరన్నారు. పరిగి జెడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలో పిఎబిఆర్ నీరు సరఫరా నిలిచిపోయిందని, అక్కడ విద్యుత్ అధికారులు పైప్లైన్ తీసేసారని, రిపేరు చేయించాలన్నారు. రొళ్ల జడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలోని పలు పంచాయతీలలో తాగునీరు రావడంలేదని, సమస్య పరిష్కరించాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో పార్నపల్లి నుంచి సత్యసాయి నీరు రావడంలేదని, గాండ్లపెంట, ఎన్పికుంటలో కరువు పరిస్థితి ఉందని, పైప్ లైన్ లలో నీరు వచ్చేలా చూడాలన్నారు. కనగానపల్లి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి వాటర్ స్కీం కింద నీరు ఎప్పుడు వస్తాయో తెలియదని, మండలానికి నీరు ఇవ్వాలన్నారు. కనేకల్ జడ్పిటిసి మాట్లాడుతూ కనేకల్ చెరువుకు హెచ్.ఎల్.సి నీరు వచ్చిందని, కిందకు వదలడం లేదని, రైతులు నారు పోసుకున్నారని, అది ఎండిపోతుందని, పంటలకు నీరిచ్చేలా చూడాలన్నారు. ఎల్లనూరు జడ్పిటిసి మాట్లాడుతూ గండికోట నుంచి మండలంలో 4 చెరువులను నింపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేపాక్షి జెడ్పిటిసి మాట్లాడుతూ ఎల్.నినో ప్రభావంతో పశుగ్రాసనం కొరత వచ్చిందని, ఉచితంగా పశుగ్రాసం, అదనంగా దాణా సబ్సిడీతో ఇవ్వాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మూగజీవాలు చనిపోయినప్పుడు వాటికి ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని, ఉపాధి పనులను కొండలు, గుట్టలలో చేస్తున్నారని, రైతులకు అనుసంధానం చేయాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి నీటిని మెటుకుపల్లి గ్రామానికి ఆపేశారని, వెంటనే ఇవ్వాలని కోరారు. కళ్యాణదుర్గం జడ్పిటిసి మాట్లాడుతూ సెట్టూరులో గోడ కూలి ఎస్సి విద్యార్థి చనిపోయారని, మరొకరు గాయపడ్డారని, చనిపోయిన విద్యార్థికి ఐదు లక్షలు ఇచ్చారని, వారి కుటుంబానికి ఒక ఉద్యోగం, 50 లక్షలు ఇవ్వాలని కోరారు. సెట్టూరు ఎస్సీ హాస్టల్లో 16 మరుగుదొడ్లు నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్నాయని, వాటికి ప్రారంభించాలన్నారు. పెనుగొండ, సాకర్లపల్లి క్రాసింగ్ వద్ద రైల్వే బ్రిడ్జి వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల ద్విచక్ర వాహనాల ర్యాలీ

### -కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాయలసీమ జేఏసీ పిలుపు మేరకు వారం రోజుల పాటు విధులు బహిష్కరించిన న్యాయవాదులు గురువారం ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, కృష్ణమూర్తి లు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని, అలాగే న్యాయమూర్తులతో ప్రత్యేక అధ్యయన కమిటీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అయితే అధికారంలో వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. హైకోర్టు బెంచ్ స్థానంలో సర్క్యూట్ లేదా మొబైల్ బెంచ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి వెంటనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజు రెడ్డి, రాజశేఖర్, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి, ఇందాద్, సంతోషి కుమారి, నాగరాజు, రామిరెడ్డి, రకీబ్, అబ్దుల్లా, యూసుఫ్, కదిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అన్నదానం



ప్రజాభూమి లింగాల

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లింగాలలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైకాపా నాయకులు సా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అంబకపల్లె బాబు రెడ్డి, చిన్న కుడాల నాగేంద్రారెడ్డి లు పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన కేకును కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మధ్య కేకు కట్ చేసి వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు ఎంపీ అవినాష్ రెడ్డిని దీవించడం జరిగిందని వారు తెలిపారు. ఎంపీ అవినాష్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజు కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజా నాయకుడు ప్రజల మనిషిగా పేరు ప్రఖ్యాతులుపొందిన గొప్ప వ్యక్తి వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. ఇలాంటి నాయకునికి ప్రజల ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయని వారన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంధుల పాఠశాలలో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు

### -విద్యార్థులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ


ప్రజాభూమి, హిందూపురం టౌన్



దివ్యాంగుల కోసం సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న సక్షమ్ అఖిల భారత సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను హిందూపురం సమీపంలోని సేవా మందిర్ అంధుల పాఠశాలలో గురువారం ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకుని, వారిలో ఆనందాన్ని నింపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. దివ్యాంగులు సమాజంలో ఎవరికీ తీసిపోరని,వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. రక్షాబంధన్ పండుగ సోదరభావం, పరస్పర ప్రేమ, ఆత్మీయతకు ప్రతీక అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో సామాజిక అనుబంధాన్ని మరింత పెంపొందించవచ్చని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం సక్షమ్ సంస్థ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులతో కొంత సమయం గడిపి వారితో ఆత్మీయంగా ముచ్చటించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండ్లు, స్వీట్స్ అందుకోవడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకటరమణ, జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, సాయి, నాగభూషణ్, శైలేంద్రతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గ్యాస్ మునీషన్ నిల్వలు, పనితీరుపై ఎస్పీ సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లా పోలీసుశాఖ వద్ద అందుబాటులో ఉన్న గ్యాస్ మునీషన్, వాటి నిల్వ సామర్థ్యం, పనితీరు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ పి. జగదీష్ గురువారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. పోలీసు హెడ్ క్వార్టర్స్లోని ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో భద్రపరిచిన బాష్పవాయు నిల్వలను, సంబంధిత పరికరాలను స్వయంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు గుంపులను అదుపు చేసేందుకు ఉపయోగించే గ్యాస్ బుల్లెట్లు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గడువు ముగిసిన (ఎక్స్పైరీ) రసాయన పరికరాలను వేరు చేయాలని, ఆధునిక సాంకేతికతతో కూడిన నిల్వలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ?సిబ్బందికి ఈ పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన ఉండాలని, సమయానుకూలంగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమీక్ష సాగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ లు, ఆర్ ఐ లు, తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# రక్షా బంధన్: అనురాగాల బంధం

ప్రజాభూమి పోరుమామిళ్ల : నైతిక రక్షణకు మార్గదర్శకం అనురాగానికి, ఆత్మీయతకు, రక్షణకు ప్రతీకగా నిలిచే అత్యంత పవిత్రమైన పండగ రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్). శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు జరుపుకునే ఈ పండగ, కేవలం ఒక దారాన్ని కట్టే వేడుక మాత్రమే కాదు; అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే నిర్మలమైన అనుబంధానికి దివ్యమైన రక్షా కవచం.రక్షా బంధన్ విశిష్టత ఒ ఆధ్యాత్మిక ప్రాధాన్యత ధర్మ పరిరక్షణకు, పరస్పర రక్షణకు ప్రతీకగా రక్షా బంధన్ నిలుస్తుంది. చెల్లెలు తన సోదరుడి ముఖాన తిలకం దిద్ది, కుడిచేతికి పవిత్రమైన రాఖీని కట్టి, ఆయన ఆయురారోగ్యాలతో, సకల ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తుంది. సోదరుడు కూడా తన సోదరిని జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాట ఇస్తూ, ఆమెకు ఆశీస్సులు, కానుకలు అందిస్తాడు.ఆధ్యాత్మికంగా చూస్తే, రాఖీ అనేది దుష్ట శక్తుల నుంచి, అపశకునాల నుంచి కాపాడే ఒక 'సుదర్శన చక్రం' వంటిదని నమ్ముతారు.రాఖీ పౌర్ణమి వెనుక ఉన్న ఆధ్యాత్మిక కథలు..శ్రీకృష్ణుడు - ద్రౌపది: రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించే సమయంలో ఆయన వేలు తెగి రక్తం కారుతుంది. అది చూసిన ద్రౌపది ఏమాత్రం ఆలోచించకుండా తన పట్టుచీర అంచును చింపి కృష్ణుడి వేలికి కడుతుంది. ఆ ప్రేమానురాగానికి మురిసిపోయిన కృష్ణుడు ఆమెకు రక్షణగా ఉంటానని అభయమిస్తాడు. తరువాతి కాలంలో కురుసభలో ద్రౌపదికి వస్త్రాపహరణం జరుగుతున్నప్పుడు, శ్రీకృష్ణుడు అక్షయ వస్త్రాలు ప్రసాదించి ఆమె మానాన్ని కాపాడాడు.లక్ష్మీదేవి - బలిచక్రవర్తి: రాక్షస రాజైన బలిచక్రవర్తి భక్తికి మెచ్చి విష్ణుమూర్తి ఆయన వైకుంఠాన్ని వదిలి బలి వద్దే ఉండిపోతాడు. విష్ణుమూర్తిని తిరిగి వైకుంఠానికి తీసుకురావడానికి లక్ష్మీదేవి శ్రావణ పౌర్ణమి నాడు సాధారణ స్త్రీ రూపంలో వచ్చి బలిచక్రవర్తికి రాఖీ కడుతుంది. బలి సంతోషించి ఏమి కావాలో కోరుకోమనగా, లక్ష్మీదేవి తన భర్త అయిన విష్ణుమూర్తిని పంపమని కోరుతుంది. సోదరి కోరికను కాదనలేక బలిచక్రవర్తి విష్ణుమూర్తిని వైకుంఠానికి సాగనంపుతాడు.భక్తి పూరితమైన రాఖీ శుభాకాంక్షలు "రక్తసంబంధాల కంటే పవిత్రమైనది మన అనుబంధం... జన్మజన్మలకీ నీ చెల్లిగా పుట్టాలని ఆ భగవంతుడిని



కోరుకుంటున్నాను. రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు! "చేతికి కట్టే ప్రతి దారం నీకు శ్రీరామరక్ష... ఆ పరంధాముడి దివ్య ఆశీస్సులు నీకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ, రక్షా బంధన్ శుభాకాంక్షలు!""అనురాగానికి రూపం, ఆప్యాయతకు ప్రతీక మన బంధం. నన్ను కంటికి రెప్పలా కాపాడే నా సోదరుడికి శ్రావణ పౌర్ణమి ఆత్మీయ శుభాకాంక్షలు!""లక్ష్మీనారాయణుల దివ్యానుగ్రహంతో నీ జీవితం సదా సంతోషాలతో, విజయాలతో నిండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. రక్షా బంధన్ శుభాకాంక్షలు!"నేటి యువతకు స్ఫూర్తిదాయక సందేశం రాఖీ పౌర్ణమి అనేది కేవలం సొంత అక్కాచెల్లెళ్లకు రాఖీ కట్టడంతో ముగిసిపోయే పండగ కాదు. ఈ పవిత్రమైన రోజు సమాజంలో ప్రతి స్త్రీ పట్ల గౌరవాన్ని, బాధ్యతను పెంచే ఒక ఆలోచనాత్మక పరివర్తనకు వేదిక కావాలి. నేటి యువత గ్రహించాల్సింది ఏమిటంటే---చేతికి కట్టే రక్షా దారం కేవలం ఒక సోదరికి ఇచ్చే అభయం మాత్రమే కాదు, సమాజంలోని ప్రతి మహిళ భద్రతకు పూనుకుంటామని ఇచ్చే ప్రతిజ్ఞ. స్త్రీ గౌరవమే ధర్మం: మన సమాజంలో ప్రతి మహిళను సొంత సోదరిలా భావించి, ఆమెకు రక్షణగా నిలిచినప్పుడే రాఖీ పౌర్ణమికి నిజమైన అర్థం లభిస్తుంది. ఆలోచనలో మార్పు: ఆపదలో ఉన్న ఏ స్త్రీనైనా కాపాడటానికి ముందుండే ధైర్యమే నేటి యువత చూపే అసలైన శౌర్యం.నైతిక బాధ్యత: స్త్రీలను గౌరవించడం, వారి స్వేచ్ఛకు, ప్రగతికి తోడ్పడటం ప్రతి ఒక్కరి ప్రాథమిక ధర్మం కావాలి.ఈ రాఖీ పౌర్ణమి నాడు, మన ఆలోచనలను మరింత పవిత్రంగా మార్చుకుందాం. సమాజంలో మహిళలకు సంపూర్ణ రక్షణ, గౌరవం లభించేలా ప్రతి అడుగు వేద్దాం. అదే మనం ఈ పండగ సందర్భంగా సమాజానికి ఇచ్చే గొప్ప కానుక! వ్యాసరచన : బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల

## పేద విద్యార్థులకు వరం పీఎం విద్యాలక్ష్మి

### - రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని విద్యా రుణాలు

### - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



ప్రజాభూమి, వేంపల్లె

ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విద్యాలక్ష్మి యోజనను అమలు చేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక పట్టణంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు బ్యాంకుల ద్వారా విద్యా రుణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రూ.10 లక్షల వరకు పూచీకత్తు లేని విద్యా రుణాలు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉన్న విద్యార్థులకు 3 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 860 ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. పీఎం విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా సుమారు 6.5 లక్షల దరఖాస్తులు రాగా, 3.3 లక్షల మందికి రూ.36 వేల కోట్ల విలువైన రుణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పానికి ఈ పథకం నిదర్శనమన్నారు. అర్హులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన సందర్భంగా వినాయక చవితికి రూ.50,000 భారీ విరాళం

### గజానన కమిటీకి 50,000 రూ.అందజేసిన వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇరికిరెడ్డి వీరారెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు 20వ వార్డు వైకాపా నాయకుడు, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని ఇరికిరెడ్డి వీరారెడ్డి ఔదార్యం చాటారు.ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వినాయక చవితి సందర్భంగా అవార్డు గజానన కమిటీకి రూ.50 వేల విరాళం అందజేశారు.గురువారం పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ఎంపీ జన్మదిన వేడుకల్లో మున్సిపల్ వైకాపా ఇంఛార్జులు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి చేతుల మీదుగా ఆ మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. 20వ వార్డులో జరిగే ప్రతి కార్యక్రమంలో వీరారెడ్డి చురుగ్గా పాల్గొంటారని, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు.

## శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బీటెక్ రవి



ప్రజాభూమి,సింహాద్రిపురం

సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మ గూడూరు కొత్తపాలెంలో నూతన శ్రీరాముడి దేవాలయ నిర్మాణానికి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ బీటెక్ రవి శంకుస్థాపన చేశారు.ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు బాబు రెడ్డి, సాంబశివ రెడ్డి, సతీష్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ధ్రువకుమార్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. పాత ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్ ఆధ్వర్యంలో మత పెద్దలచే సర్వమత ప్రార్థనలు, కేక్ కటింగ్ నిర్వహించారు. మున్సిపల్ ఇంఛార్జులు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి హాజరయ్యారు. అంధుల ఆశ్రమంలో శ్రీనివాస థియేటర్ సమీపంలోని వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమంలో గజ్జల ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యాలయం వద్ద మాజీ చైర్మన్ రసూల్ స్వీట్లు పంపిణీ చేశారు. ఎర్రగుడిపల్లెలో కోళ్ల భాస్కర్ మాంసంతో అన్నదానం చేశారు. పాత మార్కెట్ ఆంజనేయ స్వామి గుడిలో దాసరి ఈశ్వరయ్య ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు.జయమ్మ కాంప్లెక్స్ లో కొంగనపల్లి రవి, రాజకీయ కాలనీ రాములవారి గుడిలో రాష్ట్ర బీసీ విభాగ ఉపాధ్యక్షుడు వరప్రసాద్, మారుతి హాల్ రోడ్డులో సోపాల వీరా కేక్ కటింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.అన్ని కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ ఎంపీ అవినాష్ రెడ్డి ప్రజల కోసం శ్రమించే నాయకుడని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## కడప ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు





ప్రజాభూమి పోరుమామిళ్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశినాయన మండలం ఓబులాపురం వద్ద ఉన్న వివేకానంద సేవా సమితి ఆశ్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి అవినాష్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ రాష్ట్ర డాక్టర్ల విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని అనాథలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద్ రెడ్డి స్వయంగా అన్నం వడ్డించారు. అలాగే టేకురుపేట మాజీ సర్పంచ్ కల్లూరి రమణారెడ్డి రూ.10,000/- విరాళాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి చేతుల మీదుగా ఆశ్రమం చైర్మన్ కి అందజేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా వైయస్ అవినాష్ రెడ్డి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, నియోజకవర్గంలోని పలు ప్రజా ప్రతినిధులు కలసపాడు జడ్పిటిసి గురువిరెడ్డి, ఎంపీపీ నిర్మల నారాయణ, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సీఎం భాష, సుదర్శన్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ ,రాష్ట్ర మరియు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు చిత్త రవి ప్రకాష్ రెడ్డి, రాజీవ్ భాషా, చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, చిత్తా రాజశేఖర్ రెడ్డి, చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, తులసి సురేష్, మధుసూదన్ రెడ్డి, జయన్న, చాపాటి సాయి నారాయణ రెడ్డి , సూర్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇస్రో శాస్త్రవేత్తకు ఎస్టీయు అభినందన సన్మానం



ప్రజాభూమి పోరుమామిళ్ల : గ్రామ సచివాలయ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ప్రతిభ, పట్టుదలతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో శాస్త్రవేత్తగా ఎంపికైన సి.వి.రమేష్ కుమార్ ను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో ఘనంగా అభినందించి, సన్మానించారు.పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్ నందు రీజనల్ కన్వీనర్ వి.వి.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సన్మాన కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ఆర్థికకార్యదర్శి యు.సుబ్రమణ్యం, రాష్ట్రకమిటీ కన్వీనర్ వాకా చంద్రశేఖర్ మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగి, ప్రపంచంలోనే పేరొందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ నందు శాస్త్రవేత్తగా ఎంపిక కావడం మన ప్రాంతానికి ఎంతో గర్వకారణ మన్నారు. సాధారణ ఉద్యోగం చేస్తూనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని రమేష్ కుమార్ నిరూపించారని అన్నారు.గ్రామ సచివాలయ ఉద్యోగిగా ప్రజలకు సేవలందిస్తూ, మరోవైపు తన లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి,ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపిక కావడం యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో దేశ అంతరిక్ష రంగ అభివృద్ధికి మరింతగా సేవలందించి,దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ప్రతిభకు కృషి,పట్టుదల తోడైతే అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని రమేష్ కుమార్ చాటి చెప్పారన్నారు . ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపికైన రమేష్ కుమార్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనా రంగంలో తన శాయశక్తుల కృషిచేసి, దేశాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఓ.చంద్రహాసరెడ్డి, పుల్లయ్య, శేఖర్ బాబు, జయరామిరెడ్డి, ప్రదీప్,నాగసుబ్బారెడ్డి, రవీంద్రబాబు,నారాయణరెడ్డి, వెంకటరామయ్య,రామకృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి,మహానంది, వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 42 కేజీల భారీ కేక్ తో అభిమానం చాటిన కోడి రమణ - ఘనంగా ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాభూమి, పులివెందుల

పులివెందులలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానుల కేరింతల మధ్య ఘనంగా జరిగాయి.పట్టణంలోని శ్రీరామ్ హాల్ రోడ్డు సమీపంలో మాజీ కౌన్సిలర్ కోడి రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 42 కేజీల భారీ కేక్ కటింగ్ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్



వైకాపా ఇంచార్జ్ లు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 42 కేజీల కేక్ ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. వారితో పాటు మాజీ చైర్మన్లు వరప్రసాద్, చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎంపీ అవినాష్ రెడ్డి ప్రజాసేవకే అంకితమై, నాయకులు, కార్యకర్తలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేరంగుల చంద్రమౌళి, కనక, ఆర్టీసీ జయరాములు తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువ పూడ్చివేతతో మురుగునీరు స్తంభింపు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప--చెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం మాధవరం--1 గ్రామ సమీపంలో డ్రైనేజీ కాలువ పూడ్చివేయడంతో మురుగునీరు స్తంభించి దుర్వాసన వెదజల్లుతోంది. జాతీయ రహదారి పక్కన దుకాణదారులు కొంతమేర కాలువను పూడ్చివేయడంతో మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసనతో పాటు దోమల బెడద నెలకొందని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ మాట్లాడుతూ.. కాలువ పూడ్చివేత కారణంగానే డ్రైనేజీ స్తంభించిందని తెలిపారు. సంబంధిత దుకాణదారులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించడంతో పాటు స్తంభించిన డ్రైనేజీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే 'ఇంటింటికి టీడీపీ' లక్ష్యం



ప్రజాభూమి, సిద్ధవటం: ప్రజా సమస్యలే అజెండాగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమాన్ని సిద్ధవటం మండలంలోని ఎగువపేట గ్రామంలో గురువారం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే తమ ఆకాంక్ష అని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలు, పాత్రికేయులు, సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు జరిగాయని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, రాజకీయాల్లో సంయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజానాయుడు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు పార్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఇళ్లపై రీ సర్వే పూర్తి చేయాలి



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటం రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఇళ్ల గణన రీ సర్వేపై ఎన్యుమరేటర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు నెలల క్రితం హౌస్ రిజిస్ట్రేషన్ ఆపరేషన్‌లో చేపట్టిన ఇళ్ల గణనలో సుమారు 2,200 ఇళ్లు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఇళ్ల యజమానులు ప్రస్తుతం ఏ రాష్ట్రంలో, ఏ గ్రామంలో, ఏ మండలంలో నివసిస్తున్నారో ఎన్యుమరేటర్లు వివరాలు సేకరించి రీ సర్వే చేయాలని సూచించారు. ఖాళీ ఇళ్లకు సంబంధించిన రీ సర్వే ప్రక్రియను సెప్టెంబర్ 15లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిద్ధవటం రెవెన్యూ కార్యాలయానికి ఉచితంగా ప్రింటర్ వితరణ



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటం ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయానికి రూ.20 వేల విలువైన కంప్యూటర్ ప్రింటర్‌ను ఎన్నారై జయరామయ్య ఉచితంగా వితరణ చేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు అవసరమైన పరికరాలు, ఇతర సౌకర్యాల విషయంలో ప్రజా ప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## ఘనంగా ఎంపీ అవినాష్ రెడ్డి 43వ జన్మదిన వేడుకలు



ప్రజాభూమి,పులివెందుల

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి 43వ జన్మదిన వేడుకలు గురువారం పులివెందులలో ఘనంగా జరిగాయి.కడప జిల్లా చేనేత ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పులివెందుల శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి గుడి వద్ద కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్సీపీ నేత దుష్యంత్ రెడ్డి, ఎంపీ పీఏ రాఘవ రెడ్డి, కోడి రమణ, పార్నపల్లి కిషోర్, హృషికేశవ రెడ్డి, ఓ రసూల్, బాబురెడ్డి (అంబకపల్లి), ఇరికిరెడ్డి రెడ్డి వీరారెడ్డి, గంగరాజు పాల్గొన్నారు

## ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

### వైయస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం



ప్రజాభూమి,పులివెందుల

ప్రజల కోసం పరితపించే ప్రజానాయకుడు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలు పులివెందులలో ఘనంగా జరిగాయి.నాలుగో వార్డు మాజీ కౌన్సిలర్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో గురువారం



జగన్ క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్, మున్సిపల్ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైసీపీ ఇంఛార్జ్ లు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై చీరల పంపిణీని ప్రారంభించారు. మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోడి రమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎంపీ అవినాష్ రెడ్డి ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడే నాయకుడని, ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దేరంగుల చంద్రమౌళి, ఆర్టీసీ జయరాం, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీ భార్గవి, చెన్నూరు కార్తీక్, రవికుమార్, కొంగనపల్లి విజయ్ కుమార్, కలందర్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
శుక్రవారం 28 ఆగష్టు 2026

# రాత్రివేళ మహిళా హాస్టళ్లపై నిఘా అవసరం

## శ్రీ సిటీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల భద్రతపై అధికారుల దృష్టి సారించాలి.

### ప్రైవేట్ హాస్టళ్లపై ప్రత్యేక తనిఖీలు అవసరం

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట.

శ్రీ సిటీ పారిశ్రామిక ప్రాంతంలోని వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు నివసించే ప్రైవేట్ హాస్టళ్ల భద్రతా ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హాస్టళ్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా?

మహిళా హాస్టల్ నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ లేదా సంబంధిత స్థానిక సంస్థల అనుమతులు ఉన్నాయా?

భవనానికి, వినియోగానికి సంబంధించిన అనుమతులు సక్రమంగా ఉన్నాయా?

ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అనుమతులు, ధ్రువపత్రాలు చెల్లుబాటులో ఉన్నాయా?

హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం నమోదు చేసుకున్నారా?

భద్రతా సిబ్బంది, వార్డెన్లు, కేర్‌టేకర్ల వివరాలు సక్రమంగా ఉన్నాయా?

అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

హాస్టల్ ఫీజులపై కూడా తనిఖీ అవసరం

మహిళా ఉద్యోగుల నుంచి ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకులు అధిక మొత్తంలో హాస్టల్ ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న



నేపథ్యంలో అధికారులు దీనిపైనా దృష్టి సారించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

హాస్టల్ ఫీజు ఎంత వసూలు చేస్తున్నారు?

వసూలు చేస్తున్న మొత్తానికి రసీదులు ఇస్తున్నారా?

భోజనం, విద్యుత్, నీరు, ఇతర సౌకర్యాల పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారా?

ఉద్యోగులకు ముందుగానే ఫీజులు, ఇతర ఛార్జీల వివరాలు స్పష్టంగా తెలియజేస్తున్నారా?

వసూలు చేస్తున్న ఫీజుకు అనుగుణంగా వసతి, భోజనం, భద్రతా సౌకర్యాలు అందుతున్నాయా?

అనే అంశాలపై సంబంధిత అధికారులు విచారణ చేసి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఉద్యోగుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా?

హాస్టళ్లలో నివసిస్తున్న ఉద్యోగుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా?

మహిళా ఉద్యోగుల పేరు, కంపెనీ, అత్యవసర సంప్రదింపు వివరాలు రికార్డుల్లో ఉన్నాయా?

అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన కుటుంబ సభ్యుల వివరాలు నిర్వాహకుల వద్ద ఉన్నాయా?

ఉద్యోగుల ప్రవేశ--నిష్క్రమణ వివరాలు నిబంధనల ప్రకారం నమోదు చేస్తున్నారా?

మహిళా ఉద్యోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా?

హాస్టల్‌లో నివసిస్తున్న మహిళా ఉద్యోగులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందిస్తున్నారా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలి. ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా ఉండాలి అగ్నిమాపక పరికరాలు ఫైర్ అలారం అత్యవసర నిష్క్రమణ మార్గాలు విద్యుత్ భద్రత అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన.వంటి భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా తనిఖీ చేయాలి. రాత్రివేళల్లో భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా?రాత్రి వేళల్లో మహిళా వార్డెన్లు, కేర్‌టేకర్లు, సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో ఉన్నారా? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? గేటు భద్రత సక్రమంగా ఉందా? అనే అంశాలను పరిశీలించాలి. పోలీసుల నిఘా పెంచాలి రాత్రి పెట్రోలింగ్ ఆకస్మిక తనిఖీలు సీసీ కెమెరాల పరిశీలన భద్రతా సిబ్బంది తనిఖీవంటి చర్యలను పెంచాలని పలువురు కోరుతున్నారు. భద్రతతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛకు గౌరవం మహిళలు రాత్రివేళ బయటకు వెళ్లడం మాత్రమే తప్పిదంగా పరిగణించకుండా, వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా భద్రతా ప్రమాణాలు, హాస్టల్ నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నదే అధికారులు పరిశీలించాల్సిన అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కంపెనీలు--హాస్టల్ నిర్వాహకులు--పోలీసుల సమన్వయం అవసరం. మహిళా ఉద్యోగుల భద్రత కోసం కంపెనీల యాజమాన్యాలు, హాస్టల్ నిర్వాహకులు, పోలీసులు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఉద్యోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# దొంగలున్నారు జాగ్రత్త

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఏర్పేడు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండవలయును, ,సి సి కెమెరాలు ఉన్న డేవిడ్ డలాయిస్ రీస్ హాస్పిటల్ నందు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఉదంతం చూస్తే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి రెండు గంటల పైన ఇద్దరు వ్యక్తులు క్యాంపస్ లోపల ప్రవేశించి, కార్యాలయం ప్రాంతంలో కలియందిరిగారు ఇద్దరు కూడా ముఖమునకు ముసుగులు ధరించి, చేతిలోన, బొడ్డులోన ఇనుప రాడ్స్ పెట్టుకొని, తిరిగి, ఒక సిబ్బంది యొక్క మోటార్ సైకిల్ తీసుకెల్లి వేరే వైపున వదిలి వెళ్లడం జరిగింది. ఇందువిషయమై ఏర్పేడు పోలీస్ స్టేషన్ నందు కంప్లైంట్ ఇవ్వడం జరిగింది వారు దీనిని సీరియసగ్ తీసుకొని విశారిస్తున్నారు, కావున మన ప్రాంత వాసులు ఎవరైనా అపరిచిత వ్యక్తులు మీకు కంట పడినట్లయితే మన ఏర్పేడు పోలీస్ స్టేషనకు సమాచారం అందించగలరు, ముసుగులు ధరించిన వీరిద్దరి సీసీ కెమెరా పుట్టేజ్ చూడగలరు. కావున మన పరిసర ప్రాంతాలలో చాలా మంది కొత్త వారు ఉపాధికొరకు వచ్చి నిజంగా కష్టపడి నిజాయితీగా జీవించేవారు చాలామంది ఉన్నారు, ఇలాంటి దొంగలవలన మంచివారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రజల అభిప్రాయపడుతున్నారు.

# పల్లె వైద్యానికి కొత్త ఊపిరి: విలేజ్ హెల్త్ క్లినిక్

## అందుబాటులోకి తెచ్చిన ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.




వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్ భవనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



గురువారం ప్రారంభించారు. రూ. 17.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ క్లినిక్ భవనాన్ని ఉదయం 10:00 గంటలకు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని, అందులో భాగంగానే ఈ క్లినిక్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ క్లినిక్ అందుబాటులోకి రావడం వల్ల బత్తలవల్లం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. క్లినిక్ ప్రారంభంతో తమకు సొంత ఊరిలోనే వైద్యం దొరుకుతుందని, ఇకపై తిరుపతి, సత్యవేడు వరకు వెళ్లాల్సిన అవసరం లేదని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం మండల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తొలిదశలో కాన్సర్ ను గుర్తిస్తే చికిత్స సులభం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



ప్రారంభ దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం, సకాలంలో సరైన వైద్యం పొందడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చని డాక్టర్ జె.హరిబాబు అన్నారు.. గురువారం ఎస్.వి. ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తిలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు చిలి దేశంలోని అటకామా యూనివర్సిటీ వైద్య విభాగంలో ఆచార్యులుగా పని చేయుచున్న డాక్టర్ జె.హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్యఅతిథి డాక్టర్ జె. హరి బాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి అంటే తప్పనిసరిగా మరణమే అనే అపోహను తొలగించుకోవాలని, చాలా రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తిస్తే సమర్థవంతంగా సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని తెలియజేశారు. అలాగే సైన్సు మరియు పరిశోధనా రంగాల్లో విద్యార్థులకు ఉన్న కెరీర్ అవకాశాలను వివరించారు.

ఎస్ వి ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గంగారామ్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులను సమాజం ఆదరించి, సహకారం అందించాలని అన్నారు. కాన్సన్ పై అవగాహన కార్యక్రమం విద్యార్థులకు విజ్ఞానంతో పాటు భవిష్యత్తు పరిశోధన మరియు కెరీర్ అవకాశాలపై మంచి అవగాహన కల్పించిందని సదస్సు కన్వీనర్ డాక్టర్ సి. నాగేశ్వర్ రెడ్డి అన్నారు. అనంతరం సదస్సు నిర్వాహకులు ముఖ్యఅతిథి డాక్టర్ జె.హరిబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ శాఖ అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు, కన్వీనర్ డాక్టర్ సి. నాగేశ్వర రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ సాంసన్ రాజు,డాక్టర్ పి. వేణుగోపాల్, ఎస్. పద్మావతి,డాక్టర్. డి. భాస్కర్, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ తులసి, డాక్టర్ కే.సుబ్బారావు తదితర అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల భద్రతకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్య

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

మహిళా యూనివర్సిటీ రోడ్డులో క్రీడాకారులకు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.

పద్మావతి బాలికల పాఠశాలలో గుంటూరు వాలీబాల్ క్రీడాకారులకు పోలీస్ సేవలపై అవగాహన. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112ను వినియోగించుకోవాలని సూచన.

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు క్రీడాకారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీస్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.




మహిళా యూనివర్సిటీ రోడ్డులో ప్రయాణిస్తున్న క్రీడాకారులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, అప్రమత్తంగా వ్యవహరించడం తదితర అంశాలపై సాధారణ సూచనలు అందించారు. అలాగే పద్మావతి బాలికల పాఠశాలలో గుంటూరు నుండి వచ్చిన వాలీబాల్ క్రీడాకారులకు పోలీస్ అధికారులు సాధారణ భద్రతా సూచనలు అందించి, పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్లు, డయల్-112 అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. క్రీడాకారులు ప్రయాణ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిసరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య లేదా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# వాయు లింగేశ్వరుని సన్నిధి (వీధి)లో హైటెక్ దళారులు

## అడుగుపెడితేనే దోపిడీ షురూ...నిలువునా దోచుకుంటున్న వైనం...

## కొంతమంది దళారులు అయితే ఏకంగా అక్కడే తిష్ట వేసి భక్తులు నిలువునా మోసం చేస్తున్నారు.

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

పాపం పరిహారం కోసం దేశం నలుమూలల నుంచి వాయులింగేశ్వరుని సన్నిధికి వచ్చే భక్తులను హైటెక్ దళారులు నిలువునా ముంచేస్తూ దోచేస్తున్నారు. దేవస్థానం, పోలీసుల కళ్ల ముందే ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

అడుగుపెడితేనే దోపిడీ మొదలు...

దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కార్లను టార్గెట్ చేస్తూ..."పార్కింగ్ సార్, పార్కింగ్" అంటూ అడ్డగించడమే వీరి మొదటి అస్త్రం. అసలు టెండర్ దారులకు సంబంధమే లేకుండా నకిలీ రసీదు పుస్తకాలతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. శ్రీకాళహస్తిలో ప్రవేశించే భక్తుల కార్లను ఆపి దేవస్థానం పార్కింగ్ రసీదు అంటూ నకిలీ



రసీదులు ఇస్తున్నారు. టెండర్ దక్కించుకున్న వారు కాకుండా ఈ దళారులే పన్ను వసూలు చేస్తున్నారు.

రూమ్ కావాలా.? దర్శనం కావాలా.? అంటూ వల...

అమాయకంగా కనిపించే భక్తుడిని చూడగానే చుట్టుముట్టే ఈ గ్యాంగ్... "రూమ్స్ కావాలా సార్, దేవస్థానం రూమ్స్ ఇప్పిస్తా, వీఐపీ దర్శనం, స్పెషల్ దర్శనం... ప్యాకేజీ ఉంది సార్" అంటూ మాయ మాటలు చెబుతారు. నమ్మిన భక్తుడిని దేవస్థానం రూమ్స్ పేరుతో ప్రైవేట్ లాడ్జీలకు తోలి కమిషన్లు దండుకుంటున్నారు.

రాహు-కేతు పూజ పేరుతో....

ఇక రాహు-కేతు పూజ పేరుతో అయితే వీరి ఆగడాలకు అంతే లేదు. "మీకు డైరెక్ట్ గా టికెట్ ఇప్పిస్తాం, ఎక్కడా క్యూలో నిలబడక్కర్లేదు" అంటూ పూజ టికెట్టు పైన అదనంగా రూ.500 అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఆలయం నాలుగు గేట్లు వద్దా ఫుల్ అడ్డా

ఉదయం 6 గంటల నుంచి రాత్రి ఏకాంత సేవ ముగిసే వరకు ఆలయ నాలుగు ప్రధాన ద్వారాల వద్దే ఈ హైటెక్ దళారులు తిష్ట వేసి ఉంటారు. వీరిని ప్రశ్నించే నాథుడే లేడు. దేవస్థానం అధికారులు, విజిలెన్స్, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరికి అధికారుల అండదండలు ఉన్నాయా? అనే అనుమానాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇలాగే కొనసాగితే పుణ్యక్షేత్రం పరువు బజారున పడుతుంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ దళారీ మాఫియాపై ఉక్కుపాదం మోపి భక్తులను కాపాడాలి. లేదంటే..."భక్తులను కాపాడేది ఆ వాయులింగేశ్వరుడే" అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కోర్టు నోటీసులు కొండెక్కినట్టేనా...!

## పైప్ లైన్ కి పహారాకాస్తున్న ఫారెస్ట్ అధికారులు...

ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.

ఫారెస్ట్ లో పైప్ లైన్ కి పర్మిషన్ లేదని లిఖితపూర్వకంగా రాసిచ్చిన విషయం మర్చిపోయారా... తిరుపతి జిల్లా, వెంకటగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఏనుగువాడ గ్రామ పరిసర ప్రాంతాలలో అనధికారిక పైప్ లైన్ విషయం మీద సోషల్ మీడియా మాధ్యమాలలో అనేక వార్తలు ప్రసారమవుతున్న విషయం ప్రజలందరికీ తెలిసిందే...ఇదే విషయం మీద గత నెల రోజుల క్రితం వెంకటగిరి ఫారెస్ట్ అధికారులను వివరణ కోరగా పైప్ లైన్ వేసిన వ్యక్తులకు కోర్టు నోటీసులు ఇచ్చాం... నోటీస్ గడువు పూర్తయిన వెంటనే పైపులైన్ తొలగిస్తామని చెప్పారు... రోజులు గడుస్తున్న అధికారుల దృష్టిలో ఇచ్చిన నోటీసులకు మాత్రం గడువు పూర్తి అవ్వదు... పైప్ లైన్ తొలగించరు అంటూ ప్రజ




లు విచారణ వ్యక్తం చేస్తున్నారు...ఫారెస్ట్ అధికారులు ప్రతినెల ప్రభుత్వం నుంచి గుమ్మడికాయ అంత జీతం తీసుకుంటున్నారు... అందులో ఆవగింజంతైన బాధ్యతగా వ్యవహరించాలంటూ ప్రజలు కోరుకుంటున్నారు... రోజులు గడుస్తున్న పైప్ లైన్ తొలగించకపోవడంతో అధికారుల పనితీరుపై ప్రజలలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి... పైప్ లైన్ వేసిన వ్యక్తుల దగ్గర నుంచి అవినీతి సొమ్ము గట్టిగా... గుట్టుచప్పుడు కాకుండా పుచ్చుకుంటున్నారు అనుకుంటున్నారు ప్రజలు... మీ బాధ్యత నిర్వహించడంలో అంత బద్ధకం దేనికి... ఫారెస్ట్ ను పరిరక్షించడమే కదా మీ కర్తవ్యం... మరి అలాంటప్పుడు పైప్ లైన్ మీ కాళ్లకు కనిపించడం లేదా...లేక ప్రజలు చెబుతున్నట్లే అవినీతి కళ్లద్దాలు కల్లుకు పెట్టుకున్నారా...ఇదే విషయం మీద ఏనుగువాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫారెస్ట్ అధికారులకు నెల రోజుల క్రితం పైప్ లైన్ తొలగించాలంటూ స్పీడ్ పోస్ట్ ద్వారా అర్జీ సమర్పించాడు... ఫారెస్ట్ అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు అంటూ అర్జీదారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు... వేచి చూద్దాం...! ఫారెస్ట్ అధికారులు స్పందించేది ఎప్పుడో... తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించేది ఎప్పుడో... పైపులైన్ తొలగించేది ఎప్పుడో...

# పర్యావరణ పరిరక్షణకు తిరుపతి జిల్లా పోలీసుల మరో ముందడుగు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ కోడూరు రూరల్ సర్కిల్ పరిధిలోని పుల్లంపేట ఎస్వీవీడీఎస్ హైస్కూల్‌లో ఈరోజు మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడూరు రూరల్ సర్కిల్ సీఐ, పుల్లంపేట ఎస్ఐ కలిసి పాఠశాల ప్రాంగణంలో 250 మొక్కలను నాటారు. పాఠశాల పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ చెట్లు మానవాళికి స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచడం అంతే ముఖ్యమని సూచించారు. --"ఒక మొక్కను నాటడం అంటే ఒక భవిష్యత్తును నాటినట్లే"-- అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. నేటి చిన్న ప్రయత్నాలు రేపటి తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని భవిష్యత్తును అందిస్తాయని తెలిపారు.తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత మరియు ప్రజల్లో చైతన్యం పెంపొందించే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు తెలిపారు. పచ్చని, పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.




# 'పాండురంగా రెడ్డి'కి నివాళులర్పించిన బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ నందు ఆయన నివాసానికి చేరుకుని, పాండురంగారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుండి పాండురంగారెడ్డి పార్టీ బలోపేతానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. వారి మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఇంట్లో శుభకార్యాలు: టిడిపి నాయకులు, కార్యకర్తల గృహాలలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా హాజరై వారికి



తన మద్దతును, అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన వివాహాలు, ఇతర శుభకార్యాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను, కుటుంబ సభ్యులను సుధీర్ రెడ్డి ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో భారీ ఎత్తున ఎమ్మెల్యే వెంట నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంబంధం స్వామి భూ భోగాతాలపై విచారణ సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

మండలంలోని చిట్టత్తూరు రెవెన్యూలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న సంబంధం స్వామి భూ భోగా తలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు . భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం నిత్యం ప్రజలతో మమేకమై ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు నడిపిస్తున్న సిపిఐ డిమాండ్ల మేరకు, పేద ప్రజలకు భూములు ఇవ్వండి ఇళ్ల పట్టాలి ఇవ్వండి స్మశాన స్థలాలు కేటాయించండి అని పదేపదే కోరుకున్న కదలక లేని రెవెన్యూ సిబ్బంది కలిగినోళ్ళకు దాసోకమై కాగితాలు మార్చేస్తుంటే స్థానికంగా ఉన్నటువంటి భూమిలేని నిరుపేదలు భూములు కోసం ఎన్నో పర్యాయాలు అర్జీలు ధర్నాలు తాశీల్దార్ కార్యాలయం ఎదుట చేసిన ఫలించని ఫలితం. తొట్టంబేడు రెవిన్యూ అధికారులు రెవిన్యూ రికార్డులను తారుమారు చేసి అనువంశిక హక్కులను కల్పించడంలో కీలక పాత్ర పోషించినటువంటి ఘనత ఎవరిదో నిగ్గు తేల్చవలసిన సిపిఐ కఠనంగా డిమాండ్ చేస్తుంది. తమ సొంత ఆస్తుల లాగా డబ్బు ఇచ్చిన వారికి రాసి ఇచ్చినట్టు జరుగుతున్న ఈ రోజుల్లో ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు కోట్ల రూపాయలు విలువ చేసేటటువంటి ప్రభుత్వ భూములను కాపాడాల్సినటువంటి రెవెన్యూ అధికారులే అవతల వ్యక్తులకు ప్రభుత్వ భూములను దారా దత్తం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు ఇప్పటికైనా సంబంధం స్వామి భూ భోగాతాలపై సమగ్రమైనటువంటి



విచారణ జరిపి ఆ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు,లేని పక్షంలో పోరాటవే ప్రజలే తుది తీర్పు న్యాయమూర్తులుగా వ్యవహరించగ తప్పదని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్నటువంటి పేదలకు పంచుతామన్నారు.

**885 ఖాతాపై ప్రశ్నలు.. రికార్డులు వెలికితీసి నిజాలు తేల్చాలి**

**సంబంధం స్వామి పేరుతో నమోదైన భూములపై సమగ్ర విచారణకు డిమాండ్**

చిట్టత్తూరు రెవెన్యూ పరిధిలో సంబంధం స్వామి పేరుతో నమోదైన భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులపై స్థానికంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 885 ఖాతా నంబర్‌లో నమోదైన భూములకు సంబంధించి యాజమాన్య హక్కులు, అనువంశిక వారసత్వం, ఖాతా మార్పులు ఏ ఆధారాలపై జరిగాయన్న అంశాలను అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల సమాచారం ప్రకారం 885 ఖాతాలో 283/1, 285/4, 284/7, 284/4, 284/3, 284/2, 284/9, 284/12, 283/2బి తదితర సర్వే నంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం సుమారు ఐదు ఎకరాల వరకు భూమి ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఇందులో ఏ భూమి కొనుగోలు ద్వారా వచ్చింది, ఏది వారసత్వంగా వచ్చింది, మరికొన్ని సర్వే నంబర్లకు సంబంధించిన హక్కులు ఏ విధంగా నమోదయ్యాయన్న దానిపై పూర్తి వివరాలు బహిర్గతం కావాల్సి ఉంది.

**అనువంశిక హక్కుకు ఆధారాలేంటి?**

భూమి రికార్డుల్లో ఏదైనా భూమిని అనువంశిక/వారసత్వ హక్కుగా నమోదు చేసి ఉంటే, ఆ నమోదుకు ఆధారమైన పాత పట్టాదారు వివరాలు, వారసుల సంబంధాన్ని నిర్ధారించే పత్రాలు, మ్యుటేషన్ ఉత్తర్వులు, 1-బి, అడంగల్, పహాణీ తదితర రికార్డులు ఉండటం సహజం. అందువల్ల 885 ఖాతాలో అనువంశిక వారసత్వంగా నమోదైన భూములకు సంబంధించి మునుపటి హక్కుదారు ఎవరు? సంబంధం స్వామి తో వారసత్వ సంబంధం ఎలా నిర్ధారించారు? ఏ అధికారి ఏ ఉత్తర్వుల ఆధారంగా పేరు మార్చారు? అనే అంశాలపై రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**పాత ఖాతా నుంచి కొత్త నమోదు ఎలా?**

గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, పాస్‌బుక్కుల జారీ, 1-బి ఖాతాల నమోదు సమయంలో చిత్తత్తూరు గ్రామానికి చెందిన భూముల వివరాలు నమోదు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ సమయంలో ఉన్న పాత రికార్డులతో ప్రస్తుతం ఉన్న రికార్డులను అధికారులు సరిపోల్చాలని వారు కోరుతున్నారు.ప్రత్యేకంగా 884, 885, 886 ఖాతాలకు సంబంధించిన పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు, ఖాతా మార్పుల తేదీలు, మ్యుటేషన్ ఉత్తర్వులు పరిశీలిస్తే 885 ఖాతా ప్రస్తుత హక్కుదారు పేరుపైకి ఎలా వచ్చిందన్నది స్పష్టమవుతుందని స్థానికులు అంటున్నారు.

**అధికారిక రికార్డులే కీలకం**

ఈ వ్యవహారంలో ఎవరిపైనా ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పేర్కొనడం కంటే, సంబంధిత ప్రభుత్వ రికార్డుల ఆధారంగా నిజానిజాలను తేల్చడం అవసరం. ఖాతా మార్పులు నిబంధనల ప్రకారమే జరిగాయా? అవసరమైన పత్రాలు పరిశీలించారా? వారసత్వ హక్కును నిర్ధారించే ఆధారాలు ఉన్నాయా? అన్న విషయాలను తహశీల్దార్ కార్యాలయం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.అలాగే భూముల స్వభావం, ప్రభుత్వ భూమి లేదా పట్టా భూమి అనే అంశంపై కూడా సంబంధిత అడంగల్, పహాణీ, ఆర్ఓఆర్, 1-బి, మ్యుటేషన్ రిజిస్టర్లు, పట్టాదారు పాస్‌బుక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**

885 ఖాతాతో పాటు సంబంధిత సర్వే నంబర్లపై మండల స్థాయిలో మాత్రమే కాకుండా ఉన్నత రెవెన్యూ అధికారులు కూడా రికార్డులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. పాత రికార్డులు--ప్రస్తుత రికార్డులను పోల్చి చూస్తే భూముల యాజమాన్య చరిత్ర, ఖాతా మార్పుల క్రమం స్పష్టమయ్యే అవకాశం ఉంది. నిజంగా అక్రమం జరిగి ఉంటే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఖాతా మార్పులు చట్టబద్ధంగా జరిగి ఉంటే అందుకు సంబంధించిన ఆధారాలను అధికారులు బహిర్గతం చేసి అనుమానాలకు తెరదించాలి. అప్పుడే 885 ఖాతాపై నెలకొన్న సందేహాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# 164వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

సుదీర్ఘచరిత్ర కలిగినరేణిగుంట రైల్వే స్టేషన్ 164వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో స్టేషన్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గుంతకల్లు రైల్వే డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రేణిగుంట జంక్షన్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని కీలకమని అన్నారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ప్రాంగణం లో పలు సాంస్కృతిక,కార్యక్రమాలు నిర్వహించారు. రేణిగుంట రైల్వే స్టేషన్ చారిత్రక ప్రస్థానాన్ని, 164 ఏళ్లుగా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను అధికారులు కొనియాడారు. స్టేషన్ అభివృద్ధి, ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక సౌకర్యాలు, భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మాట్లాడుతూ.. రేణిగుంట రైల్వే స్టేషన్ చరిత్రలో 164 ఏళ్ల ప్రస్థానం ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. కాలానుగుణంగా స్టేషన్ అభివృద్ధి చెందుతూ వేలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న కీలక రైల్వే జంక్షన్‌గా ఎదిగిందన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు.కార్యక్రమంలో రైల్వే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో పాటు రైల్వే పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రత, స్టేషన్‌లో క్రమశిక్షణ, రైల్వే ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. రైల్వే పోలీసుల సమన్వయంతో కార్యక్రమం ప్రశాంతంగా విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా రిటైర్డ్ ఉద్యోగులకు పుష్ప గుత్యాలు అందించి దుశ్యాలవాలతో సత్కరించారు .164 ఏళ్ల చారిత్రక ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన స్టేషన్ మహోత్సవంతో రేణిగుంట రైల్వే స్టేషన్‌లో సందడి నెలకొంది. రైల్వే అధికారులు, ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లు,పోలీసు సిబ్బంది, ప్రయాణికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.





# గంజాయి రహిత సమాజమే లక్ష్యం - యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు పోలీసుల విస్తృత చర్యలు

**- జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు విస్తృతంగా గంజాయి ర్యాపిడ్ టెస్టులు.**

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండలం- రాజులపాలెంలోని సి.ఎం.ఆర్. కంపెనీ కార్మికులకు సుమారు 100 మందికి ర్యాపిడ్ పరీక్షలు.- యువత మత్తు పదార్థాల బారిన పడకుండా నిరంతర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు.- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బయో డ్రగ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లతో నిరంతర నిఘా. తిరుపతి ఆగష్టు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు యువత మత్తు పదార్థాల బారిన పడకుండా, సన్మార్గంలో నడిచేలా తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా తనిఖీలతో పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.




ఇందులో భాగంగా రేణిగుంట డీఎస్పీ పర్యవేక్షణలో ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజులపాలెం గ్రామంలోని సి.ఎం.ఆర్. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు ఈరోజు గంజాయి వినియోగంపై ర్యాపిడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో కలిసి సుమారు 100 మంది కార్మికులకు బయో డ్రగ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ర్యాపిడ్ స్క్రీనింగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చిన వ్యక్తులకు సంబంధించి నిబంధనల ప్రకారం తదుపరి విచారణ ప్రక్రియను చేపట్టి, అవసరమైన నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు మరియు ప్రజలు పోలీస్ శాఖతో కలిసి బాధ్యతగా పనిచేయాలని అధికారులు సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని, యువత తమ శక్తి, సమయాన్ని విద్య, ఉపాధి, క్రీడలు మరియు సమాజ అభివృద్ధి కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. యువతను మత్తు బారినుంచి కాపాడేందుకు తనిఖీలు, ర్యాపిడ్ స్క్రీనింగ్ పరీక్షలు మరియు అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# దేవాలయ భూముల పై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరులో దేవాలయ భూములను స్వాహా చేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నట్టు ఇటీవల అసత్య ప్రచారాలు చేస్తున్నారని అటువంటి వారికి బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికైనా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని గూడూరు ధర్మరాజుల స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ వాటం బెడ్ శివకుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానం వద్ద పాలకమండలి చైర్మన్ శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ధర్మరాజు స్వామి దేవస్థానం భూముల వేలం పాటల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సోషల్ మీడియాలో కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు న్యాయబద్ధంగా వేలంపాటలో ఎక్కువ మొత్తంలో భూములు పాడుకొని లీజుకు తీసుకున్నారని రాజకీయ దురుద్దేశంతో పిటీషన్లు పెట్టి భూముల వేలం పాటను నిలిపివేయాలని చూస్తున్నారని అన్నారు దేవాలయ విషయంలో చర్చకు సిద్ధంగా ఉన్నామని అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు లీజు దారుడు మట్టం మురళి మాట్లాడుతూ వేలంపాటలో అధిక మొత్తంలో పడుకొని చెన్నూరు గ్రామంలోని దేవాలయ భూమిని తీసుకున్నామని ఆరోజు అధికారులు చట్ట ప్రకారం నగదు కట్టించుకున్నారని అన్నారు లక్షలాది రూపాయలు వెచ్చించి పొలంలో మట్టి తోలి క్లీనింగ్ చేయించామని ఆ తర్వాత వచ్చిన అధికారి వేలంపాట చెల్లదని చెప్పారని ఎవరో కొంతమంది పిటీషన్ లు వేసి లీజు దారులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు ఈ వేలం పాటకు ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్యే పై దుష్ప్రచారం మానుకోవాలని సూచించారు ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు



## ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన తారు రోడ్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం.

నారాయణవనం మండలం నుంచి సింగిరికోన ఆలయం వరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును జిల్లా కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనుల నాణ్యత, ప్రస్తుత పరిస్థితి, భక్తులు మరియు స్థానిక ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రహదారి నిర్మాణంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి చెందారు .భక్తులు, స్థానిక ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా రాకపోకలు సాగించేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సింగిరికోనలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామివారి విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయంలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు అందించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి తీర్థ ప్రసాదాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులుశ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి చిత్రపటాన్ని అందజేశి వేదాశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగార్జున, ఆలయ చైర్మన్ గిరిబాబు, నారాయణవనం తహసీల్దార్ భార్గవి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## తిరుపతి జిల్లా సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికైన రేణిగుంట మండలం దీప

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

పుత్తూరులో జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది నూతన జిల్లా కమిటీకి రేణిగుంట మండలం నుండి దీప జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అనేకమంది ఆడపిల్లలు ఉన్నతమైన విద్యను చదువుకొని ఉద్యోగాలు లేకుండా ఆటోలు నడుపుతున్న సంగతి అందరికి తెలిసిందే వారి ఇంట్లో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందుల వల్ల అనేకమంది మహిళలు రోడ్డు మీదకు వచ్చే ఆటోలు నడుపుతున్నారు వీరందరూ కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు ఆటో తీసుకొని రోడ్డు మీదకు వస్తే అనేక రూపాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు ఆటోలో సంపాదించింది సాయంత్రానికల్లా గేట్లు కట్టడం పెనాల్టీలో కట్టడం సరిపోతా ఉంది ఒకపక్క ఆటో ఫైనాన్స్ వాళ్ళు అనేక విధాలుగా ఇబ్బందులు పెడుతున్నారు మహిళ ఆటో డ్రైవర్ల కి భద్రత కోసం వీరందరికీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సబ్సిడీ లోన్లు ఇచ్చి ప్రభుత్వం ఆటోలు కొనివ్వాలని తద్వారా మహిళలందరూ కూడా కుటుంబాలకు అండగా నిలవగలుగుతారు అని అన్నారు ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సిఐటియు యూనియన్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది.



## అధికారుల మధ్య సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

అధికారుల మధ్య సమన్వయం ఉంటేనే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సమర్థవంతంగా ముందుకు సాగుతాయని సత్యవేడు ఎమ్మెల్యే శ్రీ కోనేటి ఆదిమూలం అన్నారు. బాధ్యతతో కూడిన అధికారం ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని సాధించగలమని పేర్కొన్నారు. గురువారం వరదయ్యపాలెం మండలంలోని పులివెల్లం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పనులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## గూడూరు డిపో నందు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్, ధర్నా

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,


గూడూరు డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నెల్లూరు డి పి టి ఓ ఏకపక్ష నిర్ణయాలు పై, ఒంటెత్తు పోకడలతో ఉద్యోగులు ఆందోళన చెందుతూ కండక్టర్ లు, డ్రైవర్ లు, గ్యారేజ్ సిబ్బంది ఇబ్బందులు కు గురుకావడం వలన ఆర్ ఎం కి వ్యతిరేకంగా ధర్నా లు చెప్పట్టినారు. ఈ ధర్నా ను ఉద్దేశించి కార్యదర్శి వై వి నారాయణ మాట్లాడుతూ 1/2019 సర్కులర్ ని అమలు చేయాలని, సర్కులర్ ప్రకారం ఫ్యాటల్ ఆక్సిడెంట్ చేసిన డ్రైవర్ లకు లిఫ్ట్ ఇచ్చేటప్పుడు అదే డిపోలో ఉద్యోగం చేసే అవకాశం ఇవ్వాలని, డిపో బదిలీ చేసే విధానం మానుకోవాలి అని, జిల్లా స్థాయిలో ఉన్న పెండింగ్ సమస్య లను పరిష్కరించాలని కోరడమైంది. ఈ ధర్నా కార్యక్రమం లో డిపో అధ్యక్షులు .వాసులు, గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులు మరియు గ్యారేజ్ సిబ్బంది, కండక్టర్ లు, డ్రైవర్ లు అధిక సంఖ్యలో లొ పాల్గొన్నారు.




## విజయ దుర్గ ఒపపీటల్లో దుర్గా సప్త మహాయాగం

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు

గూడూరు పట్టణంలోని శ్రీ విజయ దుర్గ ఉప పీఠంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సర్వ శత్రుబాధ నివారణ సంపూర్ణ దేహారోగ్యం లోకశాంతి కొరకు విజయ దుర్గ అమ్మవారి దుర్గ సప్తశతి మహాయాగం కనకధార స్తోత్రం 108 పర్యాయాల హోమం మహా పూర్ణాహుతి నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిన్ అసోసియేషన్ జిల్లా నాయకులు శేషయ్య డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిఎం కార్యాలయం వద్ద ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గూడూరు డివిజన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు జిల్లా నాయకులు శేషయ్య మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ఆర్టీసీలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ సకాలంలో ప్రభుత్వం ఇవ్వడం లేదని వృద్ధాప్యంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు హైదరాబాదులో ఉన్న పీఎఫ్ కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలని ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కూడా సూపర్ లగ్జరీలో పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రత్నయ్య కిషోర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి ట్రాఫిక్ వ్యవస్థపై ఎస్‌పీఏ విద్యార్థులకు అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు తిరుపతి నగర రవాణా వ్యవస్థపై అకడమిక్ ఫీల్డ్ స్టడీలో భాగంగా ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్ డివిజన్ డీఎస్పీ కొండయ్య నాయుడు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ నాయక్ పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన అంశాలపై అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను అందించారు. ఈ సందర్భంగా ప్రజా రవాణా, పాదచారుల రాకపోకలు, ట్రాఫిక్ సిగ్నల్స్, యాత్రికుల రద్దీ నిర్వహణ, పట్టణ ట్రాఫిక్ ప్రవాహం, జాతీయ రహదారులు, భవిష్యత్ రవాణా అనుసంధానం తదితర అంశాలపై తిరుపతి నగరానికి సంబంధించిన ట్రాఫిక్ నిర్వహణ విధానాలను విద్యార్థులకు వివరించారు. ఫీల్డ్ సర్వే నిర్వహించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ అకడమిక్ ఫీల్డ్ స్టడీని సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు.

## శంకర్ రెడ్డికి వరదయ్యపాలెం మండల టీడీపీ నాయకుల ఘన సత్కారం




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం
సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శంకర్ రెడ్డిని వరదయ్యపాలెం మండల టీడీపీ నాయకులు, బత్తలవల్లం పంచాయతీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. తడ దిలీప్, సత్యవేటి సురేష్ ఆధ్వర్యంలో శంకర్ రెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, మండల నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ కేడర్‌ను బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్న శంకర్ రెడ్డి నాయకత్వాన్ని నాయకులు అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వరదయ్యపాలెం మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీ విజయానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిన్నమరెడ్డి యుగంధర్ రెడ్డి, క్లస్టర్-2 ఇన్‌చార్జి నిర్మల్, క్లస్టర్-3 ఇన్‌చార్జి మల్లీ నాయుడు, బత్తలవల్లం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు సత్యవేటి సుబ్బు, పంచాయతీ ఉపాధ్యక్షుడు నాగరాజు, టీడీపీ--బీజేపీ కూటమి నాయకుడు బిగువ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఎస్. మురుగేష్, బాలకృష్ణ, కాతారి ప్రభ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏంబియులో రేపు ఘనంగా స్నాతకోత్సవం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:
మోహన్ బాబు విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 29న (శనివారం) మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిజిస్ట్రార్ సారథి తెలిపారు. ఈ వేడుకకు చెన్నైకి చెందిన 'డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఛాన్సలర్ డాక్టర్ ఎ. సి. షణ్ముగం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఛాన్సలర్ మరియు ప్రముఖ సినీ నటులు డాక్టర్ ఎం.మోహన్ బాబుఅధ్యక్షతవహించనున్నారువిశిష్ట అతిథులుగా బి.ఏ.జి ఫిల్మ్స్ అండ్, మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాధ ప్రసాద్ , ఎంబియు ప్రో-ఛాన్సలర్ విష్ణు మంచు , శ్రీ విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ఎంబియు వైస్-ఛాన్సలర్ డాక్టర్ పి. వెంకటరమణ పాల్గొంటారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సారధి తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎంబియు ద్వారా 3517 మంది యూజీ మరియు పీజీ విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకోనున్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు రాజ్యసభ సభ్యులు మరియు బీసిసిఐ ఉపాధ్యక్షులు అయిన రాజీవ్ శుక్లా కి మరియు పద్మశ్రీ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వాటర్ కలర్ ఆర్టిస్ట్ అయిన పరేష్ మైథి' కి మోహన్ బాబు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయనుంది.

## వైభవంగా శ్రీ వరసిద్ధి వినాయ స్వామి విగ్రహ ప్రతిష్ట భారీ అన్నదాన కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
గూడూరు మండలం అయ్యవారిపాలెం గ్రామంలో నూతన శిలామయ మూషిక వాహన సహిత వరసిద్ధి వినాయక స్వామి శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలను 26, 27 తేదీల్లో నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. 27వ తేదీ ఉదయం 7 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, ప్రధాన హోమాలు, రక్షా సూత్రం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. 11.07 గంటలకు సుముహూర్తంలో విగ్రహ ప్రతిష్ట,కలశాలకు పుష్పార్చన, నూతన శిఖర ప్రతిష్ఠ, గోపూజ, స్వామివారి వాయు ప్రతిష్ఠ పూర్వక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదాన దాతలుగా పర్చూరు హరిబాబు గౌడ్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసిపి నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
తిరుపతి నగరంలోని పి ఎల్ ఆర్ కన్వెన్షన్ సెంటర్ లో గురువారం జరిగిన నాయుడుపేట మాజీ ఏఎంసీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి కుమారుడు గౌతమ్,స్నిగ్ధ ల వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య లు నూతన వధూవరులను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతాలతో సాగాలని. ఆకాంక్షించారు.అలాగే వారి వెంట ఉన్న వైసిపి నాయుడుపేట మండలం అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,సూళ్లూరుపేట మున్సిపల్ మాజీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి,నాయకులు పేట చంద్రారెడ్డి మెస్ భాస్కర్ రెడ్డి లు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# పిచ్చాటూరు మండలంలో రీ-సర్వే ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజా భూమి ప్రతినిధి పిచ్చాటూరు.
తిరుపతి జిల్లా,పిచ్చాటూరు మండలం కీళపూడి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగార్జునతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియ, సర్వే పనుల పురోగతి, రైతులకు అందుతున్న సేవలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కీళపూడి గ్రామానికి చెందిన రైతు హేమాద్రి పొలంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే అధికారులు చేపడుతున్న కొలతలు, భూమి వివరాల నమోదు, సంబంధిత రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతు హేమాద్రితో మాట్లాడి ఆయన సాగు చేస్తున్న భూమి, పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతుతో మాట్లాడిన కలెక్టర్ ఏటా ఎన్ని పంటలు సాగు చేస్తారని, ఏయే రకాల పంటలను సాగు చేస్తున్నారని వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎకరాకు వరి దిగుబడి ఎన్ని బస్తాలు వస్తుందని, పంటలకు అవసరమైన నీరు సరిపడా అందుబాటులో ఉందా, సాగునీటి వసతులు ఎలా ఉన్నాయి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. భూముల రీ-సర్వే ద్వారా రైతుల భూములకు సంబంధించిన హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు కచ్చితంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా రీ-సర్వే ప్రక్రియలో భాగంగా రైతులకు సంబంధించిన ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారా లేదా అని సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులందరి వివరాలను సక్రమంగా నమోదు చేసి, ఇ-కేవైసీ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ పారదర్శకంగా సర్వే ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూముల రీ-సర్వే ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేసి, భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో రైతుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సంబంధిత రికార్డులతో వాటిని సరిచూసుకోవాలని తెలిపారు. రీ-సర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు తహసీల్దార్ వై. చంద్రబాబు నాయుడు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు ఇతర సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

# కోటేశ్వరరావు పై నిప్పులు జరిగిన టిడిపి నేతలు

### తల్లిపాలు తాగి తల్లినే అవమానించే వ్యక్తి పల్లి కోటేశ్వరరావు:జిల్లా అట్రాసిటీ మెంబెర్ యేసుపోగు పెంచలయ్య



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
నెల్లూరు జిల్లా, గూడూరు నియోజకవర్గం శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన, పల్లి కోటేశ్వరరావు అనే గొడ్డలి పార్టీ వ్యక్తి పై, ఇంకోసారి ఎమ్మెల్యే పై అవాకులు, చెవాకులు పేలితే పద్ధతి గా ఉండదు అని హెచ్చరించిన టీడీపీ నాయకులు. గూడూరు పట్టణం లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అట్రాసిటీ మెంబెర్ ఏసుపోగు పెంచలయ్య మాట్లాడు తూ, పల్లి కోటేశ్వరరావు అనే వ్యక్తి రాపూరు నుండి 15సంవత్సరాల క్రితం గూడూరు కి వచ్చి, మాల మహానాడు అని చెప్పుకుంటూ దందాలు చేసుకుంటూ బ్రతికే వ్యక్తి అని, అటువంటి వ్యక్తి ని చేరదీసి గూడూరు పట్టణం ఎస్ సి సెల్ అధ్యక్షులు గా చేసిన వ్యక్తి గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ అని, అటువంటి వ్యక్తి పైనే హేయమైన వ్యాఖ్యలు చేయడం తల్లి పాలు తాగి తల్లిని అవమానం చేయడమే అని అన్నారు. అంతేకాకుండా నువ్వు ప్రెస్ అనే బోర్డు తగిలించుకొని విలేకరి అని చెప్పుకుంటూ చేసే చిల్లర వ్యాపారాలు కూడా మాకు తెలుసు. నువ్వు విలేకరివో కాదో పోలీస్ అధికారులు దాని సంగతి చూసుకుంటారు అన్నారు.అలాగే గూడూరు నియోజకవర్గం పరిధిలో ఎస్ సి లను గౌరవించి ఉన్నత పదవులు ఇచ్చిన ఎమ్మెల్యే ను అగౌరవం సోషల్ మీడియా లో మెస్సేజ్ పెట్టడం కరెక్ట్ కాదు అని, నిన్ను అన్నా అని పిలవాలి అంటేనే అసహ్యంగా ఉంది అని వేముల సునీల్ అన్నారు.గూడూరు నియోజకవర్గం లోని మైనింగ్, రెవిన్యూ, వివిధ శాఖల అధికారులను, సమాచారచట్టం పేరుతో దరఖాస్తు పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తూ బ్రతికే జీవితం నీది, నువ్వా ఎమ్మెల్యే విమర్శించేది, గత 15సంవత్సరాలక్రితం నీ జీవితం ఏంటో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో అని, నీకు ఎమ్మెల్యే చేసిన సహాయం మర్చిపోతే పుట్టగతులు ఉండవు అని గూడూరు డివిజన్ అట్రాసిటీ మెంబెర్ రావూరు సురేంద్ర హెచ్చరించారు.గూడూరు నియోజకవర్గం దళితులకు గౌరవం ఇచ్చి పదవులు ఇచ్చి మంచి వ్యక్తి డాక్టర్ సునీల్ కుమార్, లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ గా అవసరం ఇచ్చిన మంచి మనసున్న మారాజు డాక్టర్ సునీల్ కుమార్ పై విమర్శలు చేస్తే ఇకపై ఊరుకునేది లేదన్నారు.అయ్యా కోటేశ్వరరావు నువ్వు మొదటి నుండి చిల్లర దందుకునే స్థాయి నుండి వచ్చావు, ఇక్కడకూడా అదే పని చేస్తోంటే టీడీపీ కి చెడ్డ పేరు వస్తుంది అని ఎమ్మెల్యే సునీల్ కుమార్ నిన్ను పక్కన పెట్టాడు. దానికే విమర్శలు చేస్తావా, అంటే నువ్వు దందాలు, చిల్లర మధ్యస్తాలు చేస్తోంటే పార్టీ మౌనం గా ఉండాలా, ఇంకెప్పుడూ ఇలాంటి తప్పుడు సమాచారం సోషల్ మీడియా లో పోస్టు పెడితే ఒప్పుకునేది లేదన్నారు.పల్లి కోటేశ్వరరావు నువ్వు రాసే మెస్సేజ్ లకు, నువ్వు చేసే పనులకు చాలా తేడా ఉంది.పార్టీలు మారొచ్చు కానీ, నీ పద్ధతి మారడం లేదు అని, నువ్వు చేసే దందాలు, మధ్యస్తాలకు త్వరలోనే ఫుల్ స్టాప్ పడుతుంది అని కే ఆర్ దాసరి హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో గూడూరు నియోజకవర్గం ఎస్ సి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి (ఎఫ్ఏసి)గా డాక్టర్ జి.జగదీష్ బాధ్యతల స్వీకరణ

### -పేదరోగులకు మరింత మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యం





పజా భూమి ప్రతినిధి తిరుపతి
శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు మరియు ఉపకులపతి(ఎఫ్ఏసి)గా డాక్టర్ జి.జగదీష్ గారు గురువారం ఉదయం పాత డైరెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ డా।। అలోక్ సచన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ముందుగా స్విమ్స్ లోని ఎన్టీఆర్ సర్కిల్లో శ్రీ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. డా।। జగదీష్ బాధ్యతల స్వీకరణ అనంతరం తిరుమలలోని ఛైర్మన్ కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ మరియు స్విమ్స్ యూనివర్సిటీ ఛాన్సలర్ బిఆర్.నాయుడు ని మర్యాద పూర్వకంగా కలిసి తన జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.స్విమ్స్ లోని తన కార్యాలయంలో డా।। జగదీష్ గారు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకెళ్తామని తెలిపారు. స్విమ్స్ డాక్టర్ల బృందంతో సమన్వయం చేసుకుని పేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో బర్డ్ హాస్పిటల్‌తో పాటు స్విమ్స్ హాస్పిటల్‌ను రాష్ట్రంలోనే ప్రముఖ ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఎలాంటి వ్యాధులనైనా నయం చేసేలా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతామన్నారు. తిరుపతికి 50 కి.మి పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరిగిన అంబులెన్సుల ద్వారా స్విమ్స్‌కు తీసుకొచ్చి తక్షణం అత్యవసర చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మరో ఆరు నెలల్లో శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి రానుందని, ఈ భవనం పై అంతస్థులో ఎయిర్ అంబులెన్సు సౌకర్యం వుంటుందని చెప్పారు. స్విమ్స్‌లో అత్యవసరసేవల విభాగాన్ని మరింత విస్తరింపజేస్తామని, బ్లడ్ సెంటర్ సేవలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, టి.టి.డి. ఛైర్మన్ శ్రీ బి.ఆర్.నాయుడు కి, ఇ.ఓ. ముద్దాడ రవిచంద్ర కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ హాస్పిటల్, బర్డ్ హాస్పిటల్ వైద్యులు, ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లూరులో జోరుగా రీ-సర్వే.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా సర్వే అధికారి రాంప్రసాద్

### ప్రజల సందేహాలకు నిష్పక్షపాత సమాధానాలు ఇవ్వాలి - సర్వే ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచన



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు
తిరుపతి జిల్లా వాకాడు మండలం కల్లూరు పంచాయతీ పరిధిలోని కల్లూరు కొత్తపాలెం గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను జిల్లా సర్వే అధికారి రాంప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియ, భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన తదితర అంశాలను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రీ-సర్వే సందర్భంగా భూ యజమానులు, రైతులు ఎదుర్కొంటున్న సందేహాలను జిల్లా సర్వే అధికారి అడిగి తెలుసుకున్నారు.సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రజలకు ఎలాంటి అనుమానాలు, అపోహలు లేకుండా సర్వేకు సంబంధించిన ప్రతి అంశాన్ని స్పష్టంగా వివరించాలని తెలిపారు.ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ.. భూ రికార్డులను క్రమబద్ధీకరించడంతో పాటు భవిష్యత్తులో భూ సరిహద్దులు, హక్కులకు సంబంధించిన వివాదాలను తగ్గించేందుకు రీ-సర్వే ఎంతో కీలకమని పేర్కొన్నారు.భూ యజమానులు తమ వద్ద ఉన్న పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర సంబంధిత భూ వివరాలను అందుబాటులో ఉంచి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.భూ సరిహద్దుల నిర్ధారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాకాడు తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ అఖిల్ కుమార్ యాదవ్, సర్వేయర్లు శ్రావణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు కూడా పాల్గొని రీ-సర్వేకు సంబంధించిన పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# ప్రవక్త జన్మదిన వేడుకల్లో మానవత్వం చాటుకున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్!

### నిరుపేదలు, వృద్ధుల సేవలోనే అసలైన ఆనందం ఉంది: జాతీయ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్

### విశ్వ ప్రవక్త మహమ్మద్ సాహెబ్ జీవిత సందేశం కరుణ, శాంతి, మానవత్వపు ప్రతీక





ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
ప్రపంచ మానవాళికి కరుణను, శాంతిని, సమానత్వాన్ని బోధించిన మహనీయులు, ఇస్లాం మత చివరి ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లమ్) జన్మదిన వేడుకలను పురస్కరించుకుని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలుచోట్ల ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిరుపేద మహిళలకు పెద్ద ఎత్తున చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి ఆదర్శంగా నిలిచారు. అజ్ఞానాకారంలో కొట్టుమిట్టాడుతున్న సమాజానికి జ్ఞాన వెలుగులను ప్రసాదించడానికి ధరిత్రిపై అవతరించిన ఆ మహా ప్రవక్త జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు.
డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ప్రత్యేక సందేశం:
"ట్రస్ట్ స్థాపించినప్పటి నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నాము, సమాజంలో నిరుపేదలకు, అభాగ్యులకు మరియు వృద్ధులకు చేయూతనిస్తూ సేవ చేయడమే నా జీవితంలో ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ప్రవక్త మహమ్మద్ సాహెబ్ బోధించిన కరుణ, దయ, మానవత్వ మార్గంలోనే మా ట్రస్ట్ నిరంతరం నడుస్తుంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి జనరంజక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాము," అని ఆయన ఉద్వేగభరితంగా తెలిపారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది. కులమతాలకు అతీతంగా నిరుపేదలకు సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ స్థాపించినప్పటి నుండి అభాగ్యులకు, వృద్ధులకు, నిరుపేదలకు ఎప్పుడూ అండగా నిలుస్తూ వస్తోంది. సమాజంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేయూతనందించడమే తమ ధ్యేయంగా భావిస్తూ ట్రస్ట్ చేపడుతున్న నిరంతర సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా మారుతున్నాయి. తోటివారికి సాయం చేయడంలో లభించే ఆనందమే అసలైన సంతృప్తి అని నమ్ముతూ ఈ ట్రస్ట్ చేస్తున్న సేవలు సమాజంలో మానవత్వం ఇంకా జీవసేవా దృక్పథం సజీవంగా ఉన్నాయని చాటుతున్నాయి.

# ప్రధాని మోడీతో ముఖాముఖి.... ఎస్‌డీజీఎస్ కళాశాలకు అరుదైన అవకాశం

**-క్రీడలతో యువశక్తిని ఏకం చేయడమే లక్ష్యం --డ్రగ్స్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని పిలుపు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం ప్రాంతానికి చెందిన ఎస్‌డీజీఎస్ కళాశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో నిర్వహించిన వర్చువల్ సంభాషణలో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్, ప్రధాని మోడీ కే సాత్ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా 1,500కు పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది యువత, విద్యార్థులు, యువ క్రీడాకారులు, యువ నాయకులు పాల్గొన్నారు. ప్రధాని మోడీ కే సాత్ వర్చువల్ కార్యక్రమంలో యువ క్రీడాకారులు, విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడా రంగంలో దేశాన్ని మరింత బలోపేతం చేయాలంటే క్షేత్ర స్థాయిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి నాణ్యమైన శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. 2036 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఐదు నుంచి 15 ఏళ్ల వయసులోనే పిల్లల్లోని సహజ క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా దేశ యువత డ్రగ్స్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయిలో భారత యువతకు ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని అన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రధాని ప్రకటించారు. దేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, క్రీడా విద్యార్థులు, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధాని ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు. ప్రధాని సందేశం తమలో క్రీడలపై మరింత ఆసక్తి, స్ఫూర్తిని కలిగించిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**-విద్యార్థుల అస్వస్థతపై సమగ్ర విచారణ జరిపించాలి**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలం నందమూరి నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి కారణమైన బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం గురుకుల పాఠశాలను సందర్శించిన నాయకులు అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను అధికారులు సమగ్రంగా విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. నందమూరి నగర్‌లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రతకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పాఠశాల ఆవరణను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి, గడ్డి విపరీతంగా పెరిగిందన్నారు. దీంతో దోమలు, విషపురుగుల బెడద అధికమై విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలలో భోజనశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు అందించే బియ్యంలో పురుగులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆహార పదార్థాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కోరారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి వేళల్లో మరుగుదొడ్ల వద్ద తగినంత వెలుతురు లేకపోవడంతో మరింత సమస్యగా మారిందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని నాయకులు పేర్కొన్నారు. పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని, భోజనశాల ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, రాత్రివేళల్లో తగినంత విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షణ పెంచాలని కోరారు. 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించి, సురక్షితమైన వాతావరణంలో విద్యనభ్యసించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బద్రీనాథ్, నాగేంద్ర, రోషన్, మహేష్, నంద, వలీసాబ్, లక్ష్మీపతి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**-శాంతిభద్రతలు, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి -నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు-జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్**





ప్రజాభూమి, హిందూపురం టౌన్

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించేందుకు గురువారం ఆయన హిందూపురం పట్టణంలో పర్యటించారు. అడిషనల్ ఎస్పీలు అంకిత సురాన, కె.వి. మహేష్‌లతో కలిసి అంబేద్కర్ నగర్, కట్టకింద, నింకంపల్లి, హస్నాబాద్, త్యాగరాజు నగర్, ముక్కిడిపేట, బాపూజీనగర్, మేళాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి గణేష్ మండపాలు, ఊరేగింపు మార్గాలు, ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు, ఉత్సవ నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువత, మహిళలతో మాట్లాడి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు ముందుగానే అవసరమైన అనుమతులు తీసుకోవడంతో పాటు పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ తెలిపారు. అధిక ఎత్తు లేదా ప్రమాదకరమైన విగ్రహాలను ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల కారణంగా ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, అత్యవసర వాహనాలు వెళ్లేందుకు మార్గం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మండపాల వద్ద విద్యుత్ వైరింగ్, కనెక్షన్లను సురక్షితంగా ఏర్పాటు చేసి అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను నిర్ణీత శబ్ద పరిమితుల్లోనే వినియోగించాలని, రాత్రి 10 గంటల తర్వాత శబ్ద నియంత్రణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు, ఊరేగింపుల సమయంలో మద్యం సేవించకుండా నిర్వాహకులు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఊరేగింపు మార్గాలను ముందుగానే పోలీసులతో సమన్వయం చేసుకుని నిర్ణయించుకోవాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా, ఇతరులకు పంపకుండా ముందుగా నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. చిన్నపాటి వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ఉత్సవ నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణతో పాటు పగలు, రాత్రి డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లు, గొడవలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు భక్తిశ్రద్ధలు, క్రమశిక్షణ, పరస్పర గౌరవంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎస్పీ వెంట సీఐలు అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్ధన్, ఎస్సైలు రాజేష్, వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

## రిటైర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం తిరుపతి డిపో వద్ద రిటైర్ ఉద్యోగులు గేట్ మీటింగ్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ఎస్ మన్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2020 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని, ఈపీఎఫ్ కార్యాలయాన్ని బర్కత్‌పురా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని కోరారు. 1996--2014 మధ్య ఈపీఎఫ్‌కు జమ చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని, ప్రోరేటా పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతి కల్పించాలని, 2013--2017 పే స్కేల్స్ ఆధారంగా వాస్తవ వేతనాలపై పెన్షన్‌ను పునర్నిర్ణయించాలని కోరారు. అలాగే 58 ఏళ్లకు బదులుగా 62 ఏళ్ల వరకు ఈపీఎఫ్‌కు చెల్లించిన నాలుగేళ్ల మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.ఎస్.ఎన్. రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్, కోశాధికారి జి.ఎస్. మన్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ఎస్. ప్రకాష్, నాగేశ్వరరావు, ఏ.వి. రమణ, వి.ఎస్. మన్యం, కె.ఎం.వి. రాయులు, వినయ్ కుమార్, ఎం.కె. రెడ్డి, డి.పి.ఆర్. రెడ్డి, జి.వి.ఎం. కుమార్, ఎన్.ఎస్. మన్యం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి ఎంపీ డా.మద్దిల గురుమూర్తి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.



ప్రజా భూమి ప్రతినిధి(నాయుడుపేట)

తిరుపతి ఎంపీ డా.మద్దెల గురుమూర్తిని గురువారం మాజీ కిలివేటి సంజీవయ్య సూళ్లూరుపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తోపాటు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా.మద్దిల గురుమూర్తి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు,పార్టీ కార్యక్రమాలు,రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై వారితో చర్చించారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ శాసన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి,సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి,సూళ్లూరుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి వేణు యాదవ్,వైసీపీ నాయుడుపేట మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,నాయకులు కలతూరు శేఖర్ రెడ్డి,అలవల సురేష్, గండవరం సురేష్ రెడ్డి,మీజూరు రామకృష్ణ రెడ్డి, ఐత శ్రీధర్, గండవరం జగదీశ్ రెడ్డి,చిలక యుగంధర్,కాకి శ్రీరామమూర్తి,గొట్టికాటి రవీంద్ర రెడ్డి పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## గురవమ్మ -- అంత్యక్రియల్లో పాల్గొన్న సీపీఐ నాయకుడు జనమాల గురవయ్య



ప్రజా భూమి ప్రతినిధి
తొట్టంబేడు

తొట్టంబేడు మండలం పెద్ద సింగమల గ్రామానికి చెందిన రాఘవయ్య సతీమణి తొట్టంబేడు గురవమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతి పట్ల సీపీఐ పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురవమ్మ గారి మృతి విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ నాయకులు జనామాల గురవయ్య అంత్యక్రియల్లో పాల్గొని, రాఘవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోశారు.

## ప్రశ్నించే తత్వంతోనే శాస్త్రీయ ఆలోచనకు బీజం

**-చెకుముకి పరీక్షతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథానికి పదును**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చేందుకు చెకుముకి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కె. బసవనపల్లి ప్రధానోపాధ్యాయులు కె.హెచ్. రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని కె. బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ప్రారంభానికి ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హెచ్. రవీంద్రారెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం చదివి గుర్తుంచుకోవడం కాకుండా, ప్రతి అంశంపై ప్రశ్నించి తెలుసుకునే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన




ప్రజాభూమి ప్రతినిధి
నాయుడుపేట.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభాగం సహకారంతో గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్ – సి.సి – పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును నాయుడుపేట లోని "నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ " నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ అయిన కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏ.ఆర్.టి మందులు, ఎ.పి.శాక్స్ యాప్, క్యు.ఆర్ కోడ్, సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్ మాస్టర్ పి. మల్లిఖార్జున్, ఉపాధ్యాయులు సి.హెచ్. చంద్రశేఖర్, పి. శివ కుమార్, ఓ.ఆర్.డబ్ల్యూ లు యమ్. సాయిలక్ష్మి, పి. ధనలక్ష్మి, ఆర్. భువనేశ్వరి, ఎ.యన్.యమ్ జి.శ్రీలత, పి.ఇ లు మరియు 65 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. తదుపరి నాయుడుపేట మండలం లోని చిగురుపాడు గ్రామంలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కలిగించడం కోసం ర్యాలీ మరియు మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ లో 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 15 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి. శ్రీలత ద్వారా హెచ్ఐవి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

## ఎంపీ అవినాష్ రెడ్డి జన్మదినాన అగ్రహారం రవి ప్రభుత్వ ఆసుపత్రికి నెబులైజర్ల విరాళం



ప్రజాభూమి , పులివెందుల

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అగ్రహారం రవి మానవత్వం చాటారు.గురువారం పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి నెబులైజర్లను విరాళంగా అందజేశారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకాంత, డాక్టర్ సుకన్యకు వాటిని అందించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈ వైద్య పరికరాలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఎంతో ఉపయోగపడతాయని, ఎంపీ జన్మదినాన ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. విరాళం ఇచ్చిన అగ్రహారం రవిని అభినందించారు.కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు సదానంద, లలిత, సుజాత, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుండా బైక్ నడపొద్దు - ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు



ప్రజాభూమి,పులివెందుల

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు అన్నారు.జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో పూలంగళ్ల సర్కిల్, నాలుగు రోడ్ల సర్కిల్, ఓల్డ్ బస్టాండ్ సర్కిల్ లో హెల్మెట్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు.హెల్మెట్ లేకపోవడం వల్లే రోజూ దేశంలో 28 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రాణ భద్రత కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ అలవాటు చేసుకోవాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వద్దని, ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేని 19 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు.

## నేత్రదానంపై మహిళా విద్యార్థుల భారీ అవగాహన ర్యాలీ




ప్రజాభూమి, లింగాల

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు గురువారం నేత్రదానంపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీని ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత, సేవాసమితి అధ్యక్షులు రాజు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంధత్వాన్ని తగ్గిద్దాం – నేత్రదానాన్ని పెంచుదాం అని, ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు వస్తుందని, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.విద్యార్థినులు కళాశాల నుండి ప్రధాన వీధుల మీదుగా "నేత్రదానం మహాదానం, నేత్రదానం చేద్దాం – అంధులకు చూపు ఇద్దాం" అంటూ నినాదాలు చేశారు. పూలంగళ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు.

## ప్రశస్త్ 2.0పై ఉపాధ్యాయులకు అవగాహన

**- 31లోపు యాప్‌లోని 10 వీడియోలు వీక్షించాలి**



ప్రజాభూమి, వేంపల్లె

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రశస్త్ 2.0 యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఎంఈఓ వెంకట రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు వెంకటరామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ.. యాప్‌లోని 10 అవగాహన వీడియోలను ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా వీక్షించాలని సూచించారు. పాఠశాలల్లో దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ముందుగానే గుర్తించి, వారి అవసరాలను ప్రాథమికంగా అంచనా వేసేందుకు ప్రశస్త్ 2.0 ఉపయోగపడుతుందని తెలిపారు. చిన్నారుల్లో అభ్యసన, అభివృద్ధి తదితర సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి, అవసరమైన వారికి నిపుణుల సూచనలు, సహాయ సేవలు అందించేందుకు దోహదపడుతుందని వివరించారు. ప్రతి చిన్నారికి సమాన విద్యా అవకాశాలు కల్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ నెల 31వ తేదీలోపు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులంతా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులోని 10 వీడియోలను వీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భవిత పాఠశాల సిబ్బంది యశోద, సుజాత, ఐఈడీఎస్ఎస్ సిబ్బంది మస్తాన్‌వల్లి, స్వర్ణలత, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ కరువుతో జగన్ రాజకీయం

**- ఐదేళ్లలో రాయలసీమకు రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన జగన్ ప్రభుత్వం**

**- జీఓ 365 తెచ్చి 102 రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల రద్దు చేసిన జగన్**

**- రెండేళ్లలో హంద్రీనీవాకు రూ.5,050 కోట్లు ఖర్చు చేసిన కూటమి ప్రభుత్వం**

**-ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:

రాయలసీమలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి వాడుకుంటున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. గురు వారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..." రాయలసీమ ప్రయోజనాలను ఏనాడూ పట్టించుకోని జగన్, ఇతర వైసీపీ నాయకులు ఇప్పుడు కరువును అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తు న్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.13,500 కోట్లకు పైగా ఖర్చు పెట్టింది. మరో రూ.10,014 కోట్లు ఈ బడ్జెట్ లో ఖర్చు చేస్తున్నాం. 2014-19 మధ్య మేము రూ.12,441 కోట్లు ఖర్చు చేశాం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో పెట్టిన రూ.12 లక్షల కోట్ల బడ్జెట్ లో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 365 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 198 ప్రాజెక్టులను ప్రీ-క్లోజర్ చేస్తే... అందులో 102 ప్రాజెక్టులు రాయలసీమ లోనే ఉన్నాయి. హంద్రీనీవా విస్తరణ, వేదవతి, గుండ్రేవులు, హెచ్ఎల్సి కాలవ ఆధునీకరణ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం రాయలసీమకు జగన్ చేసిన ద్రోహం. హంద్రీనీవాకు ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో రూ.3,850 కోట్లు ఖర్చు పెట్టాం. ఈ ఏడాది మరో రూ.1,180 కోట్లు కేటాయించనున్నాం. జగన్ రద్దు చేసిన మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని 12 రాష్ట్రాలు, 315 జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకున్నాయి. ఇది ప్రపంచవ్యాప్త సమస్య. సాక్షి పత్రికలో 'తెలంగాణ నీళ్లు తోడేస్తుంటే బాబు మౌనం' అని రాస్తే, నమస్తే తెలంగాణలో 'కృష్ణా జలాల్లో ఏపీ దోపిడి' అని రాస్తున్నారు. ఒకే అంశంపై భిన్న కథనాలతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయం చేస్తున్నారు. కృష్ణా నదీ యజమాన్య బోర్డు నియమాల ప్రకారమే నీటి కేటాయింపులు జరుగుతున్నాయి. చంద్రబాబు నాయుడు గారి సమర్ధ నీటి నిర్వహణ వల్లనే గతేడాది నీటిని నిల్వ చేసి ఈరోజు కొంత వెసులుబాటు కలిగింది. 2027 జూలై వరకు తాగునీటి అవసరాలకు నీరు నిల్వ చేస్తున్నాం. కష్టకాలంలో రాజకీయాలు కాకుండా రైతులకు, ప్రజలకు అండగా నిలవాలని కాల్వ శ్రీనివాసులు అన్నారు.




## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఏ సూర్య కుమారి జువినైల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అమలు చేస్తున్న జువినైల్ జస్టిస్ యాక్ట్ పై సమీక్షా నిర్వహించారు. ఈ యాక్ట్ ఏర్పాటై 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సెప్టెంబర్ 5న నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జువినైల్ జస్టిస్ కమిటీ మీటింగ్ కు విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువినైల్ జస్టిస్ బోర్డు మరియు వివిధ శాఖలతో సమీక్షా నిర్వహించడం జరిగింది.ఈ 10 సంవత్సరాలలో యాక్ట్ అమలు చేస్తున్నా కార్యక్రమాలు శాఖలావారీగా వివరించారు. అదేవిధంగా సమర్థవంతంగా అమలుచేయుటకు అన్ని శాఖలనుండి సూచనలు మరియు సలహాలు తీసుకున్నారు.అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ యమ్ వేణుగోపాల్ రెడ్డి, జువినైల్ వెల్ఫేర్ డైరెక్టర్ వసంత బాల, మిషన్ వాత్సల్య జాయింట్ డైరెక్టర్ శిరీష, ఏసీపీ దైవ ప్రసాద్,యూనిసెఫ్ ప్రతినిధులు, డీపీఓలు, డీసీపీవో లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ లు, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యా పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు**




మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం మండల పరిధిలోని స్పెషల్ మున్సిపల్ మరియు రాజ్‌పేట పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి (DEO) యు.వి. సుబ్బారావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన 3, 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించి, వారి విషయ పరిజ్ఞానాన్ని, అభ్యసనా ఫలితాలను మరియు విద్యా పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం (మెడిటేషన్) చేయాల ని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా రివిజన్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించిన ఆయన, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా నోట్ బుక్ కరెక్షన్ చేసి, విద్యార్థులు చేసే తప్పులను సరిదిద్దేలా తగిన మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, వంట గది పరిశుభ్రతను, ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. స్వయంగా భోజనాన్ని రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ... 'మిషన్ మార్చ్-2027' లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.ఉపాధ్యాయులకు ముఖ్య సూచనలు:100% హాజరు: ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి.ప్రత్యేక శ్రద్ధ: విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక బోధన ద్వారా వారి అభ్యసనా స్థాయిని మెరుగుపరచాలి. కార్యాచరణ ప్రణాళిక: పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా సిలబస్ పూర్తి చేయడం, రివిజన్ నిర్వహించడం, నిరంతరం విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షించడం వంటి విద్యా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి.ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్యాంకుల అధికారులు మరియు సిబ్బంది నిరసనలు

ప్రజాభూమి ప్రతినిధి బంగారు పాల్యం

చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం లోని అన్ని బ్యాంకులు అధికారులు యు ఎఫ్ బి యు వారి ఆదేశాల మేరకు ఎస్బిఐ బంగారు పాళ్యం బజార్ బ్రాంచ్ నందు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన సవరించిన పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు విధానము వివక్షణతో కూడుకున్నందువలన వెంటనే పనితీరును వెనక్కి తీసుకోవాలని మరియు బ్యాంకు పని దినాలను ఐదు రోజులకు తగ్గించవలసిందిగా కోరుచు బ్యాంకు యొక్క సిబ్బంది కొరత, బ్యాంకు అధికారులు, సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా కోరుచు ఈ నిరసన తెలియజేసినారు. సెప్టెంబర్ 11, 28,29,30 తేదీలలో సిబ్బంది సమ్మె చేయుచున్నట్లు తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో యు ఎఫ్ బి యు నాయకులు సతీష్ కుమార్, వంశీ కృష్ణ,శివకుమార్, మరియు అన్ని బ్యాంక్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.






## ప్రజల నాలుకల పై జీవించిన కవి అన్నమయ్య..!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

సామాన్య ప్రజల నాలుకలపై జీవించిన కవి తాళ్ళపాక అన్నమయ్య అని డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి అన్నారు.తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల తెలుగు విభాగం మరియు అన్నమాచార్య ప్రాజెక్టు,తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనలు,శ్రీ వేంకటేశ్వర వైభవము అను అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు.అణగారిన వర్గాలకు ఆలయ ప్రవేశం,స్త్రీ విద్యకు ప్రోత్సాహం,భగవంతునిలో సామాన్యుని,సామాన్యుడిలో భగవంతున్ని దర్శించి అన్నమయ్య ప్రజా కవి అయ్యారని తెలిపారు.ఆత్మీయ అతిథి డాక్టర్ చెన్నకేశవులు అన్నమయ్య సంకీర్తనల్లోని భావసౌందర్యం మనసును రంజింపజేస్తుందన్నారు.మనుషులకు శారీరక ఆరోగ్యం కంటే మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని దానికి సంగీత,సాహిత్యాలు చాలా ఉపకరిస్తాయన్నారు. కళాశాల ప్రధానా చార్యులు డాక్టర్ సుజాత అన్నమయ్య సంకీర్తనల్లో శరణాగత భక్తి ప్రధానంగా కనిపిస్తుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ సి.లత అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా 150 పైగా జాతీయ,అంతర్జాతీయ సదస్సులను నిర్వహించినట్లు తెలిపారు.సదస్సు సంచాలకులు డాక్టర్ ఈశ్వరబాబు మారుతున్న కాలంలో అన్నమయ్య సంకీర్తనల విశిష్టతను నేటి తరానికి అందించే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ హరినాయుడు,విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ బాషా,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు నరసింహులు, వాసు,రాజీవ్ బాబు,రమ్యజ్యోతి,నాగరాజు,దివ్య,సత్యనారాయణ,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరువురి పై కేసు నమోదు చేసిన పుట్లూరు ఎస్సై సురేంద్రబాబు



ప్రజాభూమి పుట్లూరు


పుట్లూరు మండలం కోమటి కుంట్ల గ్రామానికి చెందిన జిల్లా రామాంజనేయులు మరియు దాదన విశ్వనాథ్ అను వ్యక్తులు ఈనెల 21వ తేదీన రాత్రి 8.30 గంటల సమయంలో ఇరువురికి ఉన్న పాత గొడవలు మనసులో పెట్టుకొని ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇరువురికి గాయాలు కావడంతో ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పుట్లూరు పోలీస్ స్టేషన్ నందు కేసుల నమోదు చేసినట్లు ఎస్సై ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కేసులు విచారణలో ఉన్నాయని ఆయన తెలిపారు..

## సోదర భావంతో మెలగాలి

**-శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులు సోదర భావంతో మెలగాలని వక్తలు సూచించారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం రక్షాబంధన్ వేడుకలను ఏజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, అన్న చెలెళ్లు లేదా అక్క తమ్ముడు మధ్యన ప్రేమ అనురాగాలకు సూచనగా ఈ పండుగ జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పరిపాలన అధికారి ప్రభాకర్ రెడ్డి, డీన్ నాగరాజు, ప్రైమరీ ఇంచార్జి అరుణ , ప్రి ప్రైమరీ ఇంచార్జి శ్వేత విద్యార్థులు పాల్గొన్నారు




## ఎన్.ఎస్.పి.ఆర్. కళాశాలలో ఖేలో ఇండియా సంవాద్

**-యూత్ ఐకాన్ స్పోర్ట్స్ ఐకాన్లను సన్మానించిన ప్రిన్సిపల్**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ శ్రీ సత్యసాయి జిల్లా, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో "ఖేలో ఇండియా సంవాద్ – ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్" కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. అంజలీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కళాశాలలో ఆన్ లైన్ ద్వారా ప్రధానమంత్రి ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆన్‌లైన్ ద్వారా సంభాషిస్తూ క్రీడలు, యువత అభివృద్ధి, ఆరోగ్యం, ఫిట్‌నెస్, మాధకద్రవ్యాల అనర్థాలపై ప్రసంగించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర పై తమ ఆలోచనలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రత్యేక ఎన్ ఎస్ ఎస్ దుస్తులను ధరించి , జాతీయ జెండాలను చేతబట్టి ఎన్ఎస్ఎస్ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా యూత్ ఐకాన్, స్పోర్ట్స్ ఐకాన్లను ప్రిన్సిపల్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసులు, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డా. యశోదా రాణి, సత్యసాయి విద్యాసంస్థల వ్యాయమ అధ్యాపకురాలు డా. బి. విజయలక్ష్మి, ఆల్ ఇండియా రేడియో కరస్పాండెంట్ ప్రతిమ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, యూత్ ఐకాన్ కె. జయమారుతి, ఎన్.ఎస్.ఎస్ అధికారి ఎన్.రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు, అధ్యాపకులు డా.శ్రీలక్ష్మి, ఎల్.ఆర్.రమేష్ పాల్గొన్నారు.

## కులగణన సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలి

**- తహసీల్దార్‌కు ఎంపీటీసీ సభ్యుల వినతి**

ప్రజాభూమి, వేంపల్లె



కులాల జాబితా, కులగణన సర్వేలను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వ హించాలని ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్రశేఖర్, భారతి, హబిబుల్లా (ఎంహెచ్) కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ శివశంకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కులగణన సర్వేలో ఉపయోగించే ప్రశ్నావళిని స్పష్టంగా, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా రూపొందించాలని, కులాల వర్గీకరణ, గణనలో స్పష్టమైన విధానాలను అవలంబించాలని కోరారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో అధికారుల అవగాహన లోపంతో రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సుమారు 2 వేల ఓట్లు క్రమసంఖ్య ప్రకారం ఒకేచోట లేకుండా వివిధ వార్డుల్లో నమోదయ్యా యని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఓటర్లందరి నీ క్రమసంఖ్య ప్రకారం ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్, ఎంపీడీఓలను వారు కోరారు.

## శ్రీ సీతరాముల వారి మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న కాటంరెడ్డి పవిత్ర రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, లింగమ నాయుడు పల్లి అరుంధతి వాడాలో వెలసిన శ్రీ సీతరాముల వారి మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు , ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు , ఎంపీపీ నిర్మలమ్మ తదితరులు. ముందుగా శ్రీ సీతరాముల వారి మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గంధం ఆనంద్ ,కోగిల రూపేష్ అండ్ కురవకనేరి యువత,గంధం ఆనంద్, కొగిల మనోజ్ ,చింత రాజేంద్ర ,కొగిల గంగరాజు, కోకిల ఉదయకుమార్, కోగిల ఓసరయ్య, తుమ్మూరు సురేష్, గంధం వెంకటకృష్ణయ్య ,తోట్టంబెడు చిన్నరంగయ్య, తోట్టంబెడు పేదరంగయ్య,కోగిల రూపేష్, &కురవకనేరి యువత తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవకులకు సైబర్ నేరాలు, మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి సేవకులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, అత్యవసర పోలీసు సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల టూ టౌన్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం సమన్వయంతో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆన్‌లైన్ మోసాల నివారణ, సోషల్ మీడియా



వినియోగంలో జాగ్రత్తలు, మహిళలు మరియు బాలికల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత విధానాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.తిరుమలలో యాత్రికులకు సేవలందించే సమయంలో భద్రతా ప్రమాణాలను పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా ఘటనలు కనిపించిన వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భక్తుల భద్రత పరిరక్షణలో శ్రీవారి సేవకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 పోలీసు సేవలను, సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న పోలీసు సహాయ వ్యవస్థలను అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తిరుమల టూ టౌన్ సీఐ, తిరుమల ట్రాఫిక్ సీఐ, టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఏవీఎస్ఓ కృష్ణయ్య, శ్రీవారి సేవకుల కోఆర్డినేటర్ తదితర అధికారులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో శ్రీవారి సేవకులు కార్యక్రమంలో పాల్గొని అవగాహన పొందారు.తిరుమలలో భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు



పోలీసు శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.


Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

ప్రజాభూమి
జనరల్ 13
శుక్రవారం 28 ఆగస్టు 2026

# ప్రత్యేక బ్యాంకు ఖాతా శిబిరాలు



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.** పోలవరం ప్రాజెక్టు పునరావాసం మరియు పునరావాస ప్యాకేజీ (ఆర్ ఙ ఆర్ ప్యాకేజీ) చెల్లింపులకు సంబంధించి కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాలకు చెందిన కొంతమంది ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల (పిడిఎఫ్స్) బ్యాంకు ఖాతా వివరాలు అందుబాటులో లేవని గుర్తించడం జరిగిందనీ, బ్యాంకు ఖాతాలు లేని పీడీఎఫ్లకు ప్రత్యేక బ్యాంకు ఖాతా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, చింతూరు ఐటీడీఏ పీవో శుభమ్ నొక్వల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో, ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ చింతూరు గారి ఆదేశాల మేరకు కూనవరం, వీఆర్ పురం, చింతూరు మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక బ్యాంకు ఖాతా శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందనీ అన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఆర్ అండ్ ఆర్ విభాగానికి చెందిన ఇద్దరు సిబ్బందితో పాటు బ్యాంకు ప్రతినిధులు/బ్యాంకర్లు కూడా శిబిరంలో అందుబాటులో ఉండి, బ్యాంకు ఖాతాలు లేని పీడీఎఫ్లకు కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందిస్తారన్నారు. ఈ శిబిరాల నిర్వహణ కోసం కూనవరం మండలానికి ఎం ప్రవీణ్ (మొబైల్ నంబర్: 8184948012), వీఆర్ పురం మండలానికి కె రామకృష్ణ (మొబైల్ నంబర్: 9948214414), చింతూరు మండలానికి కె రాంబాబు (మొబైల్ నంబర్: 8185808257)లను ఆర్ అండ్ ఆర్ విభాగం ఇన్చార్జ్లుగా నియమించడం జరిగిందన్నారు. పై సిబ్బంది సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే బ్యాంకు ఖాతా శిబిరంలో అందుబాటులో ఉండి, గ్రామాల వారీగా బ్యాంకు ఖాతాలు లేని పీడీఎఫ్ల జాబితా ప్రకారం వారితో సమన్వయం చేసి, అవసరమైన పత్రాలను స్వీకరించి, కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించుకునే ప్రక్రియలో సహకరిస్తారనీ తెలిపారు.

కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించుకోవాల్సిన ప్రతి పీడీఎఫ్ తప్పనిసరిగా క్రింది పత్రాలు/వివరాలను వెంట తీసుకురావాలి:

1. ఆధార్ కార్డు
2. ఆధార్ కార్డుకు రిజిస్టర్ చేయబడిన మొబైల్ నంబర్ కలిగిన మొబైల్ ఫోన్.
3. బ్యాంకు నిబంధనల మేరకు అవసరమైన ఇతర కెవైసి పత్రాలు.

ఆధార్ కార్డుకు రిజిస్టర్ చేయబడిన మొబైల్ నంబర్ పీడీఎఫ్ వద్ద తప్పనిసరిగా అందుబాటులో ఉండాలనీ అన్నారు. బ్యాంకు ఖాతా ప్రారంభించే సమయంలో అవసరమైన ఓ టి పి ధృవీకరణ కోసం ఈ మొబైల్ నంబర్ను ఉపయోగించాల్సి ఉంటుంది. కూనవరం, వీఆర్ పురం మరియు చింతూరు మండలాలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు లేని పీడీఎఫ్ల గ్రామాల వారీ జాబితాను ఈ ప్రెస్ నోట్కు అనుబంధంగా జత చేయడం జరిగింది. సంబంధిత పీడీఎఫ్లు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకుని, సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరై కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించుకోవాలనీ కోరారు. కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించుకోవాల్సిన పీడీఎఫ్లు 29.08.2026 లోపు తప్పనిసరిగా కొత్త బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత ఆర్ అండ్ ఆర్ విభాగం సిబ్బందికి సమర్పించాలి. నిర్ణయించిన గడువులోపు బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించకపోతే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లింపుల ప్రక్రియలో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున, సంబంధిత పీడీఎఫ్లు ఈ విషయాన్ని గమనించి, గడువులోపు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలనీ అన్నారు. అందువల్ల, జాబితాలో ఉన్న బ్యాంకు ఖాతాలు లేని పీడీఎఫ్లందరూ ఈ ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, 29.08.2026 లోపు సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరై కొత్త బ్యాంకు ఖాతా ప్రారంభించుకుని, అవసరమైన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలని పీవో కోరారు.

# జగదీశ్వర రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలి: చిర్ల జగ్గిరెడ్డి

## రియాన్ష్కు అన్ని చట్టబద్ధ హక్కులు దక్కేలా పోరాటం

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.** జగదీశ్వర రెడ్డి కుటుంబానికి జరిగిన అన్యాయంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. ఘటనలో నిజంగా ఉగ్రవాద కోణం ఉంటే వెంటనే కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి అప్పగించాలని కోరారు. రావులపాలెం గ్రామంలో చిన్నారి రియాన్ష్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, రియాన్ష్కు రెండోసారి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జగదీశ్వర రెడ్డి తనకు అత్యంత సన్నిహితుడని, ప్రేమ వివాహం అనంతరం కాకినాడలో కుటుంబ జీవితం ప్రారంభించి ఇరిగేషన్ కాంట్రాక్టర్గా పనిచేస్తూ అందరితో మంచి సంబంధాలు కొనసాగించారని తెలిపారు. అనారోగ్యంతో హైదరాబాద్లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తాను స్వయంగా పరామర్శించానని, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని అన్నారు.

**రియాన్ష్ భవిష్యత్తు బాధ్యత అందరిదీ**

జగదీశ్వర రెడ్డి మరణంతో చిన్నారి రియాన్ష్ భవిష్యత్తు దెబ్బతినకూడదని, అతనికి రావాల్సిన ప్రతి చట్టబద్ధ హక్కు, ఆస్తి, ఆర్థిక ప్రయోజనం పూర్తిగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనకు చెందిన ఆస్తులు, వ్యాపార మిషనరీ తదితర వాటిని ఎవరూ అక్రమంగా స్వాధీనం చేసుకోకుండా ప్రభుత్వం రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

**లవ్ జిహాద్'పై రాజకీయాలు వద్దు**

ఈ ఘటనను కొందరు 'లవ్ జిహాద్'తో ముడిపెడుతున్నారని, వాస్తవంగా అలాంటి కోణం ఉందా లేదా అనేది దర్యాప్తు సంస్థలే తేల్చాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబం విషాదంలో ఉన్న సమయంలో మతాలు, రాజకీయాలను ముందుకు తెచ్చి ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించడం సరికాదన్నారు.



**బాధిత కుటుంబానికి భద్రత కల్పించాలి**

నూకరాజు, భాస్కర్ రెడ్డి కుటుంబాలను గతంలో కూడా పరామర్శించినట్లు గుర్తు చేసిన చిర్ల జగ్గిరెడ్డి, బాధితులకు పోలీసు భద్రత కల్పించాలని సీఐ, డీఐజీలను కోరినా ఇప్పటికీ ఇంటి వద్ద భద్రత లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**జగన్పై ఆరోపణలు నిరాధారం**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మత మార్పిడుల ఆరోపణలు చేయడం పూర్తిగా అవాస్తవమని ఖండించారు. ఆయన పాలనలో కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 54 దేవాలయాలకు మంజూరులు ఇచ్చి అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు.

**యువతకు గుణపాఠం కావాలి**


నూకరాజు, భాస్కర్ రెడ్డి, జగదీశ్వర రెడ్డి కుటుంబాల్లో చోటుచేసుకున్న విషాదాలు ప్రతి ఒక్కరికీ గుణపాఠంగా నిలవాలని అన్నారు. వ్యక్తిగత నిర్ణయాల ప్రభావం కుటుంబాలపై, పిల్లల భవిష్యత్తుపై ఎంత తీవ్రంగా ఉంటుందో ఈ ఘటనలు చూపించాయని పేర్కొన్నారు. రియాన్ష్ రెడ్డికి న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అతనికి రావాల్సిన ప్రతి హక్కు దక్కేలా పోరాడతామని హామీ ఇచ్చారు.

# ఎల్ నినో ముసుగులో నిత్యవసర సరుకుల ధరలకు రెక్కలు

- **పంచదార కిలో రు.75, బెల్లం రూ.80**
- **బియ్యం, మంచి నూనె కూడా పెరుగుదల**
- **కూటమి ప్రభుత్వంపై పేదల విమర్శలు**

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు** ఎల్ ని నో ముసుగుతో నిత్యవసర సరుకుల ధరలకు రెక్కలు వచ్చాయి. ఈ ప్రస్తుత సాగు పంట దిగుబడి లెక్కలోకి తీసుకోకుండా రాబోయే పంట దిగుబడి ఎల్ నినో కారణంగా పడిపోతుందని, తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడతాయని దుష్ప్రచారం చేసి పెద్ద, చిన్న వ్యాపారులు కూడా నిత్యవసర సరుకులు ఇప్పటి నుంచే బ్లాక్ మార్కెట్కు తరలించి అధిక ధరలకు విక్ర యించే పనిలో పడ్డట్టు ఒక వైపు ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు రియల్ ఎస్టేట్ వల్ల పంటలు దిగుబడి తగ్గిందని మరికొందరు అంటుండగా, హార్మోజ్ జల సంధి రవాణా కారణమని మరికొందరు అంటుండగా, చెరకు ఉత్పత్తులను ఫ్యూయల్ కోసం వినియోగిస్తున్నారు అని మరి కొందరు వాధన. అందువల్లే పంచదార బాగా పెరిగిందని మరికొందరు చెబుతున్నారు. దీని కారణంగానే నిత్యవసర సరుకులు ధరలు ఆకాశం అంటు ఉన్నాయని పలువురు అంటున్నారు. . ఇక ఉల్లిపాయలు కూడా కిలో రూ. 50 వరకు పెరిగి పోయాయి. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల ఫలితంగానే ఇప్పటికీ నిన్న మొన్నటిదాకా 45 రూపాయలు ధర పలికిన కిలో పంచదార ఒక్కసారిగా రూ 75 రూపాయలకు చేరుకుంది. ఇక బెల్లం విషయానికొస్తే వస్తే కిలో 80 రూపాయలకు పైబడి చేరుకుంది. అదే చెరుకు బెల్లం అయితే ఏకంగా కిలో రూ. 200 రూపాయల పైబడి ఉంది. ఇక వంట





నూనె విషయానికొస్తే ప్యాకెట్ కు రూ. 20 రూపాయలు పైబడి పెరిగిపోయింది. ఇక బియ్యం ధరలు కూడా బాగాపెరిగాయి. ఒకో పాతిక కిలోల బస్తాకు రూ. 100 నుంచి 200 రూపాయలకు పెరిగాయి అని అంటున్నారు. అలాగే మంచి నూనె ప్యాకెట్లు కూడా రూ.20 నుంచి 30 రూపాయలు పైబడి పెరిగే అని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో నిత్యావసరకు నిత్యవసర సరుకులు ఎలా కొనుగోలు చేసేది ఎలా బతికేది అని పలువురు పేద ప్రజలు గగోలు పెడుతున్నారు . ఇంత జరుగుతున్న కూటమి ప్రభుత్వం పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడంలేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కూటమి పార్టీకి చెడ్డ పేరు రాక తప్పదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కావున ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన నిత్యావసర సరుకుల విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని, ధరలను అదుపు చెయ్యాలని ప్రభుత్వ పాలకులను, అధికారులను పేద ప్రజలు కోరుతున్నారు.

# నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలి

## ఎస్ ఐ ఆర్ ప్రగతిపై అధికార్లు,సూపర్వైజర్లు, బియల్వోలతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్ష

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.** స్థానిక నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రగతిపై నగర పాలకసంస్థ అధికారులు, సూపర్వైజర్లు, బియల్వో లతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై మ్యాపింగు, అనామలీస్, కరేక్షన్లు, ప్రగతిపై అర్బన్ లో 247 పోలింగు బూత్లు వారీగా 247 బియల్వో లతో సమీక్షించారు. ఏలూరు అర్బన్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రగతి చాలా పూర్ గా ఉందని జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఈరోజు హాజరుకాని సూపర్వైజర్లు, బిఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చెయ్యాలని, ఇదే పరిస్థితి పునరావతమైతే సస్పెండు చేస్తానని జిల్లా కలెక్టరు హెచ్చరించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికలు ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, ఎన్నికల ప్రక్రియను మనస్సు పెట్టి పనిచేస్తే మంచిఫలితాలు వస్తాయని అన్నారు. పొరపాట్లు, అలసత్వం వహిస్తే సస్పెండు అవుతారని, తీవ్రత బట్టి ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఉందని ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని మరియు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని, అనర్హులుగా గుర్తించిన వారి వివరాలను పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీ లించుకుని తాగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా, మనస్సు పెట్టి పనిచెయ్యాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్, మాపింగు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిం చాలని, బిఎల్వోలకు సీనియరు సూపర్వైజర్లతో మరొకసారి శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించా మన్నారు. ఓటర్ల జాబితా రూప కల్పనలో భాగంగా ఎస్ఐఆర్, ప్రోగ్రామ్, అనామలీస్ లోపాలు, వ్యత్యాసాలు, మరియు మాపింగు ప్రక్రియపై సూపర్వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో పనిచె య్యాలని అన్నారు. నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ఎస్ఐఆర్ పనులను వేగవంతం చెయ్యాలని అన్నారు. అనామలీస్ గుర్తింపు, ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలు మరియు లోపాలు, మాపింగు పనులు, పోలింగు కేంద్రా లు మరియు ఓటర్ల మాపింగు ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచెయ్యాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ ఎన్నికలు నేపథ్యంలో కమీ షనర్లు తమ పరిధిలో అనుభవజ్ఞులైన, సమ ర్థులైన అధికారులను గుర్తించి ఎన్నికల విధు లకు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాల్లో శాఖలు మధ్య సమన్వయం ఉండాలని, రాష్ట్ర ఎన్నికలు సంఘానికి నిర్ణీత గడువులో అవసరమైన వివరాలతో అనుసరణ నివేదిక సమర్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఆదేశించా రు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమీషనరు ఏ.భానుప్రతాప్, అడిషనల్ కమీష నరు డి.శ్రీనివాస రావు, అసిస్టెంటు సిటీ ప్లానరు బాబూరావు, తహశీల్దారు యస్.వి. రవీంద్రనాథ్, సూపర్వైజర్లు, బిఎల్వోలు, నగర పాలక సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల మధ్య ఘనంగా బిషప్ జయరావు జన్మదిన వేడుకలు




**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు** ఆర్.సి.ఎం. పీఠాధిపతులు మహాఘన డాక్టర్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు ఏలూరులోని 46, 50 డివిజన్లలో అక్షర సోషల్ సర్వీస్ సొసైటీ, ఏలూరు సిటీ న్యూ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం బిషప్ జయరావు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్.సి.ఎం. సంస్థ బాధితులకు అండగా నిలుస్తోందని తెలిపారు. 46వ డివిజన్ టీడీపీ ఇన్చార్జి ఈదుపల్లి రామలక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ఆర్.సి.ఎం. సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బిషప్ జయరావు జన్మదినం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో వృద్ధులు, వితంతువులు, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉండి నాగేశ్వరరావు, కాండ్రు యేసు, కాండ్రు మోషే, కర్రి కోటి దిలీప్, పెదపూడి రాజు, కొమ్ముకూరి రాజు, చింతాటి వెంకన్న, పాల్గొన్నారు.

## బీసీ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత -ఎంపీ పుట్టా మహేష్కుమార్



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు** బీసీ, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్కుమార్ అన్నారు. గురువారం చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో ఎంపీ సుడిగాలి పర్యటన నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో శ్రీనివాసపురం సొసైటీ గోడౌన్ను ప్రారంభించి, 'రెండేళ్ల కూటమి ప్రభుత్వం-అభివృద్ధి, సంక్షేమం' సభలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొగాకు ధర కిలో రూ.293కు చేరిందని, రైతులకు మరింత మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా రైతులు పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులందరి అంగీకారంతోనే నేవీ డిపో ప్రాజెక్టుపై ముందుకు వెళతామని, ఎవరికీ అన్యాయం చేయడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుల్లో కొత్త టెన్షన్

### మింగుడు పడని ఏకగ్రీవ ఎన్నిక విధానం

### తలలు పట్టుకుంటున్న వైసీపీ నేతలు

**ప్రజా భూమి ప్రతినిధి-పాలకొల్లు** వైసీపీ నాయకుల్లో కొత్త టెన్షన్ పట్టుకుంది. ఇటీవల వైఎస్ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులతో కలసి నిర్వహించిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయమై మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా ఏకగ్రీవం కాకుండా చూడాలని ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవంగా జరిగితే అక్కడ నియోజకవర్గ ఇన్చార్జ్ పై తగిన చర్యలు ఉంటాయని, టిక్కెట్టు కూడా లేకుండా చేస్తామని హెచ్చరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిలు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చెప్పిన విషయం కార్పొరేషన్, జడ్పీ, మున్సిపాలిటీలు వరకేనా లేక గ్రామపంచాయతీలు కూడా వర్తిస్తుందా అనేది తెలియక నాయకులు కార్యకర్తలు డైలమాలో పడ్డట్టు సమాచారం. గ్రామపంచాయతీలో అయితే సాధారణంగా ప్రతి గ్రామంలోనూ ఐదు నుంచి పది శాతం వరకు పంచాయతీ ల్లో గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలు సొంతంగా చేపడతామని చెప్పి కొందరు ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. ఇలాంటి సమయాల్లో కూడా బాధ్యులు చేస్తారా ఏంటి అనే విషయమై కూడా వైసిపి నాయకులు కార్యకర్తలు, తర్జన బర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఏ ఎన్నికలను ఉద్దేశించి అలా అన్నది రాబోయే కాలంలో అయినా తెలుస్తుందని, ఆ క్లారిటీ కోసం కూడా వేచి చూస్తున్నట్లు పలువురు అంటున్నారు.ഥ

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు** నూజివీడుమండలము జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరంలో ఈరోజు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనము, పద్యాలు పోటీలు నిర్వహించడం జరిగినదిఅని పాఠశాల ప్రధానోఫా ద్యాయుని విజయకుమారి తెలిపారు. తెలుగుభాషా దినోత్సవముగూర్చి వ్యాసరచనపోటీలు, పద్యాలు, జాతీయక్రీడా దినోత్సవము గూర్చి వకృత్వ పోటీలు, మరియు చిత్రలేఖనము పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రధానోఫాద్యాయని మాట్లాడుతూ క్రీడలు మానసిక,ఉల్లాసానికి దోహదంచేస్తాయని తెలిపారు. గిడుగు రామమూర్తి పేరు మీదతెలుగుభాషాదినోత్సవము జరుపుకుంటారని, అలాగే హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ జన్మదినోత్సవము సంధర్భము గా ప్రతిసంవత్సరము ఆగష్టు 29 క్రీడా దినోత్సవము, మరియు తెలుగు భాషాదినోత్సవము జరుపుకుంటామని ప్రధానోపాధ్యాయని విజయ కుమారి తెలిపారు. తెలుగు చిత్రలేఖనములో అఖిల ప్రధమ బహుమతి, అమ్ములు ద్వితీయ బహుమతి, చందు త్రుతీయ బహుమతి. తెలుగుపద్యాలు లో దుష్యంత్ ప్రధమ బహుమతి, గౌతమ్ ద్వితీయబహుమతి, రాధిక త్రుతీయ బహుమతి. క్రీడా వ్యాసరచన జూనియర్ విభాగంలో అభిరామ్ ప్రధమ బహుమతి, గౌతమ్ ద్వితీ య బహుమతి, అశ్వంత్ త్రుతీయ బహుమతి సాధించారు. క్రీడా వ్యాసరచన సీనియర్ విభాగంలో లక్ష్మీశ్రీనివాస్ ప్రధమ బహుమతి, అభిరామ్ ద్వితీయ బహుమతి, సూర్యతేజ త్రుతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు , నాగరాజు, ,దుర్గామల్లేశ్వరరావు,జయకుమారి,జాస్మిన్,యం వి.రమణ, రాజేంద్రప్రసాద్,భోగిప్రసాద్, కృష్ణ కుమారి వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

# ప్రజాభూమి

## జనరల్ 14

శుక్రవారం 28 ఆగస్టు 2026


## ఏలూరులో శరవేగంగా రోడ్ల అభివృద్ధి పనులు



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఏలూరు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.15వ ఆర్థిక సంఘం నిధులతో 26వ డివిజన్‌లో రూ.30.30 లక్షలతో,27వ డివిజన్ లో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.కొత్త పెన్షన్ల మంజూరుపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు.రానున్న రోజుల్లో అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్ ద్వారా ఏలూరుకు సుమారు రూ.180 కోట్ల నిధులు రానున్నాయని,వాటితో రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని బడేటి చంటి తెలిపారు.కార్యక్రమంలో పలువురు టీడీపీ,కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ఘన స్వాగతం పలికిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ జంగారెడ్డిగూడెం పర్యటన సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామంలో నూతన సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు.తదుపరి శ్రీనివాసాపురంలో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు,టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, జెడ్పీటీసీ పొల్నాటి బాబ్జి, జనసేన అధ్యక్షులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో కులాల వివరాలు అందుబాటులోకి

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించిన వివరాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీ వో అబ్దుల్ సలాం తెలిపారు. గురువారం నుంచి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వివరాలను పరిశీలించుకోవచ్చని పేర్కొన్నారు. వివ రాల్లో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి సవరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములై తమ వివరాలను పరిశీలించుకోవాలని ఎంపీడీవో కోరారు.

## మాజీ ఎంపీ కోటగిరి కోట మండలంలో పరామర్శములు



ప్రజా భూమి ప్రతినిధి-జకామవరపుకోట

ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్ మండలంలో వరుసపెట్టి పలువురిని పరామర్శించారు. మండల కేంద్రంలో విలేకరి పాపారావు మాతృమూర్తి వరలక్ష్మి మృతి చెందడంతో పాపారావు కుటుంబాన్ని, కొత్తూరులో మాజీ ఏఎంసీ డైరెక్టర్ బండారు ప్రసాద్ మృతితో.. ఆయన తండ్రి బండారు పుల్లయ్యను పరామర్శించారు. కొత్తూరులో గరగ చక్రధర రావు మృతితో ఆయన కుమారుడు నరసింహారావును, జోగడిగూడెంలో గుమ్మడి లక్ష్మినారాయణ మృతితో ఆయన కుమారుడు గుమ్మడి శ్రీనును, పాతూరులో పోలుబోయిన సతీష్ భార్య మృతితో పోలుబోయిన కుటుంబాన్ని శ్రీధర్ పరామర్శించారు. పాతూరులో ఇటీవల యాక్సిడెంట్‌కు గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటోన్న మాజీ ఉపసర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ తనయుడు నెక్కలపు సురేష్‌ను, పాతూరు పార్టీ నాయకులు ఘంటా భాస్కరరావు తండ్రి ఘంటా వెంకట్రావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాలకు ముందు ఇటీవల మండల వైసీపీ మాజీ అధ్యక్షులు మిడతా రమేష్ కుమారుడు వివాహం కావడంతో నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈయన వెంట పలువురు వైఎస్ఆర్‌సిపి పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో వర్షాధారిత పంటలు వేసుకోవాలి: ఎంపీపీ పోచమ్మ

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



ఏజెన్సీ ప్రాంతంలోవర్షాధారిత పంటలు వేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కే పోచమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఎంపీడీవో వరస వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జడ్పిటిసి వసంతరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఉప్పాల లలిత కుమారి లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు అందజేశారు. ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం తోనే ప్రజలకు సంక్షేమం,అభివృద్ధి

### ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి,

కూటమి ప్రభుత్వం తోనే ప్రజలకు సంక్షేమం అభివృద్ధి భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ట్రైకార్ ఛైర్మెన్ బొరగం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ములగలంపల్లిలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమం నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని వివరించడానికి వెళితే ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పొందిన వారు ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువనేత లోకేష్ ప్రజల కోసం కొత్త కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ఎంతో బాగుందని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశ భావం వ్యక్తం చేశారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సంకవల్లి సాయికృష్ణ, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్,తెలుగు యువత మండల అధ్యక్షులు గుడెల్లి లక్ష్మీనారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షులు తోట బాలరాజు, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు బలగాని సత్యనారాయణ, ఏఎంసి డైరెక్టర్ గద్దె సుబ్రహ్మణ్యం, తెలుగు రైతు నాయకులు ఉండవల్లి కిరణ్, ఉండవల్లి రామకృష్ణ,మరీదు పండు, ఆకిరెడ్డి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆకిరెడ్డి ప్రభాకర్, పోలవరం నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చాప రవి, ఉడా కొండయ్య, ఈడ నాగు, పీతల వెంకటేశ్వరరావు, వెలగల అజయ్, దొంగ మురళి, బలగాని అఖిల్, నరసింహమూర్తి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానములో ఘనంగా అభిషేక పూజలు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము నందు గురువారం పౌర్ణమి సందర్భంగా కళ్యాణ మండపం నందు చండీ హోమం నిమిత్తం 14 టికెట్లు గాను 14 దంపతులతో పూజలు హోమములుజరిపించుకుని ఉన్నారు. అభిషేక పండితులు భమిడి పాటి వెంకన్న భక్తులు తరపున పూజలునిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు మరియు ఆలయ ప్రధాన అర్చకులు సన్నిధిరాజురామకృష్ణమూర్తి కిష్టప్ప సూపరింటెండెంట్ వాసు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థినులకు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు



ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

మండలంలోని బూసరాజుపల్లి, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ అధికారులు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురుకుల విద్యాలయాల ఆవరణలో గురువారం జరిగిన ఈ సదస్సులో పోలవరం డి.ఎస్.పి మాట్లాడుతూ మహిళలు, బాలికల పైన జరిగే నేరాలు గూర్చి వివరించారు. మహిళలు, బాలికలు ఏ విధంగా అప్రమత్తం గా వుండాలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు గూర్చి వివరిస్తూ సోషల్ మీడియా లో వారి వ్యక్తిగత సమాచారం పెట్టడం వలన జరిగే సైబర్ వేదింపుల గూర్చి విద్యార్థులకు వివరించారు. అటువంటి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త లు గూర్చి విద్యార్థులకు తెలిపారు. శక్తి యాప్ ఉపయోగాలు, డయల్ 112 గూర్చి చెప్పారు. పోలీస్ సేవలు24 గంటలు అందుబాటులో ఉంటాయని, ఎటువంటి సహాయం కావాలన్న 112 కి కాల్ చేయాలని చెప్పారు. ఈ అవగాహన సదస్సులో గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు, బోధన, బాధనేతర సిబ్బంది, బుట్టయిగూడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏపీ వాసుల పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- గల్లంతైన వారి ఆచూకీని కనుగొనేలా కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరపాలన్న ముఖ్యమంత్రి
- బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేలా చూడాలని అధికారులకు సీఎం ఆదేశం



ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. మానస సరోవర్ యాత్ర వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రీకులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సీఎంకు తెలిపారు. వీరికి సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్టు ఇప్పటివరకు గుర్తించామని, వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండటంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. కర్నూలు-ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని వారితో తాము మాట్లాడమని వివరించారు. అలాగే తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో సురక్షితంగా ఉన్నారని వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించినట్టు అధికారులు చెప్పారు. ఇక చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు వంటి ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ తరపున మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేవని అధికారులు సీఎంకు వివరించారు. బాధిత కుటుంబాలకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్ లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం సమాచారాన్ని సేకరిస్తున్నామని కేంద్ర ప్రభుత్వంతో పాటు... ఖాట్మంటూ, చైనాల్లోని ఎంబసీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షిత తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తాజా వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థినిల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా...?

- పైసల్ ఇస్తేనే మీకు చికిత్స చేయిస్తాము అంటున్న వాచ్మెన్
- అనంతపురం కావేరి ఆసుపత్రిలో ప్రియదర్శని చికిత్స
- "మా బిడ్డ పరిస్థితి చూడండి తండ్రి రామాంజనేయులు ఆవేదన

ప్రజాభూమి ప్రతినిధి-శింగనమల

శింగనమల మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో 6 తరగతి చదువుతున్న ప్రియదర్శని విద్యార్థిని అనారోగ్యం బాగోలేక మూడు రోజుల నుంచి సరిగా ఆహారం తీసుకోక వాంతులు విరోచనాలతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది కనీసం సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లాలంటే పైసలు ఇవ్వాల్సిందే వాచ్మెన్ అంటూ విద్యార్థినితో డిమాండ్ చేసింది అంటూ ప్రియదర్శిని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు సిబ్బంది వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు నిన్నటి రోజు తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి మా కూతురూ కి ఆరోగ్యం బాగోలేదు కదా మాతో పంపించాలంటూ వాళ్లు కోరారు వాచ్మెన్ సిబ్బంది గంగ తల్లిదండ్రుల తో దురుసు ప్రవర్తన మీ కూతురికి ఏమైంది అంటూ వారి కి ప్రియదర్శిని చూపించండి అడిగినందుకు దురుసుగా బదులిచ్చింది ఎవరు చెప్పుకుంటావో చెప్పుకోపో అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసింది ప్రియదర్శిని తల్లిదండ్రులు తెలిపారు మా కూతురు అనారోగ్యం కారణంగా ఆసుపత్రి పాలైన ఘటనపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురంలోని కావేరి హాస్పిటల్‌లో ప్రియదర్శని చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.విద్యార్థినికి అనారోగ్య సమస్య తలెత్తిన సమయంలో కేజీబీవీ సిబ్బంది తగిన సమయం లో స్పందించారా వైద్యం



అందించడంలో ఏమైనా నిర్లక్ష్యం జరిగింది? అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. తమ కుమార్తె పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు విచారణ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

**ప్రియదర్శని తండ్రి**

రామాంజనేయులు మాట్లాడుతూ, తమ కుమార్తె ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో తీవ్ర ఆందోళనకు,గురవుతున్నామని తెలిపారు. "మా బిడ్డ ఆరోగ్యం విషయంలో మాకు న్యాయం కావాలి. కేజీబీవీ సిబ్బంది వ్యవహరించిన తీరుపై అధికారులు విచారణ చేయాలి" అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యంపై పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులు ఎవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## బిసి రిజర్వేషన్లను అడ్డుకోవద్దు జగన్

### -డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

ప్రజా భూమి ప్రతినిధి-శ్రీకాళహస్తి టౌన్

అనాదిగా అణచివేతకు గురైన బీసీల ఎదుగుదలకు అండగా ఉన్న తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలబడ్డారన్న ఒకే ఒక్క కక్షతో బీసీల రిజర్వేషన్లను అడ్డుకోవద్దని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు వైసిపి అధినేత జగన్ రెడ్డికి సూచించారు.ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు స్థానిక పూసల వీధిలోని ప్రజల వద్దకు వెళ్ళి ఎన్డీయే కూటమి యొక్క రెండేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.వెనుకబడిన కులాలకు రాజకీయ సాధికారత దక్కకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసిపి, స్థానిక సంస్థలలో తమ ప్రాతినిధ్యం పెంచుకోవడానికి బిసిలకు ఎంతో ఉపయుక్తమైన 34 శాతం రిజర్వేషన్లను అడ్డుకునే ఉద్దేశంతో, కుట్ర పూరితంగా తన పార్టీకి చెందిన నాయకులైన రామాంజనేయులు మరియు బిర్రు ప్రతాప రెడ్డి అనే వారితో హైకోర్టులో కేసులు వేయించిన బిసి ద్రోహి జగన్ రెడ్డి ఆరోపించారు.స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు న్యాయంగా దక్కవలసిన 34 శాతం రిజర్వేషన్లను ఏకంగా 10 శాతం తగ్గించి, 24 శాతం చేయడం ద్వారా 17,000 పైగా పదవులు బీసీలకు దక్కకుండా చేసి, వారికున్న రాజకీయ అవకాశాలను జగన్ రెడ్డి నాశనం చేస్తే, వెనకబడిన కులాలు రాష్ట్రానికే వెన్నుముక అని నమ్మి, 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించిన బీసీ జనోద్ధారకుడు సీఎం చంద్రబాబు అని కొనియాడారు. కాపలాదారులతో, ఎలక్ట్రీషియన్ మరియు అటెండర్లతో గ్రూప్ 1 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించిన మోసకారి జగన్ రెడ్డి ప్రభుత్వ నిర్వాకం వలన ఇంటర్మీడియట్ విద్యను మూడు దఫాలు ప్రయత్నించి, నాలుగో దఫా ఉత్తీర్ణుడైన వ్యక్తికి గ్రూప్ ఉద్యోగం కట్టబెట్టారని ఆరోపించారు.తాము పాలించిన ఐదేళ్ళపాటు బీసీల అణచివేత చర్యలు తప్ప,మరో మంచి ఆలోచన చేయని వైసిపి, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య,అమర్నాథ్ గౌడ్ లాంటి ఎందరో బిసి సోదరుల ప్రాణాలను బలిగొని, బీసీల పట్ల వంద శాతం వ్యతిరేక భావంతో జగన్ రెడ్డి ప్రవర్తించాడని,ఇకనైనా బీసీ వ్యతిరేక విధానాలను విడిచి పెట్టాలని జగన్ రెడ్డిని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ చైర్మన్ బీమాల భాస్కర్,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి,తిరుపతి పార్లమెంటు నాయకులు పూల శేఖర్,శంకరయ్య, సుబ్రహ్మణ్యం,సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

